RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి ®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal



సంపుటి: 19 సంచిక:227 హైదరాబాద్, శుక్రవారం,14 మార్చి 2025 పేజీలు: 12 వెల: 1.00

## ఎవరి ట్రాప్‌లోనూ పడను: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

దిల్లీ: గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధముందని.. ఫొటోలు దిగి చూపించుకోవాల్సిన అవసరం లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తానెవరో తెలియకుండానే పీసీసీ అధ్యక్షుడు, సీఎం పదవులకు ఎంపిక చేస్తారా? అని ప్రశ్నించారు. ఎవరి ట్రాప్‌లోనూ తాను పడనన్నారు. విదేశాంగ మంత్రి జైశంకర్‌ను కలిసేందుకు దిల్లీ చేరుకున్న సందర్భంగా సీఎం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ గవర్నర్ ప్రసంగానికి రావడం కాదని.. అసెంబ్లీలో చర్చకు హాజరుకావాలన్నారు. డీలిమిటేషన్.. లిమిటేషన్ ఫర్ సౌత్ అని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి రావాల్సిన వాటిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. ఆయా అంశాలు సాధించుకురావాలనే ఆయన్ను ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు.

‘భారత్ సమ్మిట్’కు క్లియరెన్స్ కోసమే జైశంకర్‌ను కలుస్తున్నా..

తెలంగాణలో ‘భారత్ సమ్మిట్’ పేరిట ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీఎం తెలిపారు. సుమారు 60 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ సమ్మిట్‌కు అమెరికా మాజీ



అధ్యక్షుడు బరాక్ ఒబామా తదితరులు హాజరయ్యే అవకాశముందని చెప్పారు. భారత్ సమ్మిట్‌కు కేంద్ర ప్రభుత్వం క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుందని.. ఆ విషయంపైనే విదేశాంగ మంత్రి జైశంకర్‌ను కలుస్తున్నట్లు సీఎం తెలిపారు. రాష్ట్రంలో ‘మిస్ వరల్డ్’ పోటీలు జరగనున్నాయని.. నెలరోజుల పాటు దీనికి సంబంధించిన కార్యక్రమాలు ఉంటాయన్నారు. దీనికోసం రెండు రోజుల్లో అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

## 17మంది మావోయిస్టుల లొంగుబాటు.. 9మంది తలలపై 24లక్షల రివార్డు



బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 17మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 9మంది తలలపై రూ.24లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. సీఆర్‌పీఎఫ్ పోలీసుల ఎదుట లొంగిపోయిన వారిలో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు దినేష్ మొడియం (36), అతడి భార్య జ్యోతి తాటి అలియాస్ కళా మొడియం (32) ఉన్నట్లు తెలిపారు. దినేష్ తలపై రూ.8లక్షలు, జ్యోతిపై రూ.5లక్షల చొప్పున రివార్డు ఉన్నట్లు బీజాపూర్ సీనియర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు.

అలాగే, ఏరియా కమిటీ సభ్యులు దుడ్ల కరంపై రూ.5లక్షలు, మరో ఆరుగురి తలలపై రూ.లక్ష చొప్పున రివార్డు ఉందన్నారు. వీరందరూ గంగలూరు ఏరియా కమిటీలో వివిధ హోదాల్లో చురుగ్గా ఉన్నవారేనన్నారు. వీరి లొంగుబాటు వెనుక డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డు, బస్తర్ ఫైటర్స్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా దళాలు కీలక పాత్ర పోషించినట్లు ఎస్పీ వివరించారు.

సైద్ధాంతిక లోపాలు, అమాయక గిరిజనుల పట్ల కొందరు సీనియర్లు దోపిడీకి పాల్పడటం వంటి చర్యలతో కలత చెందడం, భద్రతా బలగాల ప్రభావం పెరిగిన నేపథ్యంలో వీరంతా లొంగిపోయినట్లు బీజాపూర్ సీనియర్ ఎస్పీ తెలిపారు. అలాగే, గ్రామాల్లో అభివృద్ధి కోసం తాము చేపట్టిన నియా నెల్లనార్’ (యువర్ గుడ్ విలేజ్) అనే పథకం పట్ల ఆకర్షితులయ్యారన్నారు. లొంగిపోయిన వారికి రూ. 25వేలు చొప్పున సహాయం అందించామని.. ప్రధాన స్రవంతిలోకి చేర్చేందుకు ప్రభుత్వ విధానం ప్రకారం వారికి పునరావాసం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గతేడాది బస్తర్‌లో 792మంది మావోయిస్టులు లొంగిపోగా.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బీజాపూర్ జిల్లాలో 65మంది లొంగిపోయారు.



## తెలంగాణలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవం

హైదరాబాద్: తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐదు స్థానాలకు 5 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్, భారాస నుంచి దాసోజు శ్రవణ్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం ఎన్నికయ్యారు. వీరు కాకుండా ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు నిబంధనల మేరకు లేకపోవడంతో రిటర్నింగ్ అధికారి వాటిని తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం సాయంత్రం 5గంటలకు ముగిసింది. దీంతో ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

## జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై దుమారం.. క్షమాపణ చెప్పాల్సిందేనన్న శ్రీధర్‌బాబు

%హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ లో భారాస ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగింది. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పాలని మంత్రి శ్రీధర్‌బాబు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు.



తొలుత జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. “ఈ సభ అందరిదీ.. సభ్యులందరికీ సమాన అవకాశాలు ఉన్నాయి. మా అందరి తరఫున పెద్ద మనిషిగా, స్పీకర్‌గా మీరు కూర్చున్నారు. ఈ సభ మీ సొంతం కాదు” అని వ్యాఖ్యానించారు. సభా సంప్రదాయాలకు విరుద్ధంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడారని స్పీకర్ ఆక్షేపించారు.

జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. స్పీకర్‌ను దూషించేలా ఆయన మాట్లాడారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడిన ప్రతి పదాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన అహంకారంతో మాట్లాడకుండా క్షమాపణ చెప్పాల్సిందేనన్నారు.

భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ శ్రీధర్‌బాబు వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జగదీశ్‌రెడ్డి ఏం తప్పు మాట్లాడారని ప్రశ్నించారు. సభలో అందరికీ సమాన హక్కులు ఉన్నాయనడంలో తప్పులేదన్నారు. శాసనసభ అంటే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వానికి సంబంధించినది కాదన్నారు.

## మంత్రి పదవి ఎప్పుడు వస్తుందనేది చెప్పలేను: ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

హైదరాబాద్: ‘నాకు మంత్రి పదవి ఇస్తే పార్టీకి, ప్రజలకు లాభం. కానీ, మంత్రి పదవి ఎప్పుడు వస్తుందనేది చెప్పలేను’ అని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వివిధ అంశాలపై స్పందించారు. “భువనగిరి ఎంపీ స్థానం కోసం నిద్రాహారాలు మాని గెలిపించా. స్పీకర్ కుర్చీని ఎవరూ ప్రశ్నించలేరు. జగదీశ్‌రెడ్డి స్పీకర్ ఛైర్‌ను ప్రశ్నించడం సరికాదు. అసెంబ్లీలో అతిగా ప్రవర్తించారు, స్పీకర్‌ను అవమానించినందుకే ఆయనపై చర్యలు తీసుకున్నారు. మేము ఎవరినీ లక్ష్యంగా చేసుకోం.. తప్పు చేస్తే వదిలిపెట్టం” అని రాజగోపాల్‌రెడ్డి అన్నారు.



## ప్రమాదంలో 85లక్షల మంది విద్యార్థుల భవిత: పేపర్ లీకేజీలపై రాహుల్ గాంధీ

ప్రశ్నాపత్రాల లీక్‌లపై కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మరోసారి స్పందించారు. ఈ లీక్‌ల కారణంగా కష్టపడి చదివే విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. దీనిపై పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు (

‘ప్రశ్నాపత్రాల లీకులతో 6 రాష్ట్రాల్లోని 85 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. వీటి కారణంగా కష్టపడి చదివే పిల్లలతో పాటు వారి కుటుంబాలు ఒత్తిడికి గురవుతున్నాయి. వారి కష్టానికి తగిన ఫలితం అందడం లేదు. దీని వల్ల కష్టపడి పనిచేయడం కంటే నిజాయితీగా లేకపోవడమే మంచిదనే తప్పుడు సందేశం భవిష్యత్తు తరాలకు వెళుతుంది. అది ఆమోదయోగ్యం కాదు. నీట్ పేపర్ లీక్ దేశాన్ని కుదిపేసి ఏడాది కూడా కాలేదు. దీనిపై మేము పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తంచేశాం.

ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం లీకులను అడ్డుకోలేకపోయింది.ఇది వారి వైఫల్యానికి నిదర్శనం. అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు విభేదాలు



పక్కనబెట్టి దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే వీటిని అరికట్టగలం. ఈ పరీక్షలు మన పిల్లల హక్కు. దాన్ని ఎలాగైనా రక్షించాలి’ అని రాహుల్ రాసుకొచ్చారు. పేపర్‌లీక్‌లపై ఓ వార్తా సంస్థ రాసిన కథనాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ పోస్టు చేశారు.

## నిజంగా అంత బాధ ఉంటే.. నిర్మలమ్మ వ్యాఖ్యలకు విజయ్ కౌంటర్

చెన్నై: ప్రముఖ సంఘసంస్కర్త పెరియార్‌పై కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ చేసిన విమర్శలను తమిళగ వెట్రి కళగంధ్యక్షుడు, ప్రముఖ నటుడు విజయ్ తీవ్రంగా ఖండించారు. ఏళ్లు గడిచినా ఆయన పేరు వాడకుండా ఉండలేని విధంగా ప్రజల మనసుల్లో నిలిచిపోయారని కౌంటర్ ఇచ్చారు.

తమిళాన్ని అవమానించిన వ్యక్తికి పూలమాలలు వేస్తున్నారంటూ ఈవీకే పెరియార్‌ను పరోక్షంగా ప్రసావిస్తూ రాజ్యసభలో సీతారామన్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆమె వ్యాఖ్యలపై స్పందించిన విజయ్.. సమాజంలో సాంఘిక దురాచారాలు పారదోలడానికి పెరియార్ చేసిన కృషిని కొనియాడారు. “బాల్య వివాహాలను వ్యతిరేకించారు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారు. కులం పేరిట జరిగిన అకృత్యాలను ఖండించారు. ఇలా మనం ఆయన గురించి చెప్తూపోవచ్చు. సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లు ఉండాలని మనం ఇప్పుడు మాట్లాడుతున్న మాటలను ఆయన వందసంవత్సరాల క్రితమే పిలుపునిచ్చి ప్రజల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారు. పెరియార్ తమిళ భాషను అవమానించినందుకు కేంద్రమంత్రి నిజంగానే బాధపడ్డారా..? మీరు నిజంగా బాధపడి ఉంటే.. త్రిభాషా సూత్రాన్ని మాపై రుద్దడం ఆపేస్తారా..? పెరియార్ గురించి ఎవరైనా అవమానకర వ్యాఖ్యలు చేస్తే.. అవి వివాదాస్పదం అవుతుంటాయి.

# మారుతోన్న చైనా.... కాళ్ల బేరానికి


చైనా దేశం టోన్ మార్చింది. అంతర్జాతీయంగా భారత్‌కు పెరుగుతున్న పరపతి ఒకవైపు.. ప్రపంచంలో చైనా ఒంటరిగా మారుతుండటం మరోవైపు.. ఇక, ట్రంప్ చేసే టారిఫ్ వార్‌కి చైనా మార్కెట్లో ముచ్చెమటలు పడుతున్నాయి. భారత్‌లాగా దౌత్యం నేర్చుకోని డ్రాగన్ కంట్రీ.. పొగర్ని తగ్గించుకొని కలిసిపోదామనే పాట పాడుతోంది. ఆర్థికంగా భారత్ పరుగులుపెడుతుంటే.. అనుకున్న లక్ష్యాలు చేరుకోలేక చైనా నానాపాట్లూ పడుతుంది. చిన్నా చితకా దేశాలకు అప్పులిచ్చి, వాళ్లను తన గుప్పెట్లోకి లాగాలనుకున్న డ్రాగన్ కంట్రీ.. అంతర్జాతీయంగా అభాసుపాలయ్యింది. స్వదేశంలో సవాలక్షా సమస్యలతో సతమతమవుతోంది. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లను నమ్ముకుంటే తీవ్రవాదం తప్ప తిరిగొచ్చేది ఏమీ లేదని అర్థమయ్యింది. ఇప్పుడు చైనాకున్న ఒకే ఒక్క దారి.. భారత్‌తో రాజీ పడటమే. అమెరికా వేసే టారిఫ్ బరువులు తట్టుకోవాలంటే.. భారత్ లాంటి భాగస్వామ్యం అత్యవసరం అయ్యింది. బ్రిక్స్ వేదిక ఎలాగూ ఉంది కాబట్టి భారత్‌తో బంధం పెంచుకోవాలని అనుకుంటుంది. చైనా–భారత్‌లు ఒకదానికి ఒకటి అతిపెద్ద పొరుగు దేశాలనీ.. రెండు దేశాలూ ఒకరి విజయానికి ఒకరు దోహదపడే విధంగా భాగస్వాములుగా ఉండాలని చైనా ఎల్లప్పుడూ నమ్ముతున్నట్లు చైనా విదేశాంగ మంత్రి వెల్లడించారు. అందుకే, డ్రాగన్–ఎలిఫాంట్‌లు కలిసి సహకారించుకోవాలని అన్నారు. అయితే, వాంగ్ కేవలం మంత్రి మాత్రమే కాదు, చైనాలో అతిపెద్ద, అధికార పార్టీ అయిన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనాకు పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కూడా వాంగ్ ఉన్నారు. కాబట్టి, ఆయన మాట కచ్చితంగా చైనా అధ్యక్షుడి మాటతో సమానంగానే పరిగణించాల్సి ఉంటుంది. అందుకే, గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన దేశాలుగా ఉన్న భారత్–చైనాల సాంగత్యం స్ట్రాంగ్ అవ్వాలని కోరారు. ఇక, గ్లోబల్ సౌత్‌లో ఆధిపత్యం, అధికార రాజకీయాలు వంటివి లేకుండా ఇరు దేశాలు బాధ్యతగా వ్యవహరించాలని పిలునిచ్చారు. రెండు దేశాల చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడమే కాకుండా అంతర్జాతీయ సంబంధాలను నియంత్రించే ప్రాథమిక నిబంధనలను కూడా నిలబెట్టాలని మంత్రి వాంగ్ ఆశించారు. చైనా–భారత్‌లు చేతులు కలిపితే.. అంతర్జాతీయ సంబంధాలలో గొప్ప ప్రజాస్వామ్యానికి ప్రాతినిధులుగా ఉంటామనీ.. గ్లోబల్ సౌత్‌ని బలంగా మార్చుకోడానికి అవకాశాలు బాగా మెరుగుపడతాయని అన్నారు. అయితే, చైనా మంత్రి వాంగ్ చెప్పిన మాటల్లో.. అభివృద్ధి చెందుతున్న రెండు అతిపెద్ద దేశాలుగా.. చైనా–భారత్‌లు ఒకరినొకరు తగ్గించుకునే బదులు ఒకరినొకరు సహకరించుకుందామనే ధోరణి కనిపిస్తోంది. అలాగే, ఒకరినొకరు రక్షించుకోవడానికి బదులుగా ఒకరితో ఒకరు కలిసి పనిచేయాలనే అభిప్రాయం ఉంది. చైనా తన అవసరం కోసం ఎంత ఆత్రుత పడుతుందంటే.. ఇటీవల వరకూ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు కారణమైన సరిహద్దు వివాదాలను ద్వైపాక్షిక సంబంధాలతో ముడిపెట్టొద్దని కోరుతోంది. ఇలాంటి చిన్న చిన్న అంశాలు రెండు దేశాల మధ్య దౌత్యాన్ని మొత్తంగా ప్రభావితం చేయకూడదని అంటోంది. ఈ క్రమంలో.. భారత్–చైనాలు రెండూ పురాతన నాగరికతలని చెబుతూ చారిత్రక సారుప్యతను కూడా తెరమీదకు తీసుకొస్తుంది. అందుకే, న్యాయమైన పరిష్కారం కోసం సరిహద్దు ప్రాంతాల్లో శాంతిని కొనసాగించడానికి రెండు దేశాలకు తగినంత జ్ఞానం, సామర్థ్యం ఉన్నాయంటూ చైనా మైత్రి మంత్రం చదువుతోంది.

తూర్పు లడఖ్‌లో సైనిక విరమణ ప్రక్రియను పూర్తి చేయడానికి రెండు దేశాలు ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. అయితే, ముందుగా భారత్ దీనిపై స్పందించింది. చైనాతో సంబంధాలను నార్మలైజ్ చేయడం కోసం జాగ్రత్తగా నడవాలని కోరుకుంది. అలాగే, ఇటీవల, చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌తో జరిగిన సమావేశంలో, భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఇందులో, ఇరుదేశాల మధ్య సంబంధాల్లో పరస్పర విశ్వాసాన్ని పునరుద్ధరించాలనీ.. సరిహద్దు శాంతిని సంయుక్తంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. అమెరికాకు చైనాకు మధ్య టారిఫ్‌ల చిచ్చు రాజుకుంది. దీనితో, అమెరికా, చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా వస్తువులపై 20% సుంకాన్ని విధిస్తున్నట్లు ప్రకటించారు. దీనికి ప్రతిస్పందనగా చైనా.. అమెరికా దిగుమతులపై ప్రతి–సుంకాలను విధించింది. ఈ చర్య ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య యుద్ధానికి కారణం అయ్యింది. అమెరికా సుంకాలు ప్రపంచ వాణిజ్య సంస్థ నియమాలను ఉల్లంఘిస్తున్నాయని చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆరోపించింది. అమెరికా–చైనాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పటికీ, పరిష్కారం కోసం ప్రయత్నాలు కూడా చేస్తున్నారు. రాబోయే రోజుల్లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రెసిడెంట్ ట్రంప్ మాట్లాడే అవకాశం ఉంది. ఇద్దరు నాయకులు ఇద్దరికీ ప్రయోజనం చేకూరే ఒప్పందంపై చర్చలు జరపుతారనే అంచాలు ఉన్నాయి. ఇవి వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించగలవని, ఆర్థిక అంతరాయాలను నివారించవచ్చని భావిస్తున్నారు. అయితే, ఈ వాణిజ్య యుద్ధం ప్రభావం అంతకుమించింది. అందుకే.. ట్రంప్ టారిఫ్‌లపై మండిపడిన చైనా.. "అమెరికా యుద్ధం కోరుకుంటే అది టారిఫ్ వార్ అయినా, ట్రేడ్ వార్ అయినా, లేదా మరే ఇతర యుద్ధమైనా.. మేము తుది వరకు పోరాడేందుకు సిద్ధం" అని చైనా రాయబార కార్యాలయం తేల్చి చెప్పింది. రెండు దేశాలు ఆర్థిక నష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

# విజయసాయి అప్రూవర్ గా మారుతున్నారా...

విజయవాడ, మార్చి 13,

వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి మనసులో తాను లేనన్న విషయం తెలియగానే మనసు విరిగిపోయిందని వైసీపీలో తను ఒక్కొక్క మెట్టు దిగుతున్న కొద్ది కొంతమంది ఒక్కొక్క మెట్టు ఎదుగుతూ జగన్ చుట్టూ ఒక కోటరీ లా తయారయ్యారని " వైసిపి మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి అన్నారు. పార్టీ నుంచి బయటికి వెళ్లిపోతున్న టైంలో అధినాయకత్వంపై ఎలాంటి విమర్శలు చేయని సాయి రెడ్డి విజయవాడలో సిఐడి ముందు విచారణకు హాజరైన సమయంలో మీడియా ముందు తన వేదనంతా బయట పెట్టేశారు. కాకినాడ పోర్టులో వాటాలను విజయసాయిరెడ్డి, అల్లుడి సోదరుడు శరత్ చంద్రరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్‌రెడ్డి బలవంతంగా లాగేసుకున్నారని పోర్టు యజమాని ఐఎ రావు సిఐడికి ఫిర్యాదు చేశారు. దీంతో కేసు పెట్టి సీఐడీ నోటీసులు అందజేసింది. మొదట్లో చంద్రబాబు నాయుడిపై విజయ సాయిరెడ్డి నిప్పులు చెరిగారు. అది గతం ఇప్పుడు ఆయన వైసీపీ మాజీ నేత. అందుకే కానీ బుధవారం విచారణకు హాజరైన తర్వాత ఆయన శైలి మారిపోయింది. ప్రధానంగా వైసిపి హైకమాండ్‌ని టార్గెట్ చేస్తూ సంచలన కామెంట్స్ చేశారు. కాకినాడ పోర్టు వివాదంలో తన పాత్ర లేదని చేసిందంతా వైవి సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి అని చెప్పారు. వాళ్లు అమెరికా వెళ్ళినప్పుడు కేసు వేసిన కె.వి రావు ఇంట్లోనే ఉండేవారిని ఆరోపించారు విజయసాయిరెడ్డి. అలాగే ఈ కేసుకు సంబంధం లేని మద్యం స్కాంపై కూడా మాట్లాడుతూ అప్పటి జగన్ ప్రభుత్వం అడ్వైజర్ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి కనుసన్నల్లోనే వ్యవహారం నడిచిందని బాంబు పేల్చారు. ఆ కేసులో కూడా విజయసాయిరెడ్డి సహా వైసీపీకి చెందిన చాలా ముఖ్యమైన వాళ్ళ పేర్లు ఉన్నాయి. దీనిపై సిట్ వేశారు ప్రస్తుతం విచారణ సాగుతోంది. త్వరలోనే కొన్ని పెద్ద తలకాయల అరెస్టులు తప్పవని అంటున్నారు. వైసీపీ నుంచి ఎవరైనా తనపై విమర్శలు చేస్తే చాలా విషయాలు మాట్లాడతా అంటూ విజయసాయిరెడ్డి వార్నింగ్ పంపించారు. దీనితో విజయసాయిరెడ్డి త్వరలో అప్రూవర్‌గా మారతారా అంటూ ఏపీ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. విచిత్రంగా సాయి రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేసినా పార్టీ నుంచి పెద్ద లీడర్లు ఎవరూ ఇంతవరకూ స్పందించలేదు. దాంతో విజయసాయి రెడ్డి దగ్గర పార్టీకి చెందిన చాలా రహస్యాలు ఉన్నాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. పార్టీ వదిలి తాను వెళ్తాను అన్నప్పుడు "తనకు విశ్వసనీయత లేదని, భయపడ్డానని, ప్రలోభాలకు లొంగి పోయానని " జగన్ అన్నారు. కానీ తనకు అలాంటివేవీ లేవని.. సిబిఐ,ఈడీ కేసులు ఉన్నా భయపడలేదని చెప్పుకొచ్చారు విజయసాయి రెడ్డి. జగన్ చుట్టూ ఏర్పడిన కోటరీ ఆయనకు వాస్తవాలు తెలియకుండా చేస్తుందని ఆరోపించారు. నాయకుడు చెప్పుడు మాటలు వినడం మొదలుపెడితే పార్టీకి ప్రజలకు తీవ్ర నష్టమని హెచ్చరించారు. గత మూడున్నర ఏళ్లుగా అవమానాలు ఎదుర్కొంటూ వచ్చానని సాయిరెడ్డి అన్నారు. సజ్జల రామకృష్ణ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఒకోను ఉద్దేశించి విజయ సాయిరెడ్డి ఈ కామెంట్స్ చేశారని సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతోంది. విజయ సాయి రెడ్డిని ఉత్తరాంధ్ర ఇంచార్జ బాధ్యతల నుంచి తప్పించి వైవి సుబ్బారెడ్డిని పంపించారు. ఢిల్లీలోనూ వైవి సుబ్బారెడ్డికి ప్రాధాన్యత పెంచారు. సీఎం క్యాంపు కార్యాలయంలో



మొత్తం సజ్జలదే హవా కావడం తనను దూరం పెట్టారనేది విజయసాయి రెడ్డి అభిప్రాయం. అధినాయకుడు జగన్ దగ్గరే తనకు విలువ లేదని తెలిసి మనసు విరిగిపోయిందని ఆయన మొదటిసారిగా మీడియా ముందు బాధ వెళ్లబుచ్చారు. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే త్వరలోనే విజయ సాయి రెడ్డి తనపై నమోదైన కేసుల్లో అప్రూవర్‌గా మారే అవకాశం లేకపోలేదని అంటున్నారు. అదే గనుక జరిగితే వైసీపీలో పెద్ద తలకాయలకు చాలా ఇబ్బందులు తప్పవని అప్పుడే రాజకీయ వర్గాల్లో చర్చలు ఊపందుకున్నాయి.

# ఓడిపోయాక గుర్తొచ్చాయ... నాయనా

## సోషల్ మీడియాలో జగన్ పై సెటైర్లు


గుంటూరు, మార్చి 13,

వైఎస్సార్సీపీ పార్టీ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహనరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ ప్రారంభోత్సవం నాడు అధ్యక్షుడు చేసే పనే కదా అనుకోవచ్చు. అలా అయితే ఇప్పుడు మాట్లాడుకోవలసిన పనేముంది. 2011, మార్చి 12న యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ అనగా వైఎస్సార్సీపీని ప్రారంభించారు. అంటే ఇప్పటికి 14 వార్షికోత్సవాలు జరిగాయి. అయితే వీటిలో ఇప్పటి వరకూ ఆ పార్టీ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు అయిన జగన్ మోహనరెడ్డి ఎన్నిసార్లు జెండా ఎగరేశారో తెలుసా? రెండు లేదా మూడుసార్లు మాత్రమే? ఓ రాజకీయ పార్టీకి ఆవిర్భావ దినోత్సవం అన్నది చాలా ముఖ్యమైంది. అలాగే పార్టీ మీటింగ్‌లు, అప్పుడప్పుడు పార్టీ ప్లీనరీలు వంటివి చేస్తుంటారు. తెలుగుదేశం పార్టీ తమ వార్షిక వేడుకలు మహానాడు పేరుతో జరుపుకుంటుంది. జనసేన తొలిసారిగా ప్లీనరీని జరుపుకోబోతోంది. వైఎస్సార్సీపీ ఇంతకు ముందు రెండుసార్లు ప్లీనరీని నిర్వహించింది. ఇవాళ విజయవాడలోని పార్టీ కార్యాలయంలో జగన్ మోహనరెడ్డి తమ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో పార్టీ జెండాను ఎగురేశారు. పార్టీ జెండాలను ఆయా పార్టీల అధ్యక్షులు తరచుగా ఏవీ ఆవిష్కరించరు కానీ ఆవిర్భావం రోజు మాత్రం తప్పనిసరిగా ఆ పనిచేస్తారు. కానీ 2011లో పార్టీని ప్రారంభించి హైదరాబాద్ జుబ్లీహిల్స్ లో కార్యాలయం ఏర్పాటు చేసినప్పుడు తొలిసారిగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆ తర్వాత ఉపఎన్నికల్లో విజయం తర్వాత పార్టీ అడ్రెస్ విజయవాడకు మారింది. అక్కడ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసినా జగన్ మోహనరెడ్డి మాత్రం పార్టీ కార్యాలయానికి ఎక్కువగా వెళ్లలేదు. ఈ పద్నాలుగేళ్లలో ఆయన జెండాను ఆవిష్కరించింది. పార్టీ కండువాను ధరించింది చాలా అరుదైన సందర్భాల్లో మాత్రమే. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి 2014లో హైదరాబాద్ లో శాసనసభ లో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంలో జగన్ మోహనరెడ్డి పార్టీ కండువాను ధరించారు. ఆ తర్వాత ఎప్పుడూ లేదు. 2019 ఎన్నికలకు ముందు గుంటూరులో నిర్వహించిన ప్లీనరీలో కూడా పార్టీ కండువా వేసుకోలేదు. 2019 ఎన్నికల్లో భారీ విజయం సాధించి అసెంబ్లీకి వచ్చేప్పుడు కూడా వేసుకోలేదు. ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు.. అంతకు ముందు చాలా తక్కువగా మాత్రమే పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయన.. సీఎం అయిన తర్వాత ఇక పార్టీ కార్యాలయం వైపే చూడలేదు. చాలా సార్లు విజయవాడ కార్యాలయంలోనూ.. ఆ తర్వాత తాడేపల్లి బైపాస్ కార్యాలయాల్లోనూ సజ్జల రామకృష్ణారెడ్డి, ఇతర సీనియర్ నేతలే జెండాను ఆవిష్కరించారు. జగన్ మోహనరెడ్డికి జనంలో ఉన్న చరిష్మా వల్ల ఆయన తిరుగులేని మెజార్టీ సాధించారు కానీ.. ఆయన పార్టీని మాత్రం? జనరల్‌గా పార్టీని నడిపించే ప్రిన్సిపల్స్ ప్రకారం నడపలేదు. వైఎస్సార్సీపీకి కూడా హై లెవల్ నాయకుల కమిటీ ఉంది కానీ వాళ్లు సమావేశం అయ్యేది తక్కువ. వాళ్లతో జగన్ మీటింగ్ పెట్టేది మరీ తక్కువ . ఇక పార్టీ కార్యవర్గం, విస్తృత స్థాయి సమావేశాలు, పార్టీ అనుబంధ విభాగాలు మీటింగ్స్ గురించి మాట్లాడుకోవడానికి ఏం లేదు. వైఎస్సార్సీపీలో రాజకీయ వ్యవహారాలు అప్పట్లో ఉన్న త్రిమూర్తులు సజ్జల, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి చూసుకునేవారు. విజయసాయిరెడ్డి పూర్తిగా ఉత్తరాంధ్రను.. వైవీ గోదావరి , రాయలసీమలను చూస్తే.. రాష్ట్ర వ్యాప్తంగా నాయకుల వ్యవహారాలను సజ్జల చూసేవారు. అలాగే పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వానికి– పార్టీకి మధ్య వారధిగా కూడా సజ్జలనే ఉన్నారు. ఇక జగన్ కుటుంబ ఆంతరంగిక బృందంలో చెవిరెడ్డి ఉంటూ.. పార్టీకి సంబంధించిన సర్వేలు, ఫీడ్‌బ్యాక్ మెకానిజం చూసేవాళ్లు. మొత్తం మీద పార్టీ సెటప్ ఇదే. అధికారంలోకి వచ్చిన తర్వాత అయితే ఆయన పూర్తిగా పార్టీకి అందుబాటులో లేరు. ముఖ్యమంత్రిగా రాష్ట్రం మొత్తానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తి పార్టీ కార్యకలాపాల్లో ఉండకూడదని నిర్ణయించుకున్నారని వైసీపీ నేతలు కవర్ చేయడానికి ప్రయత్నిస్తారు కానీ అదంత సమంజసంగా అనిపించదు. వైఎస్ జగన్ పార్టీని వద్దనుకోలేదు. పైగా ఆయన ఇంత వరకూ చరిత్రలో లేని విధంగా ఆ పార్టీకి జీవితకాల అధ్యక్షుడిగానూ ప్రకటించుకున్నారు. అయితే ఎలక్షన్ కమిషన్ ఒప్పుకోలేదు అది వేరే సంగతి. జాతీయ పార్టీల్లో పార్టీ అధ్యక్షులుగా లేని సీఎంలు.. పార్టీ కార్యక్రమాలకు హాజరవుతారు. అంతెందుకు ప్రధాని నరేంద్ర మోదీ సైతం బీజేపీ జాతీయ ప్లీనరీలో పాల్గొంటారు. ఇతర మీటింగ్‌లకు వెళతారు. తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పుడు అలాగే చేస్తున్నారు. చంద్రబాబు తెలుగుదేశం అధ్యక్షుడు, సీఎం కూడా ఆయన ఈ దఫా కూడా చాలాసార్లు పార్టీ ఆఫీసుకు వెళ్లారు. అంతకు ముందూ చేశారు. అంతెందుకు జగన్ తండ్రి, వైఎస్ రాజశేఖరరెడ్డి సైతం సీఎంగా పార్టీ కార్యక్రమాలకు అటెండ్ అయ్యారు. ఈ విషయంపై పార్టీలో చర్చ జరిగినా ఆ విషయాన్ని ధైర్యంగా జగన్ కు చెప్పగలిగే వాళ్లు అప్పట్లో లేరు. కేవలం జగన్ ఇమేజ్ మీదనే తాము గెలిచాం కానీ.. గ్రామ, మండల , జిల్లా స్థాయిలో పార్టీ కార్యకలాపాలు లేవని ఆ పార్టీ నేతలు అంటుండేవారు. పార్టీలో సీనియర్ నేతగా ఉన్న ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పార్టీ ఆర్గనైజేషన్ ను బలపరచడానికి కొంత ప్రయత్నం చేసినప్పటికీ.. అదేమీ సక్సెస్ కాలేదు. 2024లో ఘెరమైన ఓటమి తర్వాత పార్టీ అధినేత జగన్ మోనహరెడ్డిలో కొంత మార్పు వచ్చింది అనుకోవచ్చు. ఓడిపోయిన వెంటనే ఆయన పార్టీ నేతల మీటింగ్ పెట్టారు. ఇక నుంచి నేను మీ తోనే అని చెప్పారు. ఎక్కువగా పార్టీ నేతలను కలిశారు. ఐదేళ్లు పోరాటం చేద్దాం అని చెప్పారు. అంతే కాదు.. మొన్న అసెంబ్లీకి వైసీపీ కండువాను మెడలో వేసుకొని వచ్చారు. బహుశా ఈ 14 ఏళ్లలో ఆయన్ను పార్టీ కార్యకర్తలు ఓ 2–3 సార్లు మాత్రమే అలా కండువాతో చూసి ఉంటారు అంతే. ఇప్పుడు తరచుగా పార్టీ కార్యాలయానికి కూడా వస్తున్నారు. అయితే ఇప్పుడు ఆ కార్యాలయం ఆయన ఇంటి ప్రాంగణంలోనే ఉంది. ఒకప్పుడు సీఎం క్యాంప్ ఆఫీసుగా పనిచేసిన కార్యాలయాన్నే ఇప్పుడు వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యాలయంగా మార్చారు. ఆయన ఇప్పుడు తరచుగా అక్కడకు వస్తున్నారు నేతలతో మాట్లాడుతున్నారు. చాలా మారిపోయారు. ఆ మార్పులో భాగమే.. ఇప్పుడు పార్టీ జెండా ఎగరేయడం. ఓడిపోయాక కానీ పార్టీని పట్టించుకోవాలని తెలిసిరాలేదు అని కొంతమంది సణుగుతుంటే.. ఏదైతే ఏంటి మాకు కావలసింది ఇదే అని ఆ పార్టీ కార్యకర్తలు ఖుషీ అవుతున్నారు.

# తిరుమలలో నెయ్యి కష్టాలు

తిరుమల, మార్చి 13, (

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రసాదాలకు నెయ్యి సేకరణ రోజు రోజు కష్టంగా మారుతోంది. సరిపడా నెయ్యి అందుబాటులో లేకపోవడంతో ప్రసాదాల తయారీలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మరోవైపు నెయ్యి కొరతను పసిగట్టిన అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇతర సంస్థల నుంచి నెయ్యి సేకరణకు చర్యలు తీసుకుంటున్నారు. తిరుమల శ్రీవారి ప్రసాదం (లడ్డూ) అంటే ఇష్టపడని వారు ఉండరు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా ఆ మాటకొస్తే ప్రపంచ వ్యాప్తంగా శ్రీవారి ప్రసాదానికి ప్రియులు ఉన్నారు. శ్రీవారి ప్రసాదమంటే అమృతంగా భావించిన వారు ఉన్నారు. ఆ ప్రసాదం దొరకడం కూడా పూర్వ జన్మ శుక్రుతమనుకునేవారు కూడా ఉన్నారు. ప్రపంచ అభిమానులు ఉన్న ఈ శ్రీవారి ప్రసాదం తయారీ చేయడానికి కీలకమైన పదార్థం నెయ్యి ఇప్పుడు తగినంత అందుబాటులో లేదు. నెయ్యి సేకరణ కష్టంగా మారింది. గత పది రోజులుగా టీటీడీ ఆధీనంలో ఉన్న తిరుమలతో పాటు తిరుపతి, పరిసర ఆలయాలకు సరిపడా నెయ్యి సరఫరా జరగటం లేదు. దీంతో శ్రీవారి ప్రసాదం తయారీలో ఇబ్బందులు తలెత్తున్నాయి. శ్రీవారి ప్రసాదం విషయంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పెద్ద ఎత్తున రగడ జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీవారి ప్రసాదం లడ్డూ తయారీకి వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ప్రకటన చేశారు. దీంతో ఈ అంశం రాష్ట్రంలో సంచలనం అయింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్ ఏకంగా దీక్ష చేయడం, అలాగే తిరుమల వెళ్లి బహిరంగ సభ పెట్టి సనాతన ధర్మ పరిరక్షణను కీలక వ్యాఖ్యలు చేశారు. అలాగే మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కూడా తిరుమల వెళ్తానని ప్రకటించడం, అప్పుడు డిక్లరేషన్ అంశం తెరపైకి రావడం, ఆ తరువాత అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ఆయన తిరుమల పర్యటన రద్దు చేసుకున్నారు. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తిరుమల వెళ్లి ప్రమాణం చేయడం, పోలీసులు అడ్డుకోవడం ఇలా కొన్ని రోజుల పాటు రాష్ట్రంలో ఇదే అంశం చర్చ జరిగింది. అయితే చివరికి సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవడంతో రాష్ట్రంలో చర్చకు ఫుల్‌స్టాప్ పడింది. ప్రస్తుతానికి సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణ జరుపుతుంది. ప్రస్తుతం శ్రీవారి ప్రసాదం లడ్డూ తయారీకి వాడే నెయ్యి కొరత ఏర్పడింది. తిరుమలలో రోజూ ప్రసాదాల తయారీకి 14 టన్నుల నెయ్యి అవసరం అవుతుంది. ప్రస్తుతం టీటీడీకి కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్), ఢిల్లీకి చెందిన ఆల్ఫా కంపెనీలు నెయ్యి సరఫరా చేస్తున్నాయి. కెఎంఎఫ్ నుంచి వచ్చే ఒక్కోక్క లారీలో 40 నుంచి 50 టన్నుల నెయ్యి ఉంటుంది. దీని నాణ్యతను ల్యాబ్‌లో నిర్ధారించేందుకు దాదాపు రోజున్నర (36 గంటల) పడుతుంది. గతంలో టీటీడీ నెయి నిల్వ కేంద్రంలో ముందస్తుగా 40 నుంచి 50 టన్నుల నెయ్యి నిల్వ చేయడంతో కొరత సమస్య రాలేదు. కానీ ప్రస్తుతం అలా జరగటం లేదు. ముందస్తు నిల్వ కింద నెయ్యిని నిల్వ చేయటం లేదు. ఇటీవలి ఒక రోజు నెయ్యి సరఫరా ఆలస్యమైంది. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు లడ్డూ తయారీకి సంబంధించిన బూందీ పోటు తయారీ ఆగింది. వేసవిలో భక్తులు రద్దీ ఉంటుంది. దీంతో లడ్డూ



ప్రసాదాలు తయారీకి భారీగా నెయ్యి అవసరం ఏర్పడుతుంది. అయితే ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేయకపోతే ఇబ్బందులు తప్పేలా లేవని టీటీడీ ఉద్యోగులు చెబుతున్నారు. తిరుపతిలోని స్థానిక ఆలయాల్లోనూ నెయ్యి సరఫరా తగ్గడంతో తిరుచానూరు ఆలయం నుంచి కొద్ది మేర పంపుతున్నారు. సరఫరాదారుల సంఖ్య పడిపోవడంతో కూడా నెయ్యి కొరతకు ఒక కారణమని టీటీడీ ఉద్యోగి చెప్పారు. అయితే టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ (సేకరణ) డిప్యూటీ ఈవో ప్రసాద్ నెయ్యి కొరతపై స్పందిస్తూ త్వరలోనే ఇతర సంస్థల నుంచి నెయ్యి సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అప్పటి వరకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అయితే శ్రీవారి ప్రసాదాలకు ఎటువంటి లోటు లేకుండా చేయాలని భక్తులు అంటున్నారు.

========================

# మళ్లా పాత నేతలకు లైన్ క్లియర్

రాజమండ్రి, మార్చి 13

భారతీయ జనతా పార్టీలోని సీనియర్ నేత సోము వీర్రాజు ఎమ్మెల్సీగా ఎన్నికవుతున్నారు. మరో రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించనున్నారు. అయితే సోము వీర్రాజు సరే.. మరో కీలక నేత జీవీఎల్ నరసింహారావు మాటేంటి? అన్న చర్చ పార్టీలో నడుస్తుంది. వీర్రాజు మాదిరిగానే త్వరలోనే జీవీఎల్ కు కూడా పదవి దక్కుతుందన్న అంచనాలు పార్టీలో ఊపందుకున్నాయి. సోము వీర్రాజు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాసనమండలిలో కాలు మోపినట్టుగానే జీవీఎల్ నరసింహారావును కూడా కీలకపదవి వరించడానికి సిద్ధంగా ఉందన్న ప్రచారం ఊపందుకుంది. నిజానికి బీజేపీలో సోము వీర్రాజు, జీవీఎల్ నరసింహారావు, విష్ణువర్ధన్ రెడ్డి వంటి నేతలు యాంటీ టీడీపీగా ముద్రపడ్డారు. వీరికి పదవులు కూటమి ప్రభుత్వంలో లభించవని అందరూ భావించారు. ఒకవేళ బీజేపీ కేంద్ర నాయకత్వం ప్రతిపాదించినా అందుకు చంద్రబాబు అంగీకరించరని తెలుగు తమ్ముళ్లతో పాటు బీజేపీలోని మరొక వర్గం కూడా గట్టిగా విశ్వసించింది. ఎందుకంటే ప్రో జగన్ గా ముద్రపడిన ఈ నేతలకు పదవుల విషయంలో చంద్రబాబు మోదీ, అమిత్ షా ల వద్ద అభ్యంతరం చెబుతారని అంచనా వేసింది. అయితే చంద్రబాబును ఒప్పించి కేంద్ర నాయకత్వం నేరుగా సోము వీర్రాజును ఎమ్మెల్సీగా ఎంపిక చేయడానికి సిద్ధమయింది. అంటే బీజేపీ కేంద్ర నాయకత్వం ఈ బ్యాచ్ ను వదులుకునేందుకు సిద్ధంగా లేదన్న విషయం స్పష్టంగా అర్థమవుతుంది. కేంద్రంతో నిధుల అవసరం కూడా ఉండటంతో చంద్రబాబు కూడా ఏమీ చేయలేని పరిస్థితి. ఇక సోము వీర్రాజుకు పదవి వచ్చింది కాబట్టి తర్వాత నేత జీవీఎల్ నరసింహారావు అని అంటున్నారు. తొలి నుంచి పార్టీలో ఉంటూ ఆరెస్ఎస్ నేపథ్యం ఉన్న నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ కేంద్ర నాయకత్వం నిర్ణయించుకున్నట్లు తెలిసింది. మిత్రపక్షంలో ఉన్నప్పటికీ తమ మాట చెల్లుబాటు అయ్యేలా ఢిల్లీ నుంచి అధినాయకత్వం పావులు కదుపుతున్నట్లే కనపడుతుంది. రానున్న కాలంలో ఖాళీ అయ్యే ప్రతి ఎమ్మెల్సీ, రాజ్యసభ పదవుల్లో బీజేపీ తన భాగాన్ని కోరుకుంటుంది. అందులో ఎటువంటి సందేహం లేదు. రానున్న కాలంలో ఖాళీ అయ్యే పదవుల్లో జీవీఎల్ నరసింహారావుకు కూడా పదవి లభించడం ఖాయమని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. మరి ఏం జరుగుతుందో చూడాలి. బీజేపీ అధ్యక్ష పదవి నుంచి పురంధ్రీశ్వరిని తప్పించి ఆమె స్థానంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్ ను ఎంపిక చేయాలన్న ఉద్దేశ్యంతో అధినాయకత్వం ఉందని తెలిసింది.

# ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు పార్టీకి, పార్టీ శ్రేణులకు రుణపడి ఉంటా కేతావత్ శంకర్ నాయక్

మిర్యాలగూడ: మార్చి 13

ఎమ్మెల్యే కోటాలో తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ , పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి,రాష్ట్ర భారీ, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గార్లు, ఎంపీలు రఘువీర్ రెడ్డి, శ్యామల కిరణ్ కుమార్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల అందరికీ డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు

కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన వారికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. మా నాన్న కూడా కాంగ్రెస్ పార్టీలో పని చేస్తూ రెండుసార్లు సర్పంచ్ గా పని చేశాడని వివరించారు. తాను గతంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షునిగా, ఎంపీపీగా, జెడ్పిటిసిగా, గత ఏడు సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా తనకు అవకాశం కల్పించడం పట్ల కాంగ్రెస్ పార్టీకి, పార్టీ శ్రేణులందరికీ రుణపడి ఉంటానని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి శంకర్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

# హోలీ సందర్భంగా సైదరాబాద్లో పోలీసుల ఆంక్షలు

హైదరాబాద్ మార్చి 13

హోలి పండగ నేపథ్యంలో సైబరాబాద్ పరిధిలో పోలీసులు ఆంక్షలు విధించారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు ఆంక్షలు అమలు లో వుంటాయి. రోడ్డు మీద వెళ్లేవారిపై రంగులు చల్లితే కఠిన చర్యలు తీసుకుంటాం. రోడ్లపై గుంపులుగా ర్యాలీలు నిర్వహించొద్దు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్న సీపీ అవినాష్ మహంతి హెచ్చరించారు.

# అబద్ధాలు చెప్పి రెండు సార్లు అధికారంలోకి వచ్చారు

హైదరాబాద్గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం పై వాడి వేడి చర్చ జరిగింది. రైతు రుణమాఫీ కాలేదు, రైతు భరోసా రాలేదన్న బీఆర్ఎస్ వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి .. ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. దళితుడిని సిఎం చేస్తా అన్నారు చేయలేదు. దళితులకు మూడు ఎకరాలు ఇస్తా అన్నారు ఇవ్వలేదు, ఇంటికో ఉద్యోగం ఇస్తా అన్నారు ఇవ్వలేదు. అబద్దాలు చెప్పి రెండు సార్లు అధికారంలోకి వచ్చారు. రైతులకోసం ఎవరు ఏం చేశారో అందరికీ తెలుసు. నాగార్జున సాగర్, శ్రీశైలం ఎవరు కట్టారో అందరికీ తెలును. చెప్పిన ప్రతి హామీ నెరవేర్చుతం.. తొందరపడకండని అన్నారు.

# టీడీపీకి ట్రబుల్ షూటర్ కావలెను...

విజయవాడ, మార్చి 13,

ఏపీ రాజకీయాలు గమనిస్తున్న వాళ్లకి స్పష్టంగా ఒక విషయం అయితే అర్ధమవుతోంది. టీడీపీలో నెమ్మదిగా సీనియర్లను పక్కన పెడుతూ యువరక్తాన్ని పార్టీలోకి ఎక్కించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వంలోని కీలక పదవులు వాళ్లకే దక్కుతున్నాయి. 2024 ఎన్నికల్లో గెలిచాక అధిక శాతం మంత్రి పదవులు యువకులకు కొత్తగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వాళ్లకు దక్కాయి. ప్రస్తుత జనరేషన్కి ఇది కరెక్టే. కానీ దీనిలో ఒక చిన్న ఇబ్బంది కూడా కనిపిస్తోంది. చాలామంది సీనియర్లు సైలెంట్ అయిపోవడంతో కీలకమైన అంశాల్లో ఇంకా చెప్పాలంటే ఇబ్బందికరమైన పరిస్థితి ఎదురైనప్పుడు నిర్ణయాలు తీసుకోవడంలో తడబాటు కనిపిస్తోంది. సంక్షోభాన్ని పరిష్కరించి పరిస్థితులను పార్టీకి అనుకూలంగా మార్చే ట్రబుల్ షూటర్స్ కరవైపోయారు. ఏదైనా ఇబ్బంది కరమైన పరిస్థితి ఎదురైనప్పుడు పరిష్కరించాలంటే దానికి కచ్చితంగా సీనియారిటీ కావాలి. ప్రత్యర్ధి పార్టీలు ఏదైనా అంటే కౌంటర్ ప్రెస్మీట్ పెట్టి ఇటువైపు నుంచి మరో తిట్టే వాళ్లే ఉంటున్నారు. కానీ ఆ విమర్శలను పార్టీకి అనుకూలంగా మార్చే నైపుణ్యం సీనియారిటీతోనే వస్తుంది. ప్రస్తుత టిడిపిలో అది లోపించిందన్న అభిప్రాయం ఉంది. ఒకప్పుడు చంద్రబాబుకి అండగా ఎర్రన్నాయుడు, కడియం శ్రీహరి, అశోక్ గజపతిరాజు, యనమల రామకృష్ణుడు, లాల్ జాన్ బాషా లాంటి నేతలు ఉండేవారు. తర్వాత కాలంలో దేవినేని ఉమా, తలసాని శ్రీనివాస్ యాదవ్, మోత్కుపల్లి నరసింహులు ఇలా లిస్టు పెద్దగానే ఉండేది. ఇప్పుడు పార్టీలో ఉన్నవాళ్లు ఎక్కువ మంది వ్యాపారస్తులు, యువకులు కావడంతో ఆ ట్రబుల్ షూటర్ స్థానం లోపించిందన్న మాటలు పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. టిడిపి ఇటీవల కాలంలో రెండు ఘటనల్లో సీనియారిటీ లేమిని ఎదుర్కొంది. మొదటిది గ్రూప్ 2 ఎగ్జామ్స్కు సంబంధించిన ఇష్యూ. రెండోది గుంటూరు మిర్చి యర్డు అంశం. గ్రూప్ 2 ఎగ్జామ్స్కు సంబంధించి ఉన్న ఇబ్బందులను, రిజర్వేషన్ వివాదాన్ని నారా లోకేష్ దృష్టికి సరైన సమయంలో అధికారులు తీసుకెళ్లలేదని అంటారు. ఆ తర్వాత జరిగిన తతంగం అందరికీ తెలిసిందే. తాము ఇచ్చిన జీవో 77కు విరుద్ధంగా తామే ఇచ్చిన నోటిఫికేషన్ కావడంతో విపక్ష వైసిపి దీనిలో పెద్దగా కలుగజేసుకోలేదు. కానీ టిడిపికి చాలా ఇబ్బంది కలిగించే పరిణామాలే గ్రూప్ 2 పరీక్ష నిర్వహణలో ఉన్నాయి. దాదాపు 90 వేలమంది అభ్యర్థులకు సంబంధించిన అంశం కావడంతో వారిలో ఎంత మందిలో ఇంకా దీనిపై వ్యతిరేకత ఉందో బయటకు తెలియని పరిస్థితి. ఈ ఇష్యూని డీల్ చేయడంలో కూటమి ఫెయిల్యూర్ అనే చెప్పాలి. రెండోది గుంటూరు మిర్చి యార్డ్లో జగన్ నిరసనకు వెళ్లిన అంశం. మిర్చి రేటు పెంపు అంశంలో తన నిరసన తర్వాతే కేంద్రంతో మాట్లాడిన టిడిపి ప్రభుత్వం ఆచరణలోకి తెచ్చిందని ఆ క్రెడిట్ తమదేనని వైసిపి ఓన్ చేసుకుంది. దీనిపై ఒకటి రెండు ప్రెస్ మీట్లు పెట్టి జగన్ని విమర్శించడం మినహా పెద్దగా చేసింది ఏమీ లేదు. ఇలాంటి అంశాల్లోనే సీనియారిటీ అనేది పనికొస్తుంది. జరిగిన ఇష్యూలోని అన్ని వివరాలను పార్టీకి అనుకూలంగా మార్చుకుంటూ ప్రజల్లో అవగాహన పెంచడం సీనియర్ల వల్ల మాత్రమే అయ్యే పని. 'కాంగ్రెస్'లో సీనియర్ మోస్ట్ లీడర్, తమిళనాడు మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కామరాజ్ రూపొందించిందే కామరాజ్ ప్లాన్. దీని ప్రకారం సీనియర్లు ప్రభుత్వ పదవులు నుంచి దిగిపోయి పార్టీకి పరిమితం కావాలి యంగ్ జనరేషన్ మంత్రి పదవిలో ఉండాలి. స్వయంగా తానే ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయి 1963లో ఈ ప్లాన్ ప్రకటించారు. నిజానికి ఇది లాల్ బహదూర్ శాస్త్రి, తర్వాత ఇందిరాగాంధీని ప్రధానులు చేయడానికి మొరార్జీ దేశాయ్ని దెబ్బ కొట్టడానికి తీసుకొచ్చిన ప్లాన్ అనే విమర్శలు కూడా ఉన్నాయి. కానీ ఇందిరా గాంధీకి తర్వాత కాలంలో ఇది ఎంతో ఉపయోగపడింది. ఈ ప్లాన్ పేరుతో సీనియర్లను పార్టీ పదవుల్లో ఉంచిపోయేలా చేసి తనకు కావలసిన యంగ్ టీమ్ని ప్రభుత్వ పదవుల్లో నియమించుకున్నారామె. అప్పట్లో సరైన విపక్షం ఉండేది కాదు కాబట్టి కాంగ్రెస్కి ఆ ప్లాన్ వర్కౌట్ అయింది. కానీ ఇప్పుడు టిడిపి జగన్ రూపంలో బలమైన ప్రత్యర్థిని ఎదుర్కొంటుంది. మరి ఇలాంటి సమయంలో సీనియర్లను అందర్నీ పక్కన పెట్టేయడం టిడిపి వేస్తున్న సరైన స్టెప్పో కాదో భవిష్యత్ రాజకీయాలే నిర్ణయిస్తాయి.

# ఘనంగా జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

## క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయి

నల్గొండ నల్గొండ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025 ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఐఏఎస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ కలిసి స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ శాఖలోని విభాగాల వారీగా చేసిన అద్భుతమైన పేరేడ్ ను ఆవిష్కరించారు. అనంతరం స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఫ్లాగ్ ను ఆవిష్కరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పాఠశాలల సందర్శనకు వెళ్ళినప్పుడు బందోబస్తుగా వచ్చిన పోలీస్ అధికారులు సిబ్బందిని చూసి విద్యార్థులు స్ఫూర్తి పొందడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. పోలీస్ అంటేనే ఒత్తిడి తో కూడుకున్న ఉద్యోగం అని అన్నారు. పోలీస్ శాఖ లో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది శారీరక స్ఫూర్తితో పాటు మానసికంగా అలర్ట్ కావాలని అందుకోసం క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడల ద్వారా సమతుల్యమైన శారీరక మానసిక అభివృద్ధి పొందుతుందని అన్నారు. పోలీస్ శాఖ కు టీమ్ స్పిరిట్ చాలా ముఖ్యమన్నారు. నిత్యం విధినిర్వహణలో ఒత్తిడిలో ఉండే పోలీస్ శాఖలో పనిచేస్తున్న వారికి ఈ స్పోర్ట్స్ మీట్ ద్వారా మంచి వేదిక జరుగుతుందని ఆకాంక్షించారు. తమకు అవసరమైన విషయాలను కూడా పోలీస్ శాఖ లోని ముఖ్యమైన విభాగాల నుంచి సమాచారం తెప్పించుకుని దానికి అనుగుణంగా ప్రణాళికతో పనిచేస్తామన్నారు. క్రీడాకారులు ఈ స్పోర్ట్స్ మీట్లో మంచి ప్రతిభ కనబరిచి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖలో పనిచేసే అధికారులకు మరియు సిబ్బందికి క్రీడలు ఎంతగానో ఉపయోగ పడతాయి ఇవి నిత్యజీవితంలో భాగంగా చేసుకొంటే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం,శారీరక దృఢత్వం కలిగి ఉంటుందని ఇవి ముఖ్యంగా పోలీసు శాఖలో వివిధ డ్యూటీలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఎంతగానో దోహదపడతాయి అన్నారు. ఆటలలో గెలుపోటములు సహజమని క్రీడాకారులందరూ స్పోర్ట్స్ స్పిరిట్ తో ఆడాలని అన్నారు.

# కనిపించకుండా పెరిగిన లిక్కర్ ధరలు

నెల్లూరు. మార్చి 13

ఏపీలో మద్యం ధరల్లో మతలబు జనాలకు తెలిసొచ్చింది. కొద్ది రోజుల క్రితం మద్యం విక్రయాల్లో కమిషన్ చెల్లింపు కోసం బాటిల్పై రూ.10 అదనంగా వసూలు చేసేందుకు ఎక్సైజ్ శాఖ అనుమతించింది. మద్యం ధరల పెంపుపై విమర్శలు రావడంతో ప్రభుత్వం కూడా స్పందించింది. మద్యం బాటిళ్ల గరిష్ట ధరలపై అప్పట్లో ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్కుమార్ ప్రకటన కూడా చేశారు. కేవలం రూ.10 మాత్రమే పెరిగినట్టు చెప్పారు. ప్రస్తుతం మద్యం దుకాణాల్లో మాత్రం బాటిల్ పరిమాణం బట్టి అదనపు ధరలు వసూలు చేస్తున్నారు. మద్యం ధరల పెంపుపై ఎక్సైజ్ కమిషనర్ ధర పెరుగుదల కేవలం రూ.10 మాత్రమేనని వివరణ కూడా ఇచ్చారు. బ్రాండ్ లేదా పరిమాణంతో సంబంధం లేదని చెప్పారు. మద్యం క్వార్టర్/హాఫ్/ఫుల్ బాటిల్ అనేదానితో సంబంధం లేకుండా, అన్ని బాటిళ్లపై రూ.10 మాత్రమే పెరిగిందని చెప్పారు. మద్యం ధర రూ. 15, రూ 20 పెరిగిందనేది అవాస్తవమని, అపోహలకు గురి కావొద్దని అప్పట్లో విజ్ఞప్తి చేశారు. మద్యం ధరల వివరాలను అన్ని షాపుల్లో ప్రదర్శించాలని దుకాణదారులకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు ప్రకటించారు. కమిషనర్ ప్రకటనలు ప్రస్తుతం వసూలు చేస్తున్న మద్యం ధరలకు పొంతన లేదని క్లారిటీ వచ్చేసింది. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది అక్టోబర్ 16 నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు మొదలయ్యాయి. అదే సమయంలో రెండు పాపులర్ బ్రాండ్ల మద్యం ధరల్ని రూ.40 వరకు తగ్గించారు. ప్రముఖ సినీ నటుడు బ్రాండింగ్ చేస్తున్న బ్రాండీతో పాటు మరో రెండు రకాల విస్కీ ధరల్ని గణనీయంగా తగ్గించారు. రూ.220 క్వార్టర్ బ్రాండీ ధరను రూ. 180కు తగ్గించారు. మరో ప్రముఖ బ్రాండ్ విస్కీ ధరను కూడా తగ్గించారు. గత ఐదేళ్లలో పాపులర్ బ్రాండ్ల మద్యం కొరత ఏపీలో తీవ్రంగా ఉండేది. ఈ క్రమంలో ప్రైవేట్ మద్యం దుకాణాల్లో అన్ని బ్రాండ్లను అందుబాటులోకి తెస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఏపీలో మద్యం ధరల్ని తగ్గిస్తామని, నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు విస్తృతంగా ప్రచారం చేశాయి. రాష్ట్రంలో నాసిరకం మద్యం విక్రయిస్తున్నారని, ధరల్ని అదుపు చేస్తామని విస్తృత ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు మూడు పాపులర్ బ్రాండ్ల ధరలు మాత్రమే కాస్త తగ్గాయి. 2019 మే నాటికి ఉన్న ధరలతో పోలిస్తే ప్రస్తుతం మద్యం ధరలు దాదాపుగా రెట్టింపు అయ్యాయి. దాదాపు రూ.30వేల కోట్ల ఆదాయం ప్రభుత్వానికి మద్యం ద్వారా లభిస్తోంది. ఈ క్రమంలో మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని కోల్పోరాదనే ఉద్దేశంతో ధరలు తగ్గించడానికి ప్రభుత్వం సాహసించలేదు. గత ఐదేళ్లలో మద్యం వ్యాపారం మొత్తం ప్రభుత్వమే నిర్వహించింది. దీంతో కమిషన్లు చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం మద్యం విక్రయాలను ప్రైవేట్ వ్యాపారులకు అప్పగించడంతో వారికి కమిషన్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ప్రభుత్వం ఇస్తానన్న కమిషన్కు చెల్లిస్తున్న దానికి పొంతన లేక పోవడంతో వ్యాపారులు ఆందోళన బాట పట్టారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా మద్యం ధరల్ని పెంచారు. క్వార్టర్ బాటిల్ ధర రూ.10 పెంచినట్టు చెప్పినా, ప్రస్తుతం ప్రతి క్వార్టర్కు అదనంగా రూ. 10వసూలు చేస్తున్నారు. హాఫ్ బాటిల్కు రూ.20, ఫుల్ బాటిల్ ధరపై రూ.40 చొప్పున కొత్త ధరల్ని మద్యం విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఏపీలో బీరు, రూ 99 మద్యం సీసాలపై ఎటువంటి పెంపులేదు2023-24లో దాదాపు రూ. 36వేల కోట్ల రుపాయలు ప్రభుత్వానికి ఆదాయంగా లభించింది. ఇందులో డిస్టిలరీలకు చెల్లించిన డబ్బుతో పాటు ఉద్యోగుల జీతాలకు పోగా రూ. 28-30వేల కోట్ల రుపాయల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ ఆదాయంపై స్పష్టత రావాల్సి ఉంది. మద్యం దుకాణాల్లో విక్రయాలకు 20శాతం కమిషన్ లభిస్తుందని ప్రచారం చేయడంతో పోటీ పడి దరఖాస్తులు చేశారు. ఈక్రమంలో లిక్కర్ వ్యాపారంలో పెట్టుబడులకు తగిన విధంగా లాభాలు రావడం




లేదని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత డిసెంబర్లో కమిషన్ పెంచకపోతే అమ్మకాలు నిలిపివేస్తామని అల్టిమేటం కూడా ఇచ్చారు. వ్యాపారులకు 14శాతానికి మార్జిన్ పెంచడం వల్ల రూ.వెయ్యి కోట్ల వరకు ప్రభుత్వం కోల్పోతుందని దీని స్థానంలో ధరలు పెంచాలని ఎక్సైజ్ శాఖ పలు ప్రతిపాద నలు సిద్ధం చేసింది. గరిష్ట చిల్లర ధర రూ.150 దాటిన బ్రాండ్లపై రూ.10 ధర పెంచాలని ప్రతి పాదన రెడీ చేసింది. , మద్యం బ్రాండ్లలో అన్ని కేటగిరీలకు 14శాతం మార్జిన్ ఇచ్చి , రూ.150 ఖరీదు దాటిన బ్రాండ్లపై రూ.10 పెంచితే ప్రభుత్వానికి రూ.135 కోట్లు మాత్రమే నష్టం అని లెక్కలు వేసింది. అయితే ప్రస్తుతం ప్రతి క్వార్టర్కు రూ.10 చొప్పున ధర పెంచి విక్రయిస్తున్నారు. క్వార్టర్ రూ.99 బ్రాండ్లు మినహా అన్నిటి పై రూ.10 పెంచి, 14శాతం మార్జిన్ ఇస్తే ప్రభుత్వానికి రూ.320 కోట్లు అదనంగా లభిస్తుంది. రూ.150 దాటిన బ్రాండ్లపై రూ.10 పెంచి మార్జిన్ను రెండు కేటగిరీల్లో 10.5, 14 శాతాలుగా అమలుచేస్తే రూ.220 కోట్ల ఆదాయం పెరుగుతుందని లెక్కలు వేస్తున్నారు. తాజా ధరలతో దుకాణాలకు చెల్లించాల్సిన కమిషన్ వెయ్యి కోట్లను మద్యం తాగే వారి నుంచి వసూలు చేస్తున్నట్టు స్పష్టమైంది.

# పవన్ కళ్యాణ్ శాఖలో లోకేష్ చొరవ

విజయవాడ, మార్చి 13

నారా లోకేష్ క్షమాపణ చెప్పారు. నల్లమల లోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం కాశీనాయన సత్రాన్ని అటవీ అధికారులు కూల్చేశారు. నిరంతర అన్నదానం జరిగే కట్టడాలు కూడా ఇందులో ఉన్నాయి. టైగర్ జోన్ ఏర్పాటు, అటవీ శాఖ నిబంధనల వల్ల ఫారెస్ట్ అధికారులు నల్లమల అటవీ ప్రాంతంలోని కాశీనాయన ఆశ్రమాన్ని కూల్చేశారు. దీనిపైనే నారా లోకేష్ క్షమాపణ చెబుతూ ప్రజల మనోభావాల్ని విజ్ఞప్తులను అధికారులు దృష్టిలో పెట్టుకుని ఉంటే బాగుండేదని.. ఈ ఘటన కు కారణమైన అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అలాగే కూల్చేసిన కట్టడాలని తిరిగి తాను నిర్మిస్తానని భక్తులకు హామీకు ఇచ్చారు. నారా లోకేష్ ప్రకటన భక్తులకు ఊరట కలిగించిన మాట వాస్తవమే. కానీ ఆ శాఖ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి చెందింది కావడం విశేషం. అటవీ శాఖ బాధ్యతలు ప్రస్తుతం ఆయన నిర్వహిస్తున్నారు. కాశీనాయన కట్టడాలని కూల్చేయొద్దు అంటూ పవన్ కళ్యాణ్ కి ఇప్పటికే చాలా వినతులు అందాయి. కానీ ఆయన నుండి స్పందన రాలేదు. ఇప్పుడు విద్యా, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఎంటర్ కావడం తో భక్తులకు ఊరట కలిగింది. కానీ ఇలా జనసేనకు చెందిన మంత్రిత్వ శాఖలో నారా లోకేష్ ఎంట్రీ ఇవ్వడం ఏపీ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. గతంలో హోంశాఖ బాధ్యతలు టిడిపి సరిగా నిర్వహించడం లేదంటూ హోం మంత్రి అనితను పవన్ కళ్యాణ్ బహిరంగంగానే విమర్శించిన ఘటన ఇంకా ఎవరూ మరువలేదు. తాను గనుక హోంశాఖ తీసుకుంటే పరిస్థితి వేరేలా ఉంటుందని కూడా పవన్ కళ్యాణ్ అప్పట్లో ప్రత్యర్థులకు వార్నింగ్ ఇచ్చారు. కానీ ఇలా వేరే మంత్రిత్వ శాఖ గురించి బహిరంగంగా పవన్ కళ్యాణ్ మాట్లాడడం పై అప్పట్లో పెద్ద చర్చే జరిగింది. ఇప్పుడు ఆయనకు సంబంధించిన శాఖలో నారా లోకేష్ ఎంట్రీ ఇవ్వడంపై అది కూడా జనసేన ఫ్లీనరీకి ఒక్కరోజు ముందు ఈ పరిణామం జరగడంతో ఏపీ రాజకీయాలు కొత్త చర్చ మొదలైంది. కానీ ఇంత ముఖ్యమైన విషయంలో పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించలేదు అనేది కాశీనాయన భక్తులకు అర్ధం కావడం లేదు. ఉమ్మడి నెల్లూరు జిల్లా బెడుసుపల్లిలో 1895లో పుట్టిన కాశీ రెడ్డి బాల్యంలోనే ఆధ్యాత్మిక చింతనలో పడ్డారు. దేశంలోని అనేక తీర్థాలు పుణ్యక్షేత్రాలు సందర్శించి కాశి నాయనగా మారారు. ఆయన పేరు మీద రాష్ట్రంలో అనేక ఆశ్రమాలు వెలిసాయి. కడప జిల్లాలోని బద్వేలు సమీపంలో ఉన్న ఆశ్రమం అతి ముఖ్యమైనది. ఇక్కడ నిత్య అన్నదానం జరుగుతూ ఉంటుంది. దానికి సంబంధించిన ఏర్పాట్లు తాను బతికి ఉండగానే కాశి నాయన 104 ఏళ్ల వయస్సు లో 1999లో దేహం చాలించారు. ఆయన పేరు మీద అప్పటి ప్రభుత్వం ఒక మండలాన్ని కూడా ఏర్పాటు చేసింది. రాయలసీమ ప్రాంతంలో కాశీనాయనకు ఎంతో మంది భక్తులు ఉన్నారు. ఇప్పుడు అటవీ నిబంధనల పేరుతో ఆయన ఆశ్రమాన్ని అన్నదాన సత్రాన్ని అటవీ అధికారులు కూల్చేయడం పై ఆందోళన మొదలైంది. ప్రస్తుతం లోకేష్ ఎంట్రీ ఇవ్వడంతో ఆ ఆందోళన సద్దుమణిగినా అది పవన్ కళ్యాణ్ కు చెందిన శాఖ కావడంతో జనసేన దీనిపై ఎలా స్పందిస్తుందో చూడాలి అంటున్నారు రాజకీయ పరిశీలకులు.

# పేదలకు అందని ప్రభుత్వ వైద్యం

నల్గొండ పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం అందని ద్రాక్ష గా మారింది. కొందరు ప్రభుత్వ డాక్టర్ ల ధన దాహం, కోట్లు ఖర్చు చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని తూట్లు పొడుస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రి లో ఉచితంగా చేయాల్సిన టెస్ట్ లకు ప్రయివేటుతో బేరాలు కుదుర్చుకుని 9 నెలల నిండు గర్భిణీ కి డెలవరీ చేయకుండా బెదిరించి గుంటూరు ఆసుపత్రి సిబ్బంది. యాదాద్రి జిల్లా చౌటుప్పల ప్రభుత్వ ఆసుపత్రి లో ఈ దారుణం వెలుగుచూసింది. స్:సాత్విక అనే నిండు గర్భిణీ గత తొమ్మిది నెలలుగా చౌటుప్పల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి నెల వైద్య సేవలు తీసుకుంది...గురువారం ఉదయం తనకు డెలివరీ ఉందని ఆసుపత్రికి వచ్చింది. నిండు గర్భిణీ ని బయట ప్రవేట్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకుని రావాలని పంపారు. అక్కడి ప్రభుత్వ వైద్యులు..... సుమారు 2000 రూపాయల వరకు టెస్టులకు ఖర్చుకాగా....ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్ తీసుకెళ్లిన తర్వాత కౌన్సెలింగ్ ఎక్కువగా ఉంది ఇక్కడ మేము ఆపరేషన్ చేయము అంటూ నల్గొండ లేదా హైదరాబాద్ లోని కోఠీ ఆసుపత్రులకు తీసుకెళ్లాలని ఉచిత సలహా ఇచ్చి బయటకు పంపారు..బాధిత కుటుంబ సభ్యులు మహిళను దిక్కుతోచని స్థితిలో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ 30000 రూపాయల వరకు ఖర్చు చేసి ఆపరేషన్ చేస్తున్నారు అనంతరం సాత్విక బంధువులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్కడ చూసినా ఖాళీ బెడ్లు కనిపిస్తున్నాయి మరియు ఇక్కడ గర్భిణులకు డెలివరీ లు మాత్రం చేయడం లేదన్నారు... దగ్గరుండి వారే బయటకు వెళ్ళమని చెప్పున్నారని కలెక్టర్ ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్ లో ఫిర్యాదు లెటర్ ను రాసి దీనికి సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు

## 144 కోట్లు దాటిన భారత జనాభా

న్యూఢిల్లీ, మార్చి 13,

పంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశంగా గుర్తింపు ఉన్న భారత్‌లో జనాభా రోజు రోజుకూ పెరుగుతూనే ఉంది. 150 కోట్లవైపు వేగంగా దూసుకెళ్తోంది. మరో 77 ఏళ్లలో భారత జనాభా 2011 లెక్కల ప్రకారం రెట్టింపు అవుతుందని ఐక్యరాజ్యసమితి జనాభా నిధి అంచనా వేసింది. ఈమేరకు తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈమేరకు పేర్కొంది. ఈ నివేదికలో ఇంకా చాలా ఆసక్తికర విషయాలను వెల్లడించింది. పదేళ్లుగా ఇండియాలో శిశు మరణాలు బాగా తగ్గాయని తెలిపింది. 2011లో జరిపిన జనాభా లెక్కల ప్రకారం భారత జనాభా 121 కోట్లు. ఇప్పుడు అది 144.17 కోట్లకు చేరిందని ఐక్యరాజ్య సమితి జనాభా నిధి అంచనా వేసింది. 13 ఏళ్లలో 23 కోట్ల మంది పెరిగినట్లు తెలిపింది. ఇక చైనా 142.5 కోట్ల జనాభాతో ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. ఇక ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత్‌లో యువ జనాభా పెరిగింది. జనాభాలో 14 ఏళ్లలోపు వారు 24 శాతం మంది ఉన్నారు. 10 నుంచి 19 ఏళ్ల మధ్య ఉన్న టీనేజర్లు 17 శాతం ఉండగా, 10 నుంచి 24 ఏళ్ల మధ్య యువత 68 శాతం ఉంది. ఇక 65 ఏళ్లు దాటిన వారి జనాభా కేవలం 7 శాతంగా ఉంది. ఇండియాలో యువ జనాభా ఎక్కువగా ఉండడం దేశ అభివృద్ధికి అనుకూల అంశం. ఇక భారత్‌లో ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరిగాయని ఐక్యరాజ్య సమితి తెలిపింది. అందుకే ప్రజలు ఎక్కువ కాలం జీవిస్తున్నట్లు వెల్లడించింది. దేశంలో పురుషుల సగటు ఆయుష్షు 71 ఏళ్లు ఉండగా, మహిళల ఆయుష్షు 74 ఏళ్లుగా ఉందని వివరించింది. మొత్తంగా ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం భారత్‌లో జనాభా పెరుగుతున్నా.. దేశంలో ఆర్థిక, సామాజిక పరిస్థితులు కూడా మెరుగవుతున్నాయి. ఆరోగ్య రంగం మెరుగుపడుతోంది. ఆయుష్షు పెరుగుతోంది. శిశు మరణాలూ తగ్గుతున్నాయి. ఇవన్నీ శుభసూచకమే అని భారతీయులు అభిప్రాయపడుతున్నారు. భారత జనాభా 150 కోట్లకు చేరిన తర్వాత.. తగ్గుతుందని అంచనా వేస్తున్నారు.

## అక్రమ దందాతో అధికారులకు బెదిరింపులు

కరీంనగర్, మార్చి 13,

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మెట్ పల్లి మండలాల్లో గత కొంత కాలంగా అక్రమ ఇసుక రవాణాతో పాటు భూమి సెటిల్మెంట్ దందాలు చేస్తూ ఎదిరించిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరించిన ముగ్గురిని ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు సెల్ ఫోన్లు, 80 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమక్షంలో వారిని చూపించి మెట్ పల్లి సిఐ నిరంజన్ రెడ్డి వివరాలు వెల్లడించారు. మెట్ పల్లి మండలం రాజేశ్వరరావు పేట కు చెందిన రెంజర్ల అజయ్, మెట్ పల్లి కి చెందిన బత్తుల భరత్, జెట్టి లక్ష్మణ్ ముగ్గురు ముఠాగా ఏర్పడి అక్రమ దందాకు తెరలేపారు. నిందితులు మెట్‌పల్లిలో అక్రమంగా ఇసుక రవాణా చేయడమే కాకుండా సెటిల్మెంట్ దందాలు చేస్తూ అమాయకులను బెదిరించి డబ్బులు వసూలు చేసి జల్సాలు చేశారు. చెప్పినట్టు ఎవరైన వినకపోతే వారిపై ఎస్సీ ఎస్టి అట్రాసిటీ కేసు పెడతామని బెదిరించి అందిన కాడికి దండుకునేవారని పోలీసులు తెలిపారు. గత నెల ఫిబ్రవరి 12న రేంజర్ల అజయ్.. రాజేశ్వరరావు పేటలో అక్రమంగా మొరం రవాణా చేస్తుండగా ఇరిగేషన్ డిపార్ట్మెంట్ డీఈఈ లక్కంపల్లి అరుణోదయ కుమార్ అడ్డుకున్నారు. అజయ్ ఈ విషయాన్ని రమేష్ కు ఫోన్ ద్వారా చెప్పగా రమేష్ అక్కడికి చేరుకొని అరుణోదయ కుమార్ ను దూషించాడు. అక్రమ రవాణాను అడ్డుకున్న అరుణోదయ్ కుమార్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని బెదిరించడంతో అతను అక్కడి నుండి పారిపోయాడు. ఆ తర్వాత అరుణోదయ కుమార్ కు బత్తుల భరత్ ఫోన్ చేసి, కులం పేరుతో దూషించారని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని బెదిరించాడు. కేసు పెట్టకుండా ఉండాలంటే మూడు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో భయపడ్డ అరుణోదయకుమార్ ఫోన్ ఫే ద్వారా రెండుసార్లు మొత్తం 1,10,000 రూపాయలు పంపించాడు. 40,000 నగదు ఇచ్చాడు. అయినప్పటికీ, ఇంకా 1,50,000 ఇవ్వాలని అధికారిపై ఒత్తిడి తీసుకురావడంతో, ఉదయ్ కుమార్ ఇబ్రహీపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఇబ్రహీంపట్నం శివారులోని గండి హనుమాన్ వద్ద ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లిలో విలేకరిగా చలామణి అవుతూ అమాయకుల నుండి అక్రమ వసూళ్లకు పాల్పడుతూ, ప్రభుత్వ అధికారులపై నిరాధరమైన ఆరోపణలు చేస్తున్న గట్టేపల్లి రాజశేఖర్ అనే వ్యక్తిని మెట్ పల్లి పోలీసులు చేశారు. కళానగర్ కు చెందిన గట్టేపల్లి రాజశేఖర్ గత కొంత కాలంగా ఆర్ ఆర్ న్యూస్ పేరిట విలేకరి ముసుగులో అమాయక ప్రజలు, వ్యాపారులు, ప్రభుత్వ అధికారులను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నాడనే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సిఐ నిరంజన్ రెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం అరెస్ట్ అయిన ముగ్గురితో ఈ విలేకరి అక్రమ దందాలకు పాల్పడమే కాకుండా బ్లాక్ మెయిల్ కు పాల్పడంతో చీటింగ్ కేసు నమోదు చేసి అధికారులను బెదిరించడం పై చట్ట పరంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎవరైనా అక్రమ దందాలకు పాల్పడినా, బ్లాక్ మెయిల్ చేసస్తూ బెదిరించినా పోలీసులను ఆశ్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లో మంటలు

సికింద్రాబాద్..బేగంపేట ప్రకాష్ నగర్ సంపత్ అపార్ట్మెంట్ సమీపంలో ఓ ట్రాన్స్ఫార్మర్ నుంచి అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అర్ధరాత్రి వేళ మంటలు చెలరేగడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల ప్రజలు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపులోకి తీసుకురావడంతో విద్యుత్ అధికారులు వేరే ట్రాన్స్ఫార్మర్ ను అమర్చారు.

## దేశం కాలుష్యానికి కేరాఫ్‌గా మారుతోందా..

న్యూఢిల్లీ, మార్చి 13

దేశం కాలుష్యానికి కేరాఫ్‌గా మారుతోందా.. దేశంలో గాలి నాణ్యత వేగంగా పడిపోతుందా అంటే పర్యావరణ నివేదికలు అదే చెబుతున్నాయి. రోజు రోజుకూ దేశంలో కాలుష్య తీవ్రత పెరుగుతోంది. గాలి నాణ్యత పడిపతోంది. ప్రపంచంలో అత్యంత కాలుష్య నగరాలు 20 ఉండగా, అందులో 13 దేశాలు భారత్‌లోనే ఉండడం గమనార్హం.

ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరాల జాబితాలో భారత్ ఒక ప్రముఖ స్థానంలో ఉంది. 2024లో స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ సంస్థ ఎఖింతితీ విడుదల చేసిన 'వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్' ప్రకారం, ప్రపంచంలోని టాప్ 20 కాలుష్య నగరాల్లో 13 భారతదేశంలోనివే ఉన్నాయి. ఈ జాబితాలో మేఘాలయలోని బైర్నీహట్ అగ్రస్థానంలో నిలిచింది. దేశ రాజధాని ఢిల్లీప్రపంచంలోనే అత్యంత కాలుష్య రాజధానిగా గుర్తింపు పొందింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే చాలా ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భారత్‌లోని 13 కాలుష్య నగరాలు

బైర్నీహట్(మేఘాలయ) అత్యంత కాలుష్య నగరంగా నిలిచింది.

ఢిల్లీ అత్యంత కాలుష్య రాజధానిగా రికార్డు సష్టించింది.

ముల్లన్‌పూర్ (పంజాబ్)

ఫరీదాబాద్ (హర్యానా)

లోనీ(ఉత్తరప్రదేశ్)

న్యూఢిల్లీ

గురుగ్రామ్(హర్యానా)

గంగానగర్(రాజస్థాన్)

గ్రేటర్ నోయిడా(ఉత్తరప్రదేశ్)

భివాడీ(రాజస్థాన్)

ముజఫ్ఫర్‌నగర్(ఉత్తరప్రదేశ్)

హనుమాన్‌గఢ్ (రాజస్థాన్)

నోయిడా (ఉత్తరప్రదేశ్)

ఈ రిపోర్ట్‌లో కాలుష్య స్థాయిలను ఖఓ2.5 (పార్టిక్యులేట్ మ్యాటర్ 2.5) ఆధారంగా కొలుస్తారు. ఖఓ2.5 అనేది 2.5 మైక్రోమీటర్ల కంటే చిన్న కణాలను సూచిస్తుంది, ఇవి ఊపిరితిత్తుల్లోకి, రక్తప్రవాహంలోకి చొచ్చుకుపోయి శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. భారత్‌లో సగటు ఖఓ2.5 స్థాయి 2024లో 50.6 మైక్రోగ్రామ్స్ పర్ క్యూబిక్ మీటర్‌గా నమోదైంది, ఇది 2023లో 54.4తో పోలిస్తే 7% తగ్గినప్పటికీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన సురక్షిత స్థాయి (5 మైక్రోగ్రామ్స్) కంటే ఇంకా 10 రెట్లు ఎక్కువగా ఉంది. ఢిల్లీలో సగటు ఖఓ2.5 స్థాయి 91.6 మైక్రోగ్రామ్స్‌గా ఉంది. ఇది చిఊూ సురక్షిత పరిమితి కంటే దాదాపు 18 రెట్లు ఎక్కువ.

కాలుష్యానికి కారణాలు..

భారత్‌లో కాలుష్యం పెరగడానికి ప్రధాన కారణాలు:వాహన ఉద్గారాలు: ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్ వంటి నగరాల్లో ట్రాఫిక్ సాంద్రత వల్ల ఎక్కువ కాలుష్యం. పారిశ్రామిక కాలుష్యం: ఫరీదాబాద్, భివాడీ వంటి ప్రాంతాల్లో పరిశ్రమల నుండి వెలువడే ఉద్గారాలు. పంటల అవశేషాల దహనం: పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో స్టబుల్ బర్నింగ్ వల్ల ఉత్తర భారతదేశంలో కాలుష్యం పెరుగుతోంది. నిర్మాణ ధూళి: వేగంగా అభివద్ధి చెందుతున్న నగరాల్లో నిర్మాణ కార్యకలాపాలు. వాతావరణం: శీతాకాలంలో ఉష్ణోగ్రత తలక్రిందులు కావడం వల్ల కాలుష్య కణాలు గాలిలో చిక్కుకుంటాయి. ఆరోగ్య ప్రభావంభారత్‌లో వాయు కాలుష్యం ఒక తీవ్రమైన ఆరోగ్య సంక్షోభంగా మారింది. ఇది సగటు జీవిత కాలాన్ని 5.2 సంవత్సరాలు తగ్గిస్తుందని అంచనా. లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ అధ్యయనం ప్రకారం, 2009?2019 మధ్య ఏటా సుమారు 15 లక్షల మరణాలు ఖఓ2.5 కాలుష్యంతో సంబంధం కలిగి ఉన్నాయి. ప్రపంచంలోని టాప్ 20 కాలుష్య నగరాల్లో 13 భారత్‌లో ఉండటం ఆందోళనకరం. ఢిల్లీ వంటి రాజధాని నగరం కాలుష్యంతో కొట్టుమిట్టాడుతుంటే, బైర్నీహట్ వంటి చిన్న పట్టణాలు కూడా ఈ జాబితాలో చేరడం వాయు కాలుష్య సమస్య విస్తృతిని చూపిస్తోంది. ప్రభుత్వం 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్' వంటి చర్యలు చేపడుతున్నప్పటికీ, కఠిన నియంత్రణలు, ప్రజల సహకారం లేకుండా ఈ సమస్యను అధిగమించడం కష్టం. వాయు కాలుష్యాన్ని తగ్గించడం కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.

## ఆర్టిఫిషియల్ హార్ట్ తో 100 రోజులు

న్యూఢిల్లీ, మార్చి 13

వైద్య చరిత్రలో మరో అద్భుతం చోటు చేసుకుంది. కృత్రిమ గుండెతో ఓ వ్యక్తి ఏకంగా వంద రోజులు జీవించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. గుండె దాత కోసం ఎదురు చూస్తున్న ఆస్ట్రేలియాకి చెందిన 40 ఏళ్ల రోగికి వైద్యులు కృత్రిమ టైటానియం గుండెను అమర్చారు. అయితే అతడు 100 రోజులు జీవించాడు. ఈ సాంకేతికతతో ఇప్పటివరకు ఎక్కువ కాలం జీవించిన వ్యక్తి అతడే. గత ఏడాది నవంబర్‌లో సిడ్నీలోని సెయింట్ విన్సెంట్ హాస్పిటల్‌లో సదరు రోగికి కృత్రిమ టైటానియం గుండెను వైద్యులు ఇంప్లాంట్ చేశారు. అయితే ఈ నెల ప్రారంభంలో గుండె దాత దొరకడంతో అప్పటి వరకు ఆ రోగి కృత్రిమ గుండెతో బతికేలా వైద్యులు చికిత్స అందించారు. తీవ్రమైన గుండె వైఫల్యంతో బాధపడుతున్న ఆ వ్యక్తి ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నాడని సెయింట్ విన్సెంట్ హాస్పిటల్, మోనాష్ విశ్వవిద్యాలయం, ఈ పరికరం వెనుక ఉన్న యుఎస్-ఆస్ట్రేలియన్ కంపెనీ బివాకర్ మీడియాకు తెలిపారు. గుండె వైఫల్యంతో బాధపడుతున్న వ్యక్తులకు కృత్రిమ హృదయం దీర్ఘకాలిక ఎంపికను అందించగలదనే సంకేతంగా ఈ పరికరం అతని ప్రాణం ఇంత కాలం నిలబెట్టగలిగింది. అయితే ఈ పరికరం ఇంకా ట్రయల్ దశలో ఉంది. సాధారణ ఉపయోగం కోసం ఇంకా ఆమోదించబడలేదని వైద్యులు తెలిపారు. ఃతిఎంఅూఖీ (ఆర్టిఫిషియల్ గుండె) వ్యవస్థాపకుడు, ఆస్ట్రేలియన్ బయో ఇంజనీర్ డేనియల్ టిమ్స్.. తన తండ్రి గుండె జబ్బుతో మరణించిన తర్వాత ఈ పరికరాన్ని కనిపెట్టాడు. తాజాగా ఓ రోగి దీని ఆధారంగా 100 రోజులు బ్రతకం చూసి దశాబ్దాల తన కృషి ఫలించడం చూడటం చాలా ఆనందంగా ఉందని అన్నారు. మా ఆర్టిఫిషియల్ హార్ట్ పై నమ్మకం ఉంచినందుకు రోగికి, అతని కుటుంబానికి ఃతిఎంఅూఖీ బృందం కృతజ్ఞతలు తెలుపుతోందని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. వారి ధైర్యం లెక్కలేనన్ని రోగుల ఈ ప్రాణాలను రక్షించే సాంకేతికతను పొందడానికి మార్గం సుగమం చేస్తుందని అన్నారు ఆర్టిఫిషియల్ గుండె అనేది టోటల్ ఆర్టిఫిషియల్ హార్ట్. ఇందులో ఒకే కదిలే భాగం ఉంటుంది. ఇది అయస్కాంతాల ద్వారా ఉంచబడే లెవిటేటెడ్ రోటర్. దీని పేరు మాదిరిగి ఇది టైటానియంతో నిర్మించబడింది. ఇది శరీరానికి, ఊపిరితిత్తులకు రక్తాన్ని పంప్ చేస్తుంది. గుండె రెండు జఠరికల పనిని ఇది చేస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 18 మిలియన్ల మంది హృదయ సంబంధ వ్యాధులతో మరణిస్తున్నారు. దాతల కోసం వెయిటింగ్ లిస్టులో కొట్టుమిట్టాడుతున్న ఎక్కువ మందిని కాపాడటానికి ఈ పరికరాన్ని ఉపయోగించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. అమెరికా ఆరోగ్య శాఖ ప్రకారం 2024 లో దాదాపు 3,500 మందికి గుండె మార్పిడి జరిగింది. అదే సంవత్సరం దాదాపు 4,400 మంది వెయిటింగ్ లిస్టులో చేరారు. ఆర్టిఫిషియల్ గుండె.. గుండె మార్పిడికి పూర్తిగా కొత్త ఆశలకు నాంది పలికిందని అన్నారు. రాబోయే దశాబ్దంలో దాత గుండె కోసం వేచి ఉండలేని రోగులకు లేదా దాత గుండె అందుబాటులో లేనప్పుడు కృత్రిమ గుండె ప్రత్యామ్నాయంగా మారడాన్ని మనం చూస్తాం' అని ఆస్ట్రేలియన్ రోగి కోలుకోవడాన్ని పర్యవేక్షిస్తున్న క్లినికల్ ట్రయల్స్ కోసం పరికరాన్ని సిద్ధం చేయడంలో పాల్గొన్న వైద్యుడు హేవార్డ్ అన్నారు. ఈ పరికరాన్ని ఇప్పటికే యునైటెడ్ స్టేట్స్‌లో ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రారంభ సాధ్యాసాధ్య అధ్యయనంలో పరీక్షించారు. దీనిలో భాగంగా ఐదుగురు రోగులు ఈ పరికరాన్ని విజయవంతంగా అమర్చారు. మొదటిది గత జూలైలో, టెక్సాస్ మెడికల్ సెంటర్‌లో శస్త్రచికిత్స సమయంలో ఎండ్-స్టేజ్ గుండె వైఫల్యంతో బాధపడుతున్న 58 ఏళ్ల వ్యక్తికి ఇంప్లాంట్ చేశారు. దాత అందుబాటులోకి వచ్చే వరకు అది అతన్ని ఎనిమిది రోజులు సజీవంగా ఉంచింది. ఇలా ఈ అధ్యయనంలో మరో నలుగురు రోగులకు అమర్చారు. ఈ ట్రయల్ 15 మంది రోగులకు అమర్చాలని వైద్యులు భావిస్తున్నారు.

## జయకేతనానికి భారీ ఏర్పాట్లు

పిఠాపురంమార్చి 13,

మార్చి 14న జనసేన 12వ ఆవిర్భావ సభ నిర్వహించబోతున్నామని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఆవిర్భావ సభకు జయకేతనం అని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పేరు పెట్టినట్లు వెల్లడించారు. పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ వద్ద నిర్వహించే జయకేతనం సభ చరిత్రలో నిలిచిపోతుందని ఆయన తెలిపారు. ఈ మేరకు జయకేతనం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జయకేతనం సభకు ఏపీ నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా జనసైనికులు, మహిళలు, పవన్ కల్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారని నాదేండ్ల మనోహర్ తెలిపారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో నిర్వహించబోయే ఈ సభ స్థానిక చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా ఉంటుందని మనోహర్ వెల్లడించారు. ఈ ప్రాంతానికి విశేష సేవలందించిన మహానుభావులను స్మరించుకునే విధంగా మూడు ముఖద్వారాలకు వారి పేర్లు పెట్టామని ఆయన వివరించారు. తొలి ద్వారానికి పిఠాపురం మహారాజు శ్రీ రాజా సూర్యరావు బహదూర్ పేరు పెట్టామని తెలిపారు. ఆయన విద్యాభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు ఎనలేని కృషి చేశారని వివరించారు. రెండవ ద్వారానికి రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులకు సహాయం చేసిన డొక్కా సీతమ్మ పేరు పెట్టామని, ఇక మూడవ ద్వారానికి విద్యాసంస్థలు స్థాపించి చరిత్ర సృష్టించిన మల్లాది సత్యలింగం నాయకర్ పేరు పెట్టామని నాదెండ్ల పేర్కొన్నారు. ఈ ముగ్గురు మహానుభావులు ఆయా ప్రాంతాలకు చేసిన సేవలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తిని భావితరాలకు అందించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని మనోహర్ వెల్లడించారు. భారతదేశ రాజకయా చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ప్రజలు జనసేనకు అఖండ విజయాన్ని అందించారని మనోహర్ అన్నారు. పోటీ చేసిన ప్రతి స్థానంలో జనసేన విజయం సాధించిందని, ఇది జనసైనికులు, వీర మహిళలు, నాయకుల నిస్వార్థ సేవలకు ఫలితమని ఆయన కొనియాడారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని, పవన్ కళ్యాణ్ గారికి కృతజ్ఞతలు తెలుపుతూ, పిఠాపురం ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసేందుకు ఈ సభను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## అందోళన కేసులో టీడీపీ నేతలకు విముక్తి

విజయవాడ

7ఏళ్ల నాటి ఆందోళనలపై టీడీపీ నేతలపై నమోదైన కేసును ప్రజాప్రతినిధుల కోర్టు కొట్టివేసింది. ఓబులాపురం మైనింగ్పై గతంలో టీడీపీ నేతల ఆందోళనలు, కేసులు నమోదు విషయం తెలిసిందే. గురువారం నాడు కేసులో వున్న నేతలు విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణకు హాజరైయారు. విచారణకు హాజరైన వారిలో మంత్రి అచ్చం నాయుడు, మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి, దేవినేని ఉమా, నిమ్మకాయల చినరాజప్ప, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, ఎర్రబెల్లి దయాకర్, అమర్నాథ్ రెడ్డి, బాబు రాజేంద్రప్రసాద్, కోళ్ల లలిత కుమారి, పొలం నాగరాజు, చిన్నబాబు రమేష్, గురుమూర్తి తదితరులు ఉన్నారు. గత కొన్నేళ్లుగా విచారణకు హాజరవుతున్న నాయకులకు కేసు కొట్టివేతతో విముక్తి లభించింది. 2007లో ఓబులాపురం మైనింగ్ పరిశీలనకు వెళ్లిన 21 నేతల మంది పై కేసు నమోదైంది.

ఓబుళాపురం మైనింగ్ కంపెనీ అక్రమంగా తవ్వకాలు సాగిస్తోందంటూ 2004-2009 మధ్య కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఓఎంసి అక్రమాలంటూ ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ పెద్ద ఎత్తున పోరాట చేసింది. వాటికి వ్యతిరేకంగా నాటి కాంగ్రెస్ పా ఓబుళాపురం మైనింగ్ కంపెనీ అధినేత గాలి జనార్దన్ రెడ్డి కూడా టీడీపీని తీవ్ర స్థాయిలో విమర్శించే వారు. అప్పట్లో ఓబుళాపురం గనుల తవ్వకాలపై అసెంబ్లీ సభా సంఘాన్ని కూడా నియమించింది. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు నిజనిరారణ కోసం వెళారు. 17ఏళ్ల నాటి కేసు విచారణ కోసం ఏపీ, టీడీపీ నేతలు హాజరై కోర్టులో ఒకరినొకరు నవ్వుతూ పలకరించుకున్నారు.

## మరింత పెరిగిన హెచ్‌ఎండీ పరిధి

హైదరాబాద్, మార్చి 13

హైదరాబాద్ విస్తరణపై ఫోకస్ పెట్టిన రేవంత్ సర్కార్ తాజాగా హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ పరిధిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఊఓఆం స్థానంలో కొత్తగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌ను తీసుకొచ్చింది. హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు చుట్టూ.. తెలంగాణ ముఖచిత్రం మార్చేలా రీజనల్ రింగు రోడ్డు ప్రాజెక్టు పట్టాలెక్కిస్తుండటంతో భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని నగర పరిధిని విస్తరించారు. అందులో భాగంగానే హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ విస్తీర్ణం 7,257 చదరపు కిలోమీటర్లు ఉంది. 7 జిల్లాలు, 74 మండలాలు, సుమారు 1000 గ్రామపంచాయతీలు, ఎనిమిది కార్పొరేషన్లు, 38కి పైగా మన్సిపాలిటీలు హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నాయి. తాజాగా.. మరో 3 వేల చదరపు కిలోమీటర్లు విస్తరస్తూ.. హెచ్ఎంఆర్ పరిధిని 10,472.72 చదరపు కిలోమీటర్లగా నిర్ణయించారు. హెచ్ఎంఆర్ పరిధిలో 11 జిల్లాలు, 104 మండలాలు, 1355 రెవెన్యూ గ్రామాలు ఉండనున్నాయి. ప్రస్తుతం ఉన్న ఊఓఆం పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలు ఉన్నాయి. వీటితో పాటుగా కొత్తగా నల్గొండ, వికారాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలను చేర్చారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 533 రెవెన్యూ గ్రామాలున్నాయి. అతి తక్కువగా నాగర్‌కర్నూల్ జిల్లాలో మూడు గ్రామాలు మాత్రమే ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో ఇప్పటికే హెచ్ఎండీఏ పరిధిలో రెవెన్యూ గ్రామాలు ఉండగా.. వాటికి అదనంగా కొత్త గ్రామాలు హెచ్ఎంఆర్‌లో కలిపారు. జిల్లాల వారీగా గ్రామాలు చూసుకుంటే.. రంగారెడ్డి జిల్లాలో 533, మేడ్చల్-మల్కాజిగిరి163, యాదాద్రి-భువనగిరి 162, సంగారెడ్డి 151, మెదక్ 101, సిద్దిపేట 74, హైదరాబాద్ 64, వికారాబాద్ 54, నల్గొండ 31, మహబూబ్ నగర్ 19, నాగర్ కర్నూల్ 3 గ్రామాలతో కలిపి మె?త్తం 1,355 గ్రామాలు హెచ్ఎంఆర్ పరిధిలో ఉండనున్నాయి. కొత్తగా ఏర్పాటు చేసే హెచ్ఎంఆర్ పరిధితో ఆయా మండలు, గ్రామాల్లో భూములకు రెక్కలు రానున్నాయి. నగర శివారు ప్రాంత భూములకు ఇప్పటికే డిమాండ్ లక్షలు, కోట్లలో ఉండగా.. కొత్తగా చేరే మండలాల్లో భూముల ధరలు ఆకాశాన్ని తాకే ఛాన్స్ ఉంది

డబుల్ డెక్కర్ కారిడార్

హైదరాబాద్ నగరం విశ్వనగరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. నగరంలో ట్రాఫిక్ ప్రధాన సమస్య కాగా.. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఇప్పటికే నగరంలో కొత్త ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు నిర్మించారు. ఇక ఉత్తర తెలంగాణ ప్రజలు హైదరాబాద్ నగరంలోకి ఈజీగా చేరుకునేందుకు జాతీయ రహదారి 44పై సికింద్రాబాద్ జంక్షన్ ప్యారడైజ్ నుంచి తాడ్‌బండ్ జంక్షన్, బోయినపల్లి జంక్షన్ మీదుగా డెయిరీఫాం వరకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు సిద్ధమయ్యారు. సీఎం రేవంత్ ఇప్పటికే ఈ పనులకు శంకుస్థాపన చేశారు. తాజాగా ప్రాజెక్టులో మరో ముందడుగు పడింది. ఈ ఎలివెటేడ్ కారాడార్ నిర్మాణంలో భాగంగా.. బేగంపేట వద్ద సొరంగం నిర్మించాల్సి ఉంది. ఈ టన్నెల్ మార్గం పనులకు ఎయిర్‌పోర్టు అథారిటీ నుంచి తాజాగా గ్రీన్ సిగ్నల్ వచ్చింది. మొత్తం కారిడార్ పొడవు 5.40 కిలోమీటర్లు కాగా.. ఇందులో టన్నెల్ మార్గం 0.6 కిలోమీటర్లు ఉండనుంది. బోయినపల్లి కూడలి నుంచి బాలంరాయి రోడ్డును కనెక్ట్ చేస్తూ ఈ సొరంగ మార్గం ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఎలివేటెడ్ కారిడార్ కోసం ప్రైవేటు ఆస్తులను అధికారులు గుర్తించారు. త్వరలో బాధితులకు నష్టపరిహారం అందజేయనున్నారు. రోడ్డుకు రెండు వైపులా 200 మీటర్ల వరకు వెడల్పు చేయాల్సి ఉంది. దీంతో ఆ మేరకు ఆస్తులను అధికారులు గుర్తించారు. కంటోన్మెంట్‌లో రక్షణశాఖ ఆస్తులను కూడా హెచ్ఎండీఏకు అప్పగించే ప్రక్రియ జరుగుతోంది. కాగా, నేషనల్ హైవే 44పై రూ.1,580 కోట్ల వ్యయంతో ఈ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి తాడ్‌బండ్, బోయినపల్లి జంక్షన్ మీదుగా డెయిరీ ఫామ్ రోడ్డు వరకు 5.40 కిలోమీటర్ల డబుల్డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్, జేబీఎస్ నుంచి శామీర్‌పేట ఔటర్ రింగు రోడ్డును కలుపుతూ 18.1 కిలోమీటర్ల మేర మరో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడనుంది. మేడ్చల్, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ రూట్లలో వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రస్తుతం నగరం నుంచి బయటకు వచ్చి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే 3 నుంచి 4 గంటలకు పైగా సమయం పడుతోంది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ జాతీయ రహదారి వైపు ప్రయాణికుల ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి.

# ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు బ్యాక్ టూ పెవిలియన్

హైదరాబాద్, మార్చి 13,

తెలంగాణ పాలిటిక్స్‌లో ఆసక్తికర ఇన్సిడెంట్స్ చోటు చేసుకుంటున్నాయి. అసెంబ్లీలోని బీఆర్ఎస్ఎల్పీ ఆఫీసులో ఉన్న గులాబీ బాస్ కేసీఆర్‌ను..పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కలిశారు. తన తమ్ముడి పెళ్లికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. అయితే ఇన్విటేషన్ కార్డు ఇచ్చేందుకే కలిసినా గూడెం తిరిగి బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది.కారు గుర్తు మీద గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన గూడెం మహిపాల్‌రెడ్డికి పటాన్‌చెరులో పరిస్థితులు అంతగా అనుకూలించడం లేదట. లోకల్ కాంగ్రెస్ లీడర్లను గూడెం అసలు పట్టించుకోవడం లేదట. కాంగ్రెస్ పార్టీ విధానాలపై ఆయన అసంతృప్తిగా ఉన్నారన్న చర్చ జరుగుతోంది.ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ ఫోటో పెట్టుకోలేదని లోకల్ కాంగ్రెస్ లీడర్లు ఆ మధ్య రచ్చ చేశారు. ఇంకా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫోటోనే ఉందని హంగామా సృష్టించారు. గూడెం మాత్రం బరాబర్ కేసీఆర్ ఫోటో పెట్టుకుంటా అంటూ స్టేట్ మెంట్ ఇచ్చేశారు. అంతేకాదు వివాహాలు, విందు కార్యక్రమాలకు వెళ్ళినప్పుడు పిచ్చాపాటిగా గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు హాట్ టాపిక్ అవుతున్నాయి.ఏదో కాంగ్రెస్‌లో చేరాను కానీ బీఆర్ఎస్‌లోనే ఉన్నానని అంటున్నారట గూడెం. దీనికి తోడు కాంగ్రెస్ పార్టీ తీసుకొనే కార్యక్రమాలకు ఆయన డుమ్మా కొడుతున్నారు. కాంగ్రెస్ ఓ పార్టీనా అంటూ గూడెం చేసిన కామెంట్స్ కూడా దుమారం లేపుతున్నాయి. ఇలా ఆయన మనసు బీఆర్ఎస్ వైపు లాగుతోందన్న చర్చ జరుగుతోంది. త్వరలోనే గూడెం మహిపాల్‌రెడ్డి తిరిగి కారు ఎక్కుతారని అంటున్నారు.ఆయనే కాదు మరొకరిద్దరు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తిగా ఉన్నారట. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అయితే..ఏకంగా తాను కాంగ్రెస్‌లో చేరలేదంటూ పోలీస్ కంప్లైంట్ ఇచ్చారు. ఆ మధ్య అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కనిపించారు. దీంతో కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరారన్న ప్రచారం జరిగింది. ఆయనకు లోకల్‌గా జడ్పీ ఛైర్మన్ సరిత తిరుపతయ్యతో పొసగడం లేదట.మొన్నటి ఎన్నికల్లో కృష్ణమోహన్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు సరిత. బీఆర్ఎస్ నుంచి గెలిచిన కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరడంతో ఇద్దరి మధ్య ఉప్పు నిప్పుగా ఉందట వ్యవహారం. సేమ్ టైమ్ సుప్రీంకోర్టులో ఉన్న అనర్హత కేసు కూడా భయపెడుతోందట. కాంగ్రెస్ పెద్దల తీరుపై ఆయన అసంతృప్తిగా ఉన్నారట. చేరే వరకు ఎన్నో హామీలిచ్చి..ఇప్పుడు కనీసం అపాయింట్ మెంట్ కూడా ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారట. దాంతో కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరుతారన్న ప్రచారం జరుగుతోంది.మరో ఎమ్మెల్యే దానం నాగేందర్..ఆ పది మందిలో అందరి కంటే ముందే కాంగ్రెస్‌లో చేరారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి కంటెస్ట్ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన రేవంత్ సర్కార్‌పై అసంతృప్తి రాగం వినిపిస్తున్నారు. హైడ్రా విషయంలో అయితే ఓపెన్‌గానే తన వైఖరేంటో చెప్తూ..కూల్చివేతలను అడ్డుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేస్తున్నారు.రాజకీయ వర్గాల్లో సంచలనం రేపిన ఫార్ములా ఈ కార్ రేస్‌పై దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. ఈ కార్ రేస్‌తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని చెప్పారు దానం. అల్లు అర్జున్ అరెస్టను కూడా ఖండించారు. కేసీఆర్‌ను కూడా పొగడ్తలతో ముంచెత్తారు దానం. కొన్ని రోజులుగా సైలెంట్‌గా ఉన్న దానం తిరిగి బీఆర్ఎస్‌కు టచ్‌లోకి వెళ్లారన్న ప్రచారం జరుగుతోంది.సుప్రీంకోర్టు తీర్పు వస్తే ఫస్ట్ వేటు పడేది దానం మీదేనని అందరూ భావిస్తున్నారు. పైగా కాంగ్రెస్‌లోనే ఉంటే బైపోల్స్ వస్తే తనకు టికెట్ కూడా దక్కదని.. బీఆర్ఎస్‌లోకి వెళ్లడమే బెటర్ అనుకుంటున్నారట దానం. ఒకవేళ ఆయన వస్తానంటే బీఆర్ఎస్ చేర్చుకుంటుందా లేదా అన్నదే పెద్ద క్వశ్చన్‌గా మారింది.కాంగ్రెస్ పార్టీలోకి ఎంట్రీ అదుర్స్ అనిపించినా..కంటిన్యూ అవడం కష్టంగా ఉందట. ఓవైపు కాంగ్రెస్ పెద్దలు తమకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం లేదన్న అసంతృప్తి, మరోవైపు అనర్హత గుబులు..ఇంకోవైపు నియోజకవర్గంలో లోకల్ కాంగ్రెస్ లీడర్లతో పొసగక..ఏం చేయాలో అర్థం కావడం లేదట జంపింగ్ ఎమ్మెల్యేలకు. ఈ నేపథ్యంలోనే ముగ్గురు, నలుగురు ఎమ్మెల్యేలు తిరిగి కారు ఎక్కేందుకు రెడీ అవుతున్నారన్న టాక్ వినిపిస్తోందిమాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కూడా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడాక కాంగ్రెస్ గూటికి చేరారు. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో తన నియోజకవర్గానికి మంజూరు అయిన ఓ బ్రిడ్జికి కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లు క్యాన్సిల్ చేయడంపై ఆయన అసంతృప్తిగా ఉన్నారట. ఆయన కూడా తిరిగి తెలంగాణ భవన్ వైపు చూస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. ఇందులో భాగంగానే గులాబీ బాస్ కాంగ్రెస్ పార్టీకి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడం ఖాయమన్న ప్రచారం జరుగుతోంది. ఏం జరగబోతోందో చూడాలి మరి.

# శ్రీనివాస కళ్యాణోత్సవానికి మంత్రి ఆనం ను ఆహ్వానించిన టీటీడీ ఈవో, జేఈవోలు

అమరావతి

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో మార్చి 15న వేంకట పాలెంలో నిర్వహించనున్న శ్రీనివాస కళ్యాణోత్సవానికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కి టీటీడీ ఈవో, జెఈవో లు అధికారికంగా ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం తో టీటీడీ అధికారులు సమావేశమై కళ్యాణోత్సవ ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, స్వామి వారి కళ్యాణ వేదిక ఏర్పాట్ల గురించి వివరంగా చర్చించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్రమబద్ధమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచనలు ఇచ్చారు.

# మానవ చరిత్ర మలుపుల గుట్టు విప్పిన మహోన్నతుడు' కారల్ మార్క్స్

-నేడు ఆయన వర్ధంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )మానవ జాతి చరిత్ర అంతా అతీత శక్తుల, పుణ్యపురుషుల సృష్టింగా గోషిస్తుంటే మానవుడే చరిత్ర నిర్మాత అన్న మహోన్నత వ్యక్తి కారల్ మార్క్స్ . ప్రకృతిలోని సకల జీవకోటికి భిన్నంగా మానవుడు పరికరాలు ఉత్పత్తి చేసి ప్రకృతిని తనకు బానిసగా చేసుకొని మానవ చరిత్రను తానే నిర్మించాడని మార్క్స్ ఉద్బోధించాడు .చారిత్రక భౌతిక వాదంతో గత చరిత్రనే కాదు భవిష్యత్ ఎలా నడుస్తుందో వివరించి చెప్పిన మహోన్నతుడు. అద్భుతమైన అధ్యయనంతో అనితర సాధ్యమైన కృషితో మానవజాతిని ప్రభావితం చేశాడు.

మరణించి 134 ఏళ్ళు లైనా ప్రపంచాని ప్రభావితం చేస్తూనే వున్నాడు. ఆయన చూపిన మార్గంలో కోటాను కోట్ల మంది పయనిస్తూనే వున్నారు.


మార్క్స్ జీవించి నాటిక ప్రపంచ పరిస్థితి

అప్పటికి వెనుకబడివున్న ఐరోపాఖండంలో "ఫూడలిజం"కు వ్యతిరేకంగా సాగిన పోరాటాలు కొత్తసమాజ నిర్మాణానికి బాటలువేశాయి. ఈ పోరాటాలు14వ శతాబ్దం నుండి సాంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలే వేశాయి. 1455లో గూటెన్‌బర్గ్ అచ్చుయంత్రం తయారీ తో ప్రారంభించిన నూతన సాంకేతిక పరిజ్ఞానం 1765 ఆవిరి యంత్రం రంగంలోకి రావటంతో నూతనదశకు చేరింది. పెట్టుబడిదారీ వర్గంతోపాటు ఆవిర్భావించిన కార్మికవర్గం అర్ధబానిస జీవితానికి విముక్తి లభిస్తుందని అనుకున్న వేతన బానిస గా మార్చింది. "లాభం" లతో కొత్త దోపిడీకి తెరలేచింది.

ఈ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గం ఉదృతమైన పోరాటాలను ప్రారంభించింది. పనిగంటల తగ్గింపు, జీవించటానికి సరిపడే వేతనం, మెరుగైన పనిపరిస్థితులు, ప్రజాస్వామిక హక్కులకోసం కార్మిక సంఘాలు పెట్టుబడిదారీ,భూస్వామ్య ప్రభుత్వాలపై తిరుగుబాటు చేశాయి.

1818 మే 5న ఐరోపా ఖండం జర్మనీలోని "ట్రయర్" నగరంలో కారల్ మార్క్స్ జన్మించాడు. తొమ్మిది మంది తోబుట్టువులలో మూడవవాడు "మార్క్స్". "ట్రయర్" నగరం ఫ్రెంచి విప్లవ ప్రభావం కలిగి నగరం. స్వేఛ్చా, స్వాతంత్ర్యాల గురించి చర్చ సాగుతుండేది. ఆ ప్రభావం మార్క్స్ కుటుంబంపై వుంది.

17 ఏళ్ళ వయసుకు స్కూలు చదువు ముగించిన మార్క్స్ గురించి ప్రోగ్రెస్ రిపోర్టులో ఇలా వుంది. "అతడు చాలా తెలివిగల విద్యార్థి. ప్రాచీన సాహిత్యంలోనూ, జర్మన్‌భాషలోనూ, చరిత్ర పాఠాల్లోనూ అత్యంత ప్రతిభ కనబరిచాడు. గణితంలో అమోఘమైన ప్రజ్ఞచూపాడు. ఫ్రెంచి భాష విషయంలో అంత పరిశ్రమ చేయనట్లుంది." ఈ విధంగా స్కూలు చదువులోనే మార్క్స్ ప్రతిభా వంతుడుగా వున్నాడు.



వృత్తి ఎంపికలో యువకుని భావాలు అనే తొలి వ్యాసంలోనే మార్క్స్ "అత్యధిక ప్రజలకు అమిత సంతోషం కలిగించే వాడే నిజమైన అదృష్టవంతుడు" అన్నాడు. ఆవిధంగానే తన జీవిత సర్వస్వాన్ని ప్రజల శాస్విత సంతోషానికి అంకితం చేసినవాడయ్యాడు. 1835 బెర్లిన్ విశ్వవిద్యాలయం నుండి "లా" పట్టాపొంది, 1839లో "డెమొక్రటిస్ ఎపిక్యురస్ తత్వాల మధ్య వ్యత్యాసం"అనే థీసిస్‌కు డాక్టరేట్ పొందాడు. ఆనాటి విప్లవభావాలను వంటబట్టించుకొన జర్మన్ తత్వవేత్త "హెగెల్" శిస్యుడుగా మారాడు. రాబర్ట్‌ఓవెన్, సెయింట్ సైమన్ రచనల అధ్యయనంతో సోషలిస్టుభావాలతో ముందడుగు వేశాడు. కొత్తభావాలతో పదునెక్కిన ఆయన ఒక ప్రగతిశీల పత్రికకు సంపాదకుడుగా మారి అనేక వ్యాసాలు ప్రచురించాడు. 1842లో ఎంగెల్సుతో పరిచయమై జీవిత పర్యంతం శ్రామికవర్గానికి నిజమైన మిత్రులుగా నిలబడ్డారు.

1843లో తను ప్రేమించిన ''జెన్నీవేస్ట్‌ఫాలెన్'' వివాహమాడాడు. నూతన పత్రికను ప్రారంభించటం కోసం ఫ్రాన్స్ రాజధాని పారిస్ చేరాడు. ఫ్రాన్స్ విప్లవం కార్మివర్గానికి ద్రోహం చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ "వ్యక్తిగత ఆస్తిపై ఆధారపడిన వ్యవస్థ కార్మికుల శ్రమను దోచుకునే అవకాశం పెట్టుబడిదారులకిచ్చింది" అని విశ్లేషించాడు. 1846లో "జర్మన్ భావజాలం" అనే గ్రంధం ద్వారా నూతనసిద్ధాంతమైన "చారిత్రక భౌతికవాద" సిద్ధంతం ప్రతిపాదించాడు.'' తత్వవేత్తలు ప్రపంచాన్ని పరిపరివిధాల వ్యాఖ్యానించారు. అసలు విషయం దాన్ని మార్చటం" అని ప్రతిపాదించాడు . కార్మికవర్గ సిద్దాంతానికి శ్రీకారం చుట్టి పెట్టుబడిదారీ సిద్ధాంత సమర్దకులతో పోరాటానికి కార్మికుల కు ఆయుదం ఇచ్చాడు.

ప్రవాసుల లీగుతో ప్రారంభించి అంతర్జాతీయ కమ్యూనిస్టు సంఘం వరకు అనేక కార్మికవర్గ సంస్థలను నిర్మించంలో మార్క్స్ ప్రధానపాత్ర నిర్వహించాడు. ఆకాలంల్లో జరిగినపోరాటాలన్నింటికీ మార్క్స్ మార్గదర్శి. సిద్ధాంతకర్త. ఎదురైన అనేక ప్రశ్నలకు సమాధానాలిచ్చాడు. చారిత్రక భౌతికవాదం, వర్గపోరాటం, సోషలిస్టు విప్లవాల గురించి వివరణ ఇస్తూ "ప్రపంచ కార్మికులారా ఏకంకండి,పోయేదేమిలేదు బానిస సంకెళ్ళుతప్ప" అనే పిలుపుతో " కమ్యూనిస్టు ప్రణాళికను" ప్రపంచ కి ఇచ్చారు. అది ప్రపంచ కార్మికవర్గ నికి వెలుగుబాట చూపింది. యూరప్‌లో ని అన్ని విప్లవాల్ల అనుభవంనుండి మార్క్స్, "కార్మికవర్గానికి బలమైన కమ్యూనిస్టుపార్టీ నిర్మాణం" అవసరం అని పిలుపునిచ్చారు.

మార్క్స్ జీవితం కష్టాలతో సహవాసం'క్లిష్టమైన నిరంతరం అధ్యయనం .

జర్మనీలో పుట్టి యూరప్‌లోని అనేక దేశాల నుండి బహిష్కరణకు గురై 1849 నుండి లండన్‌లో ప్రవాసిగా జీవితం గడుపుతూ చివరివరకు అక్కడే మరణించారు. దుర్భర దారిద్రంలో వుంటూకూడా కడవరకు కార్మికవర్గంతోనేలిచాడు. ప్రపంచంలో అతిపెద్ద గ్రంధాలయమైన లండన్ లోని బ్రిటీష్ మ్యూజియంలో 25 ఏళ్ళ వెచ్చించి పెట్టుబడిదారీ విధానాన్నం గుట్టు విపే "పెట్టుబడి" గ్రంధాం కార్మికవర్గం చేతిలో నూతన ఆయుధాన్ని వుంచాడు.

న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్‌కు వ్యాసాలు వ్రాస్తూ భారతదేశాన్ని గురించికూడా పరిశీలన చేశాడు. 1853లో 3 వ్యాసాలు, 1857 సిపాయిల తిరుబాటు అనంతరం ఎంగిల్స్‌తో కలసి 16 నెలల కాలంలో 28 వ్యాసాలు వ్రాశాడు. వలస దోపిడీ తీవ్రంగా ఖండిరచడమేకాక వలసాధిపత్యానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను బలపర్చాడు.

1883 మార్చి 14న కన్నుమూసినాయన సమాధివద ఎంగెల్స్ చేసిన ప్రసంగం "మార్క్స్ అందరికంటె ఎక్కువగా ద్వేషించబడిన, నిందించబడిన వ్యక్తి. ప్రభుత్వాలు నియంతృత్వం, ప్రజాస్వామికం ఏపేర్లతో వున్నా తమ భూభాగాలనుండి ఆయన్ని బహిష్కరించాయి. బూర్జువాలు, మితవాదులు, అతివాదులు, ఆయనమీద నిందలు గుప్పించడానికి పోటీపడ్డారు. అయినా ఆయన సైబీరియా నుండి కాలిఫోర్నియా దాకా యూరప్, అమెరికా ఖండాల్లోని సకలభాగాలలోని లక్షోపలక్షల విప్లవకార్మికులచేత ప్రేమించబడి, పూజింపబడి, వాళ్ళకు దుఖం కలిగిస్తూ మరణించాడు. ఆయనకు చాలా మంది వ్యతిరేకులున్నపటికీ వ్యక్తిగత శత్రువు ఒక్కరుకూడా లేడని చెప్పడానికి నేను సాహసిస్తున్నాను. ఆయన పేరు చిరస్థాయిగా నిలుస్తుంది. ఆయన కృషికూడా సఫలమౌతుంది.

ఈ దుర్మార్గపు దోపిడీ వ్యవస్థ సమర్దకులు మార్క్సిజం మరణించిందని వాదిస్తున్నానా ప్రపంచంలోని కార్మికులు, పీడిత వర్గాలు, తమ విముక్తికోసం మార్క్సిజం గురించి చర్చిస్తున్నారు. ప్రపంచం అంతా పోరాడే కార్మికుల నుండి పోప్ వరకూ ప్రస్తుతం సంక్షోభానికి కపరిష్కారంగా మార్క్స్‌ను అధ్యయనం చేస్తున్నారు. ఏప్పటికీ మార్క్సిజమే సమాజాన్ని ముందునడిపించగలమార్గం. మారుస్తున్న అధ్యయనం చేయడం మార్చు అనుసరించడం నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు ఉత్తమ పరిష్కారం .

=====================


# నిజాం నిరంకుశపాలనకు, పెత్తందారి వ్యవస్థకు, వెట్టిచాకిరిలకు వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసిన గొప్ప విప్లవవీరుడు అనభేరి ప్రభాకర్ రావు

-నేడు ఆయన వర్ధంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

నిజాం నిరంకుశపాలనకు, పెత్తందారి వ్యవస్థకు, వెట్టిచాకిరిలకు వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసిన గొప్ప విప్లవవీరుడు మన అనభేరి ప్రభాకర్ రావు,

కొందరి చావు చరిత్రకు ప్రాణం పోస్తది... త్యాగానికి చిరునామగా నిలుస్తది. స్ఫూర్తిగా నిలిచి గుండె గుండెను తట్టిలేపి ఉద్యమాలకు ఊపిరిపోస్తది. ఎదురు తిరగడం.. తుపాకీ గొట్టానికి ఎదురేగడం.. రొమ్ములు నిక్కబొడిచి దమ్ముంటే కాల్చరా..? అని గర్జించడం వీరులకు మాత్రమే సాధ్యమైతది. అనుభవించాడనికి అన్ని ఉన్న విద్య నేర్పిన విజా&జనంతో పేదలకోసం ... సాయుధ పోరాటం చేసి తొలి అమరుడైన అనభేరి ప్రభాకర్ రావు 76వ వర్ధంతి నేడు.




15 ఆగస్టు 1910 లో కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోలేపల్లి గ్రామంలో ఓ తిరుగుబాటు జెండా పుట్టింది. అణచివేయబడుతున్న జనం కోసం ఓ ఉద్యమ కెరటం ఉదయించింది. ఆ జెండే అనభేరి ప్రభాకర్ రావు. ప్రభాకర్ రావు ఇంటిపేరు అనభేరి.. చేసింది రణభేరి. వెంకటేశ్వర్ రావు దేశ్ ముఖ్ , రాధాబాయిల గారాల బిడ్డ అనభేరీ ప్రభాకర్ రావు. ఈయన భార్య పేరు సరళాదేవి. వీరికి నాలుగురు సంతానం. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన అనభేరి.. మచిలీపట్నం హిందూ హైస్కూల్ లో ప్రాథమిక విద్యను , హైదరాబాద్ చాదర్ ఘాట్‌లో హైస్కూల్ విద్యను , నిజాం కాలేజిలో ఇంటర్ పూర్తి చేసి బనారస్ లోని కాశీ విద్యపీఠ్ లో ఉన్నత విద్యనభ్యసించారు. పై చదువులకు బనారస్ వెళ్లొచ్చిన అనభేరి సక్కగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం బాటపట్టిండు.

దొరల పేరు చెబితే ఆ రోజుల్లో ఊళ్లన్ని వణికిపోయేవి. కానీ అనభేరీ ప్రభాకర్ రావు దొర పేరు చెబితే మాత్రం చేతులెత్తి దండంపెట్టేవారు. ఇప్పటికి అనభేరి అంటే అదే ప్రేమ అదే గౌరవం. దొర అని పిలుచుకునే అనభేరి ప్రభాకర్ రావు ప్రజల మనిషి అయ్యిండు. నైజాం అరాచాకాలను ఎదురించే మొనగాడైండు. వెట్టిచాకీరి , బానిసత్వాలను తన ఇంట్లో నుంచే సంస్కరించిన ప్రభాకర్ రావు .. రైతులకు సుంఖం నుంచి విముక్తి కలిగించిండు.

గుండెల పుట్టిన మంట గూట్లే ఉండనియ్యదంటరు. కదుపుల సల్ల కదలకుండ సుఖపడే ఇంట్ల పుట్టినా.. గుండెలో చదువు రగిలించిన స్వేచ్ఛ నినాదం అనభేరిని కుదురుగా ఉండనియ్యలేదు. సదువు పూర్తి చేసుకొని ఇంటికివచ్చిన అనభేరి కుటుంభాన్ని విడిచి నేరుగా తెలంగాణ సాయుధ రైతంగా పోరాటం బాటపట్టిండు. అజా&జతంలోకి వెళ్లిన అనభేరి ఊరూరా దొరల గడీలపై దాడులు చేసి దస్తావేజులను దగ్ధం చేసిండు. విప్లవ కెరటమై నైజాం సర్కారును గజ్జుమనిపించాడు. అయితే 1948 మార్చి 14న ద్రోహులు అనభేరి కదిలికల గురించి నిజాం సైన్యానికి సమాచారం అందించడంతో.. రజాకార్లు , నిజాం సైన్యం భోజనం చేస్తున్న అనభేరి టీంపై కాల్పులకు దిగింది. కాల్పులను ప్రతిఘటిస్తూ హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గుట్టల్లోకి వెళ్లింది. కానీ దురదృష్టం వెంటాడింది... అనభేరి ప్రభాకర్ రావు ఈ కాల్పుల్లో వీరమరణం పొందిండు. ప్రభాకర్ రావుతో పాటు మరో 12 మంది ఉద్యమకారులు చనిపోయారు.

అనభేరి ప్రభాకర్ రావు మరణం రజాకార్లు.. నిజాం సైన్యానికి కొండంత సంతోషాన్నిచ్చింది. అనభేరి మరణం తరువాత ఆయన కోటును మరణసూచకంగా ఓ చెట్టుకు వేలాడదీసిన నిజాం సైన్యం షేర్ మరగయారే.. అంటూ నినాదాలు చేశారు. ఉద్యమకారులను ఊళ్లోకి తీసుకొచ్చి సమూహిక దహనం చేశారు. అనభేరి రణం ఆగిపోవడంతో పేదలు ఉద్యమకారులు కన్నీరు మన్నీరైండ్రు. అనేక మంది ఉద్యమకారులు యేండ్లకొద్ది అనభేరి ప్రభాకర్ రావు స్ఫూర్తిగా ఉద్యమం కొనసాగించారంటే అనభేరి ఉద్యమం ప్రజల్లో ఎంత ప్రభావం చూపిందో అర్థం చేసుకోవచ్చు. అందుకే ఉద్యమకారులంతా అనభేరి గుర్తుగా గ్రామంలోని గుట్టవద్ద అనభేరి సమాధిని నిర్మించారు. ఇక్కడే ప్రతియేడు అనభేరి జయంతి , వర్ధంతులను నిర్వహిస్తున్నారు.

# రాములమ్మ ఎంట్రీతో ఇబ్బంది తప్పదా...

మెదక్, మార్చి 13,

తెలంగాణ కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీల ఎంపిక కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా పరిస్థితి మారిందట. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల ఎంపికలో అధిష్టానం ఒకటి తలిస్తే..జరుగుతున్నది మాత్రం మరొకటి అన్నట్లుగా ఉందట. ఉమ్మడి మెదక్ జిల్లాలో కాస్త బలహీనంగా కాంగ్రెస్ పార్టీని స్ట్రెంథెన్ చేసేందుకు విజయశాంతికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిందట కాంగ్రెస్ పార్టీ.గత అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ జిల్లాలో బీఆర్ఎస్‌కు ఏడు స్థానాలు వచ్చాయి. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పర్ఫామెన్స్ చాలా వీక్‌గా అనిపించిందట. దీంతో అక్కడ పార్టీని బలోపేతం చేయడం కోసమే..గతంలో మెదక్ ఎంపీగా పనిచేసిన



విజయశాంతిని శాసనమండలికి సెలెక్ట్ చేశారట కాంగ్రెస్ పెద్దలు.ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీ బలోపేతం కోసం విజయశాంతిని ఎమ్మెల్సీగా సెలెక్ట్ చేస్తే..అక్కడ పార్టీ పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డ చందంగా మారిందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే మెదక్ జిల్లాలోని పటాన్‌చెరు నియోజకవర్గంలో గ్రూపు తగాదాలు పీక్ లెవల్‌కు చేరాయి. ఇక ఇప్పుడు విజయశాంతి ఎంట్రీతో కొత్త గ్రూపు ఫామ్ అయ్యిందనే చర్చ జరుగుతోంది.విజయశాంతి పేరు ప్రకటన వెలువడగానే మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితా చూసి షాక్ కు గురయ్యానని కామెంట్స్ చేశారు. అయితే విజయశాంతి అంటే ఉమ్మడి మెదక్ జిల్లాలోని సీనియర్లకు ఏమాత్రం గిట్టదట. మంత్రి దామోదర రాజనర్సింహాకు విజయశాంతికి మధ్య ఏమాత్రం పొసగదట. ఇక జగ్గారెడ్డి, విజయశాంతి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటుందనే టాక్ ఉంది.ఎమ్మెల్సీగా విజయశాంతి ఎంపికే చర్చకు దారితీస్తుంటే..మరో ప్రచారం ఆసక్తి రేపుతోంది. త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో విజయశాంతికి ఛాన్స్ ఉంటుందనే టాక్ నడుస్తోంది. ఇదే గనుక జరిగితే పరిస్థితి మరింత క్లిష్టంగా మారేలా ఉందట. ఉమ్మడి మెదక్ జిల్లాలో సీనియర్ నేత దామోదర రాజనర్సింహకు.. విజయశాంతికి మధ్య గ్యాప్ ఉందట.ఇక విజయశాంతికి మంత్రిగా అవకాశం ఇస్తే.. దామోదర రాజనర్సింహ హవా తగ్గే అవకాశం ఉంటుందని భావిస్తున్నారట. విజయశాంతి కేంద్రంగా కొత్త గ్రూప్ ఏర్పడి మరింత రచ్చ జరిగే అవకాశం లేకపోలేదనే చర్చ జరుగుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లా విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఒకటి తలిచి రాములమ్మకు అవకాశం ఇస్తే.. భవిష్యత్‌లో జరిగేది మాత్రం అందుకు భిన్నంగా ఉండబోతుందట.మాజీ సీఎం కేసీఆర్ సొంత జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయోగం.. బూమరాంగ్ అవుతోందన్న టాక్ వినిపిస్తోంది. రాములమ్మ రాకతో మెదక్ జిల్లా కాంగ్రెస్‌లో ఎలాంటి మార్పులు రాబోతున్నాయో చూడాలి మరి.

# రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగాన్ని విస్మరిస్తే ఊరుకోం:ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్



కరీంనగర్, మార్చి 13(భారత శక్తి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బడ్జెట్ సమావేశంలో విద్యారంగాన్ని విస్మరిస్తే ఊరుకునేది లేదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ హెచ్చరించారు. గురువారం కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంకమ్మ తోటలోని జిల్లా కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల సందర్భంలో గవర్నర్ ప్రసంగంలో విద్యారంగంపై మాట్లాడిన పరిస్థితి లేదు, ఇది చాలా బాధాకరమని అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం లో ఇప్పటివరకు కూడా విద్యారంగానికి మంత్రి ని కేటాయించిన దాఖలాలే లేవు. కనీసం మంత్రి లేకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగం సమస్యలతో కూడుకు పోతున్నా గాని ఏ ఒక్కరు పట్టించుకున్న పరిస్థితి ఈ రాష్ట్రంలో లేదని తెలియజేశారు. సంక్షేమ హాస్టల్లో అరకోర వసతులతో ఇబ్బందులు పడుతున్నా కానీ రాష్ట్ర మంత్రులు స్పందించిందే లేదు. అదేవిధంగా కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేయడం జరుగుతుంది, దానితోపాటు జిల్లా వ్యాప్తంగా 16 మండలాలు ఉంటే ఏ మండలం కూడా రెగ్యులర్ ఎంఈఓ లేని పరిస్థితి ఈ జిల్లాలో ఉంది కావున తక్షణమే జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యారంగా సమస్యలు పరిష్కరించి ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విద్యారంగ సమస్యలు పరిష్కారం కావాలంటే రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30% నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలి కావున ఈ బడ్జెట్ సమావేశంలో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. లేనియెడల జిల్లావ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేలు కరీంనగర్ కు రాకుండా ముట్టడిస్తామని తెలియజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు అసంపెల్లి వినయ్, సహాయ కార్యదర్శి ఇసాక్, జిల్లా కమిటీ సభ్యులు రాకేష్, మంద రాకేష్ , శ్రీధర్ తదితలు పాల్గొన్నారు.

# ఎస్.ఎస్.సి పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు:జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి





వైయస్సార్ జిల్లా, మార్చి 13(భారత శక్తి ) : ఈనెల 17వ తేదీ నుండి మార్చి 31 తేదీ వరకు జరుగనున్న పదవ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్టు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. అమరావతి నుండి పదవ తరగతి పరీక్షల సన్నద్ధత, కలెక్టర్ కానవరెన్స్ ,స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ కావేటి విజయానంద్ జిల్లా కలెక్టర్లు, జిల్లా పోలీస్ అధికారులు, విద్యా శాఖాధికారులు, సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు.ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి.. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు.. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విసి ద్వారా..రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ కావేటి విజయానంద్ మాట్లాడుతూ... పదవ పరీక్షలకు సంబంధించి సుమారు రాష్ట్ర వ్యాప్తంగా 619275 మంది విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. మొత్తం 3450 పరీక్ష కేంద్రాలలో నిర్వహించే ఈ పరీక్షా కేంద్రాలలోనికి ఉన్నతాధికారులతో సహా ఏ ఉద్యోగి కూడా సెల్ ఫోన్ లను తీసుకెళ్లడం నిషేదించినట్టు స్పష్టం చేశారు. పరీక్షా ప్రశ్నా పత్రాలను స్ట్రాంగ్ రూమ్ లకు తీసుకెళ్లేటప్పుడు పటిష్టమైన బందోబస్తు ఉండాలని తెలిపారు. పరీక్షా పేపర్ల తరలింపుపై జిల్లా స్థాయిలో సంబంధిత పోలీస్ సూపరింటెండెంట్ లు, పోస్టల్ డిపార్ట్మెంట్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు.పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్.టి.సి బస్సులు తగు విధంగా అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.పదవ పరీక్షల కోసం రాష్ట్ర స్థాయిలో 0866297454 నెం తో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర దివస్ ఏర్పాట్లపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు.పీ 4 సర్వే ప్రోగ్రెస్ పై కలెక్టర్లకు అడిగి తెలుకున్నారు.సిఎస్ విసి ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... పదవ పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు,ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అలాగే అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిధిలో ఇంటర్నెట్, జెరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులు, ఇన్విజిలేటర్లు,ఇతర ఉన్నతాధికారులతో సహా ఏ ఇతర సిబ్బంది ఎలక్ట్రానిక్ పరికరాలు,మొబైల్ ఫోన్లు తీసుకువెళ్లరాదన్నారు. పోలీసులు ముందుగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎక్కడా మాస్ కాపీయింగ్కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరాలన్నారు. పరీక్ష కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్లు ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలపై ప్రజాఅభిప్రాయాలను చేపట్టాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ లు ఇతర జిల్లా అధికారులతో కలిసి (ప్రభుత్వ దాతల ప్రజల భాగస్వామ్యం) పి4 పోస్టల్ విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఓ అజరతయ్య, జిల్లా పంచాయతీరాజ్ అధికారిని రాజ్యలక్ష్మి, డీఈవో శంషుద్దీన్,జడ్పీ సీఈఓ ఓబులమ్మా, డి.ఆర్.డి.ఎ పిడి ఆనంద్ నాయక్,మెప్మా పిడి కిరణ్ కుమార్ అధికారులు పోలీసు, ట్రాన్స్పోర్ట్ అధికారులు,తదితర అధికారులు, పాల్గొన్నారు.

# నిధులు లేక.. అభివృద్ధి కానరాకా..

రంగారెడ్డి, మార్చి 13

%జిల్లాలో 16 మున్సిపాలిటీలు, 2 మున్సిపల్ కార్పొరేషన్లున్నాయి. వీటికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు ఏమాత్రం రావడంలేదు. కార్పొరేషన్లకు కేవలం ఇంటిపన్ను, భవన నిర్మాణ అనుమతుల వంటి వాటి వల్ల వచ్చే ఆధాయంతో జీతాలు, ఇతరత్రా వాటికి ఖర్చు చేస్తున్నారు. కాని, ఏ ఒక్క అభివృద్ధి పని కూడా జరుగటంలేదు. ముఖ్యంగా నగర శివారుల్లోని



మున్సిపాలిటీల్లో కొత్తకొత్త కాలనీలు ఏర్పడుతున్నాయి. కొత్త కాలనీల్లో రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు వంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే, తాగునీటి సమస్య కూడా రోజురోజుకూ పెరిగిపోతున్నది. ఔటర్ లోపలి మున్సిపాలిటీలకు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో తాగునీరు అందిస్తున్నారు. ఈ మున్సిపాలిటీలకు రెండు రోజులకోసారి తాగునీరు వస్తున్నదని ప్రజలు వాపోతున్నారు. ఔటర్ వెలుపలి మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ఎండలు మండిపోతున్న నేపథ్యంలో మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీరు ఏమాత్రమూ సరిపోవడంలేదని, పెరుగుతున్న డిమాండ్కు అనుగుణంగా తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

519 గ్రామపంచాయతీలు..

జిల్లాలో 519గ్రామపంచాయతీలున్నాయి. ఈ గ్రామపంచాయతీల్లో రోజురోజుకూ సమస్యలు తిష్టవేస్తున్నాయి. గ్రామపంచాయతీ సర్పంచ్ల పదవీ కాలం ముగిసి ఏడాది దాటుతున్నది. ఎన్నికలు జరుపకపోవడం వలన ఎస్సీ, ఎస్టీ సబ్ప్లాన్ నిధులు కూడా రావడంలేదు. టాక్సలు కూడా అంతంతమాత్రంగానే వసూలవుతుండటంతో పంచాయతీల నిర్వహణ మరింత భారంగా మారింది. పంచాయతీ కార్యదర్శులు పంచాయతీల పాలనను భుజాలపై వేసుకుని మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జీతాలు, వీధి దీపాలు, పైపులైన్ల మరమ్మతు వంటి వాటికి కార్యదర్శులు సొంతంగా ఖర్చుపెడుతున్నారు. కాని, వాటికి బిల్లులు మాత్రం సకాలంలో ఇవ్వడంలేదు. అలాగే, గ్రామాల్లో నిధుల లేమితో అభివృద్ధి పూర్తిగా పడకేసింది.

పత్తాలేని ప్రత్యేకాధికారులు

గ్రామపంచాయతీ, మున్సిపాలిటీల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. కాని, ప్రత్యేకాధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజల అవసరాలను తెలుసుకుని ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉన్నది. కనీసం వారానికోరోజైనా ప్రత్యేకాధికారులు గ్రామాలకు వెళ్లాల్సి ఉన్నది. కాని, వారు గ్రామాలవైపు కన్నెత్తి కూడా చూడటంలేదని ఆరోపణలున్నాయి. అలాగే, మున్సిపాలిటీల్లో కూడా మూడు నుంచి నాలుగు మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారిని నియమించారు. ప్రత్యేకాధికారులు మున్సిపాలిటీలకు వెళ్లకపోవడం వలన మున్సిపాలిటీల్లో అధికారులే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ప్రభుత్వం స్పందించి మున్సిపాలిటీలు, పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

# సరళమైన తెలుగులో రామాయణం రచించిన గొప్ప కవియత్రి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

## ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుక





వైయస్సార్ జిల్లా,మార్చి 13(భారత శక్తి ) : సరళమైన తెలుగు భాషలో రామాయణం రచించి సమాజానికి అందించిన గొప్ప కవియత్రి మొల్లమాంబ అని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన శ్రీ మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాహితీవేత్త నరాల రామారెడ్డి, మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు డా. విద్వాన్ గానుగపెంట హనుమంత రావు హాజరుకాగా జిల్లా పోలీస్ అధికారి అశోక్ కుమార్, డిఆర్ ఓ విశ్వేశ్వరనాయుడు ,ఇరత జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... రామాయణ మహా గ్రంథాన్ని పలువురు వివిధ భాషలలో రచించారని.. అయితే వాల్మీకీ లాంటి మహనీయులు రచించిన రామాయణ గ్రంథాలను ఆధారం చేసుకుని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే తెలుగు బాషలో మొల్ల రామాయణాన్ని సరళంగా రాయడం గర్వించదగ్గ విషయమన్నారు. వైయస్సార్ జిల్లా బద్వేలు వద్ద గల గోపవరం గ్రామానికి చెందిన మొల్ల రామాయణాన్ని అతి తక్కువ పద్య గద్యాలతో అత్యంత సులువమైన శైలిలో తనదైన ముద్రతో రచించి నాటి పండిత పామరుల ప్రశంసలు పొందారన్నారు. మానవీయ విలువలకు ప్రాధాన్యతనిస్తూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు వివక్షతకు వ్యతిరేకంగా తన రచనలు చేశారని కొనియాడారు.తొలి తెలుగు రచయిత్రిగా చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని మొల్ల పదులపరుచుకున్నారని అన్నారు.మొల్ల జయంతి ఉత్సవాల్లో భాగంగా ముందుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ముఖ్య అతిథులతో కలిసి మొల్లమాంబ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు,బీసీ వెల్ఫేర్ అధికారి భరత్ కుమార్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ,సిపిఓ హాజరతయ్య, మొల్ల సాహితీ పీఠం సభ్యులు, బీసీ నేతలు తదితరులు పాల్గొన్నారు.


# పీ4 సర్వేతో ప్రతి ఇంటికి అభివృద్ధి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



వైయస్సార్ జిల్లా,మార్చి 13(భారత శక్తి ) : ప్రభుత్వ, దాతల, ప్రజల, భాగస్వామ్యం (పీ4) సర్వేతో ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతిజీవితానికి ప్రగతి చేకూరుతుందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో స్వర్ణాంధ్ర ఏ2047 లో భాగంగా పీ4 సర్వే, ప్రజా అభిప్రాయాలపై జిల్లా పోలీస్ అధికారి అశోక్ కుమార్ తో కలసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఏ2047 లో భాగంగా పబ్లిక్, ప్రజలు, దాతలు పార్టనర్షిప్ తో అట్టడుగునున్న 20 శాతం పేదలను, అత్యున్నతంగా వున్న 10 శాతం సంపన్నులు ద్వారా అభివృద్ధి చేయడం పి4 ముఖ్య ఉద్దేశ్యమన్నారు.వచ్చే ఐదేండ్లలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం "జీరో పావర్టీ -%ూ%4 పాలసీ" అమలుకు కృషి చేస్తోందన్నారు. వెనుకబడిన కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు ఈ పాలసీ ఉపయోగపడుతుందన్నారు.ప్రతి ఒక్కరూ సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలని ఏదో విధంగా సహాయపడి పేదలను అభివృద్ధి వైపు నడిపించాలని కోరారు.నేడు భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంలో మన దేశం ఒకటని అందుకు మనమందరం గర్వపడాలన్నారు అలాగే ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారతదేశం ఎదిగిందన్నారు. ఆర్థిక ప్రగతి సామాజిక ప్రగతి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని సదుద్దేశంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి4 సర్వే చేపట్టారని తెలిపారు. విద్య,ఆరోగ్య, ఆర్థిక అన్ని రంగాల్లో ప్రభుత్వం వృద్ధి సాధించి పేదరికాన్ని నిర్మూలించాలని కృత నిశ్చయంతో వుందన్నారు.క్యూఆర్ కోడ్ ద్వారా స్మార్ట్ మొబైల్ లో ప్రజలు %జూ%4 సర్వేలోని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి మీ విలువైన అమూల్యమైన సలహాలు, సూచనలు, ఆలోచనలను తెలపాలని కోరారు. వాటన్నిటిని క్రోడీకరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పి4 పాలసీని రూపొందిస్తుందని తెలిపారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ సమాజంలోని వివిధ వర్గాలు, మేధావులు, నిపుణులు,ప్రజలు తమ సహకారాలు అందించి పి4 మోడల్ ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పేదరిక స్థాయిని తగ్గిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి పీ 4. సర్వే దోహదపడుతుందన్నారు. గ్రామాల్లో అసమానతలు తగ్గించి వనరులను సద్వినియోగం చేసుకొని పేదరికాన్ని నిర్మూలించాలన్నారు. సమాజంలోని ప్రజలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో మెలిగితే ఆ దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అందులో భాగంగా ప్రభుత్వం పీ 4 సర్వే ని చేపట్టి ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం పి4 పాలసీని రూపొందిస్తోందని తెలిపారు. సమాజంలోని ఉన్నత స్థాయి వ్యక్తులు ఎంతో కొంత శక్తి సామర్థ్యాలను అవసరమున్న మేరకు ఇతరులకు అనుసంధానం చేసి పీ 4 విధానాన్ని సఫలీకృతం చేయాలన్నారు. విద్య ఆరోగ్య ఆర్థిక జీవనోపాధిలో వృద్ధి సాధించి పేదరికం నిర్మూలించాలని పేర్కొన్నారు.సమావేశ అనంతరం పారిశ్రామిక వేత్తలు, బ్యాంక్ అధికారులు, ఇతరులు పీ 4 విధానంపై సూచనలు, సలహాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, జమ్మలమడుగు ఆర్డీఓ సాయి శ్రీ, సిపిఓ అజరతయ్య, జడ్పీ సీఈవో ఓబులమ్మ, డి ఆర్ డి ఎ పిడి ఆనంద్ నాయక్, డీపీఓ రాజ్యలక్ష్మి, ఇతర జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, కమీషనర్లు,బ్యాంక్ అధికారులు,పారిశ్రామిక వేత్తలు,తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు.

## క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి ఖచ్చితమైన నివేదికలు పంపండి:జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




కడప- మార్చి, 13(భారత శక్తి ):జిల్లాలో వేల కోట్ల రూపాయల తో అభివృద్ధి పనులు జరుగుతున్నవని అందుకు సంబంధించి పనుల అనుమతులను జాప్యం చేయక సంబంధిత అధికారులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.గురువారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాల్ లో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, రెవెన్యూ సదస్సులు, గ్రామ సభలు, పౌర సరఫరాల పంపిణీ తదితరులపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలసి సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జిల్లాలో వేల కోట్ల రూపాయల తో అభివృద్ధి పనులు జరుగుతున్నవని వాటికి సంబంధించి అనుమతులు మంజూరు చేయడంలో అధికారులు ఎలాంటి జాప్యానికి తావివ్వక వెంటనే దరకాస్తును పరిశీలించి నియమనిబంధనలను పాటిస్తూ, జాగ్రత్తగా, పారదర్శకంగా మంజూరుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. సంబంధిత తహసీల్దార్ వద్దకు వచ్చిన దరకాస్తును 2 రోజుల్లో క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత ఆర్డీవో లకు పంపాలని, వారు 24 గంటల్లో పరిశీలించి నివేదిక తయారు చేసి ప్రతిపాదనలు పంపాలని అన్నారు. సకాలంలో అనుమతులు ఇవ్వక జాప్యం చేసి అక్రమ మైనింగ్ కు ఆస్కారం ఇవ్వవద్దన్నారు. అలాగే వచ్చిన దరకాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అవునా? లేదా కాదా? అన్న విషయాన్ని దరకాస్తుకు క్లుప్తంగా సమాధానం ఇవ్వాలని అన్నారు. గ్రామస్తులు, ప్రజలు, మరి ఎవరైనా పనులలో అభ్యంతరాలు చేస్తే వారితో మాట్లాడి లోటుపాట్లను, సమస్యలను పరిష్కరించాలని అన్నారు. రెవెన్యూ సదస్సులు, గ్రామ సభల్లో వచ్చిన దరకాస్తులకు వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. భూ సమస్యల పై వచ్చిన దరకాస్తులపై క్షేత్ర స్థాయి కి స్వయంగా వెళ్లి ముందుగా అది ప్రభుత్వ భూమి లేక ప్రైవేటు భూమియా గుర్తించి, ఎంత విస్తీర్ణంలో ఉందని తదితరుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఇతర సమస్యల పై వచ్చిన దరకాస్తులను కూడా అధికారులు దరకాస్తుదారుని వద్దకే వెళ్లి వారితో స్వయంగా మాట్లాడి వివరాలు తెలుసుకొని పారదర్శకంగా, దరకాస్తుదారుడు సంతృప్తి చెందేలా సామాధానపరచాలని అన్నారు. వారి నుండి మంచి స్పందనను పొంది తెలపాలన్నారు. అధికారులు తరచూ క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి ప్రజల వద్ద నుండి మంచి స్పందనతో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలన్నారు. జిల్లాలో పౌర సరఫరాల అంశంలో వంట గ్యాస్ పంపిణీ, నిత్యావసర వస్తువుల పంపిణీ, తుకాల వ్యత్యాసం, వస్తువుల లోడింగ్, అన్లోడింగ్, స్టాక్ వెరైఫికేషన్, తరచు తనిఖీలు తదితరులపై వివరాలు అడిగి తెలుసుకుని తగు సూచనలు, ఆదేశాలను జారీచేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, కడప,బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్డీవోలు జాన్ ఇర్వీన్, చంద్రమోహన్, చిన్నయ్య, సాయిశ్రీ, మైన్స్ శాఖ డిడి సూర్యచంద్రరావు, ఇరిగేషన్ ఎస్ ఈ వెంకట్రామయ్య, తహసీల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్.ఆర్.ఎస్. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి



కరీంనగర్, మార్చి 13(భారత శక్తి):అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణకు, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్ ఆర్ ఎస్ 25 శాతం రాయితీ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వారందరూ గడువులోగా సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, సబ్ రిజిస్ట్రర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, కార్యదర్శులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎల్. ఆర్. ఎస్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుందని అన్నారు. ఎఫ్.టి.ఎల్, నిషేధించిన సర్వే నెంబర్లు మినహా ఎల్. ఆర్. ఎస్ కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించామని తెలిపారు. రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి పరిశీలించవచ్చని అన్నారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులు ఎవరైనా ఈనెల 31వ తేదీ లోగా చెల్లిస్తే 25 శాతం మినహాయింపు ఉంటుందని తెలిపారు. రుసుము చెల్లించిన వారి దరఖాస్తు అధికారులు పరిశీలించి రెండు రోజుల్లోనే అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు. అనధికారికంగా లేఅవుట్లు చేసి అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని అన్నారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో కూడా ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతించడం ఉండదని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమబద్ధీకరణ చేసుకోవాలని, ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకొని 25% రాయితీ పొందాలని తెలిపారు. జిల్లాలో 68,405 ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులు రాగా 44,437 ఆమోదం పొందాయని తెలిపారు. కార్యదర్శులు, వార్డు స్థాయి అధికారులు ఎల్ ఆర్ ఎస్ రాయితీపట్ల ప్రజలకు విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. ప్రతి గ్రామపంచాయతీలలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. క్రమబద్ధీకరణకు రుసుము నిర్ణయించిన వారందరికీ సమాచారం చేరేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సుడా డిటిసిపిఓ ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్లు సబ్ రిజిస్టార్లు పాల్గొన్నారు.

## ఉత్సాహాన్ని నింపిన అల్ఫోర్స్ హోళి కేళి మత సామరస్యానికి ప్రతీక హోలీ : ఆల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి




కరీంనగర్, మార్చి 13(భారత శక్తి):హోళి రంగుల పండుగా పిలువడం జరుగుతుందని, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే పండగని తద్వారా సమాజంలో ఆనందం వాత్సల్యం వెల్లివిరిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ ప్రాంగణంలో నిర్వహించినటువంటి అల్ఫోర్స్ హోళి కేళీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు సుఖసంతోషాలతో వారి జీవనాన్ని కొనసాగించాలని, ఆర్థికంగా సుభిక్షంగా ఉండాలని తెలుపుతూ ప్రతిఒక్కరు జీవితాన్ని ఇతరులకు ఆదర్శప్రాయంగా కొనసాగించాలని కోరారు. నేడు చాలా మంది పలు కారణాల వలన మానవ బంధాలకు దూరమవుతున్నారని, ప్రేమా వాత్సల్యం తరిగిపోతుందని విచారం వ్యక్తం చేస్తూ ప్రతిఒక్కరు సోదర భావంతో మెదిలి ఇతరులకు మేలు చేయడమే లక్ష్యంగా ముందుకు కొనసాగాలని చెప్పారు. రంగుల రంగుల జీవితాలలో ఎల్లప్పుడు సుఖసంతోషాలతో వర్ధిలాలనే ఉద్దేశంతో హోళి పండుగగకు ముందు రోజు కామదహన కార్యక్రమాన్ని వీధులలోని ప్రధాన కూడళ్ళలో కామదహన కార్యక్రమాన్ని సామూహికంగా నిర్వహిస్తారని చెప్పారు. ప్రతిఒక్కరు పండుగల ప్రాశ్చస్యాన్ని విధిగా గుర్తుంచుకోవాలని వాటి విశిష్ఠతను ఇతరులకు తెలియజేయాలని చెప్పారు.సమాజంలో వివిధ రకాల వ్యక్తులు వివిధ రకాల గుణాలతో ఉంటారని, చెడు గుణాలను వదులుకునేటట్లుగా ప్రోత్సాహకాలను అందిచాలని చెప్పారు. ఈ పండుగను అత్యంత ఆనందోత్సవాల మధ్య ప్రపంచం వ్యాప్తంగా ఘనంగా విభిన్నంగా నిర్వహించుకుంటారని, సహజసిద్ధమైన రంగులతో హోళీని నిర్వహించుకోవాలని అభిప్రాయపడుతూ మత సామరస్యానికి విలువైన ప్రతీకగా ఉంటుందని చెపారు. హోళీ కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను అట్టహాసంగా ఆకాశమే హద్దుగా అన్నట్టు నిర్వహించడం జరిగినదని చెప్పారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి హోళి హమారా రంగోలి, హోళి హోతే హే హమారే విశ్వమే, చూడమ్మ రంగుల పండుగ హోళి పండుగ, హోళి కావాలి మనకు సిరుల పండుగ నృత్యాలు చాలా ఆకర్షింపచేసాయి.ఈ వేడుకలలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ అవగాహన పార్కుతో ప్రమాదాల నివారణ: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





కరీంనగర్, మార్చి 13(భారత శక్తి):ట్రాఫిక్ పార్కు సందర్శించడం ద్వారా పిల్లలకు అవగాహనతో పాటు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గురువారం తిమ్మాపూర్ లోని రవాణా శాఖ కార్యాలయం ఆవరణలో గల పిల్లల ట్రాఫిక్ అవగాహన పార్కును జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ పార్కులో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ పట్ల పిల్లలకు అవగాహన కలిగించే అన్ని రకాల బోర్డులు, గుర్తులు, సిగ్నల్స్ వంటివి ఏర్పాటు చేయాలని అన్నారు. నమూనా ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి అక్కడ అప్రమత్తత కోసం తీసుకోవాల్సిన చర్యలు వివరించే బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ ట్రాఫిక్ పార్కు సందర్శించేలా చూడాలని తెలిపారు. చిన్నప్పటి నుండే ట్రాఫిక్ అవగాహన వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉండదని అన్నారు. ట్రాఫిక్ పార్క్ లో ఏర్పాటు చేసిన ప్రతి గుర్తు గురించి పిల్లలకు వివరించాలని అన్నారు. పార్కు డివైడర్లలో పూల మొక్కలు నాటించాలని సూచించారు. పార్కు సందర్శించేందుకు వచ్చిన పాఠశాల విద్యార్థులను పలకరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఇక్కడ ఉన్న క్యాంటీన్ ని పరిశీలించారు. స్వశక్తి కేంద్రాల ద్వారా ఈ క్యాంటీన్ నిర్వహించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా రవాణా శాఖ కమిషనర్ పురుషోత్తం, డిటివో శ్రీకాంత్ చక్రవర్తి, ఎంవిఐ రవికుమార్, తహసిల్దార్ విజయ్, ఎంపీడీవో విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## నిఖిల్ రెడ్డి గ్రూప్ 2 లో 70 వ ర్యాంకు సన్మానించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి



కరీంనగర్, మార్చి 13(భారత శక్తి):రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూపు 2 ఫలితాల్లో సైదాపూర్ మండలం ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన సంతపూరి నిఖిల్ రెడ్డి గ్రూప్ 2లో 70 ర్యాంకు సాధించారు. గురువారం బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హుజురాబాద్ పట్టణంలోని బృందావన్ కాలనీలో నివాసముంటున్న నిఖిల్ రెడ్డిని కలిసి అభినందించి, సన్మానించి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నిఖిల్ రెడ్డి హుజురాబాద్ పట్టణంలో ప్రాథమిక విద్యను, పై చదువుల కోసం హైదరాబాదులో విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకుని , గతంలో గ్రూప్ 4 పరీక్షల్లో ఏడవ ర్యాంకు సాధించారని తెలిపారు. ప్రస్తుతం కరీంనగర్ డిటిఓ కార్యాలయంలో ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న నిఖిల్ రెడ్డి , తాజాగా గ్రూప్ 2లో 70 వ ర్యాంకు సాధించడం హర్షనీ యమన్నారు. భవిష్యత్తులో గ్రూప్ 1 సాధించాలనే సంకల్పం నిఖిల్ రెడ్డికి ఉందని, అందులో కూడా విజయం సాధించి మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి హుజురాబాద్ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు బిజెపి సీనియర్ నాయకులు తిప్ప బత్తిని రాజు పోతుల సంజీవ్ బొరగాల సారయ్య సబ్బని రమేష్ గంట సంపత్ గుడిపాటి కొండారెడ్డి హృతిక్ మోతే మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష రాస్తుండగా ఫ్యాన్ ఊడగా విద్యార్థినికి గాయాలు



కరీంనగర్, మార్చి 13(భారత శక్తి):కరీంనగర్‌లోని సహస్ర జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థిని శివాన్విత పరీక్షలను రాస్తుండగా సిలింగ్ ప్యాన్ కొక్కెం ఊడిపోయి పడటంతో ఆమె గాయాలు అయ్యాయి. శివాన్వితకు ఫ్యాన్ రెక్కలు తగలడంతో ఆమె ముక్కు, కన్ను కింది భాగాల్లో గాయాలయ్యాయి.స్పందించిన సిబ్బంది వెంటనే విద్యార్థినిని పరీక్షా కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి తరలించి చికిత్స చేయించి, అనంతరం విద్యార్థినిని మరో గదిలో కూర్చోబెట్టి అరగంట సమయాన్ని అదనంగా కేటాయించి పరీక్ష రాయించారు.

## అట్టహాసంగా మానేరు పాఠశాల వార్షికోత్సవం ఉల్లాసంగా...ఉత్సాహంగా ఆడిపాడిన విద్యార్థులు



కరీంనగర్, మార్చి 13(భారత శక్తి): మానేరు ఉన్నత పాఠశాల 4వ వార్షికోత్సవం ఎల్కే గార్డెన్స్ లో అట్టహాసంగా జరిగింది. గురువారం జగిత్యాల జిల్లా కోడమ్యల మండలం పుదూరులోని మానేర్ పాఠశాల విద్యార్థుల కోలాహలం మధ్య దరోహర 2025 పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి కరీంనగర్ ఎస్ఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మానేరు విద్యాసంస్థలు దోహదపడుతాయన్నారు. కొడిమ్యాల మండలం గోపాల్ రావ్ పేట గ్రామంలో పుట్టిన తను విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధనను అందించాలనే ఉద్దేశ్యంతో పూడూరు గ్రామంలో అత్యున్నత ప్రమాణాలతో ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయవంతంగా నాలుగు వసంతాలు పూర్తి చేసుకున్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. గత సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో ఇద్దరు విద్యార్థులు 10కి 10 జిపిఏ సాధించడం గర్వించదగ్గ విషయమని, ఐదుగురు విద్యార్థులు 9.8 జిపిఎ సాధించారని తెలిపారు.

భవిష్యత్తులో ఇక్కడి విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా తీర్చిదిద్దడమే తన ముందున్న లక్ష్యం అని అన్నారు. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ లక్ష్య సిద్ధితో సాధన చేస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని అన్నారు. విద్యార్థులు విద్యార్థికి దశలోనే గొప్ప సంకల్పంతో విద్యా బోధనలను సాగించాలన్నారు. ప్రపంచంలోనే ఎక్కువ యువత ఉన్న దేశం భారతదేశం అని భారతదేశం గర్వించే విధంగా విద్యార్థులు తయారు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ లు కడారి సునీత రెడ్డి, కడారి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు లింగాగౌడ్, రవి, మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

## నూతన బాధ్యతలు చేపట్టిన ఏడికి స్వాగతం మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్జీవో, టిజీఓ నాయకులు



కరీంనగర్, మార్చి 13(భారత శక్తి):పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా అడిషనల్ ఇంచార్జిగా పదవి బాధ్యతలు చేపట్టిన అజ్మీరా వినోద్ కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్జీవో, టీజీవో నాయకులు. ఈ సందర్భంగా నాయకులు పూల మొక్క ఇచ్చి వారికి స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలియపరిచినారు. అనంతరం ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులందరికీ ముందస్తుగా హోలీ శుభాకాంక్షలు తెలియపరిచినారు. చెడుపై మంచి విజయం సాధించిన రోజుగా భావించి ప్రజలందరూ హోలీనీ, మన భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు లోతుగా పాతుకపోయినా శక్తివంతమైన పండుగని గుర్తుచేశారు. ప్రజలందరూ ఈ వేడుకలు ఉత్సాహంగా ఆనందంగా జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవోల జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళీ చరణ్, కార్యదర్శి అరవింద్ రెడ్డి, గూడ ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు రాజేష్ భరద్వాజ్, రాజేశ్వరరావు, మహేష్, అజయ్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు విజయ్, సత్యనారాయణ, నాలుగో తరగతి ఉద్యోగుల కార్యదర్శి శంకర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిడ్జ్ లో హోళీ సంబురాల కోలాహలం.




ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), మార్చ్ 13:స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో గురువారం హోలీ సంబరాలతో పాఠశాల విద్యార్థులు సందడి చేశారు. ఒకరికొకరు సహజసిద్ధమైన రంగులు పూసుకుంటూ ఎంజాయ్ చేశారు. పాఠశాల మైదానంలో గన్నుల్లో రంగులు నింపి తమ స్నేహితులకు రంగులు పూస్తూ సరదా సరదాగా గడిపారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ వసంతకాలంలో ప్రకృతి రమణీయతను సూచిస్తూ అనాదికాలం నుంచి హోలీ సంబరాలను జరుపుకుంటున్నామని తెలిపారు. పురాణాల కాలంలో బృందావనంలో శ్రీకృష్ణుడు గోపికలతో కలిసి రంగుల వసంతంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. వాతావరణ మార్పులతో చలికాలం నుంచి వేసవి కాలానికి ప్రవేశిస్తున్న తరుణంలో సహజ సిద్ధమైన రంగులను పూసుకోవడం ద్వారా శరీరం కొత్త వాతావరణానికి అలవాటు పడే విధంగా పూర్వకాలం నుంచి హోలీ సంబరాలు జరుపుకోవడం సాంప్రదాయంగా వస్తున్నదని వివరించారు. తమ పాఠశాలలో హోలీ పర్వదిన ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. మనదేశ విభిన్న సంస్కృతి సాంప్రదాయాలకు హోలీ వేడుకలు ప్రతీకలు గా నిలుస్తున్నాయని వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అదరగొట్టిన పంచాయతీ కార్యదర్శి ప్రదీప్.



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 13: యువతా సమయం వృథా చేయకుండా కార్యాచరణ ప్రారంభిస్తేనే నిర్దే శించుకున్న లక్ష్యం చేరుకోవచ్చని నిరూ పించాడు కుంటాల మండలంలోని లింబా (కె) గ్రామానికి చెందిన ప్రదీప్. గ్రూప్-2 ఫలితాల్లో 374.5 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 362వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం ప్రదీప్ బాసర మండలంలోని కిర్గుల్(బి) పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనను పలువురు అభినం దించి సన్మానించారు.

# విధుల్లో ఆసత్వం ప్రదర్శించకూడదు

## క్రమశిక్షణ నీ టర్న్ అవుట్ ఫిట్నెస్ తో ఆదర్శంగా ఉండాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఐపీఎస్.,





కరీంనగర్, మార్చి 13(భారత శక్తి):నేరాల నియంత్రణలో, ప్రజలకు మొదటగా అందుబాటులో ఉండే బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది పాత్ర కీలకమని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే, సహించేదిలేదని, పోలీస్ స్టేషన్ ను దేవాలయంగా చూడాలని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝు అన్నారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్ లో పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బందికి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హాజరై సిబ్బందికి పలు సూచనలు చేయడం జరిగింది.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనర్ పరిధిలో చాలా వరకు పారిశ్రామిక ప్రాంతం. ఈ ప్రాంతంలో జరిగే ప్రతి విషయం గురించి ప్రతి ఒక్కరికి అవగాహన సమాచారం ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఒక టీంలో పని చేసినప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చనీ చెప్పారు.నీట్ టర్న్ అవుట్, ఫిట్నెస్ తో, క్రమశిక్షణ తో ఎదుటివారికి ఆదర్శంగా ఉండాలి. వాహనాలు ను కూడా మంచిగా మైంటెనెన్సు చేయాలి. వాహనం మీ రథం లాంటివి అప్పుడు ఆది మీకు రక్షణ గా ఉంటుందన్నారు. లా అండ్ ఆర్డర్ సమస్యల విషయంలో కమ్యూనల్ సమస్యలనేవి ఒకటి కులాల, మతాల, గ్రూప్ ల మధ్య అలాంటివి మీ పోలీస్ స్టేషన్లో పరిధిలో జరిగినప్పుడు అక్కడ ముఖ్య మైన వారు ఎవరనీ గుర్తించాలి, కారణాలు తెలుసుకోనీ, వెంటనే సంఘటన స్థలాలను చేరుకోవాకానీ కోరారు.. ఇక్కడ పరిస్థితులను వెంటనే పై అధికారులకు తెలియజేయాలి. మీరు చేసే డ్యూటీ 24ల7 అప్రమత్తంగా ఉండవలసి వస్తుంది. మీరు ఏదైనా సంఘటనకు సంబంధించి అలసత్వం ప్రదర్శించినట్లయితే లాండ్ ఆర్డర్ సమస్య తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. క్రమశిక్షణతో విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించినట్లయితే క్షేత్రస్థాయిలో వారిని గుర్తించి రివార్డులు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకూడదు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పని చేసినప్పుడే అధికారులకి మంచి పేరు వస్తుందన్నారు. నేరాల నియంత్రణలో,ప్రాపర్టీ సంబంధిత, ఇతర నేరాల నియంత్రణ లో బ్లూ కోల్ట్స్ మరియు పెట్రో కార్స్ అధికారుల పాత్ర కీలకం అని, డయల్ 100 కాల్ వచ్చినప్పుడు అత్యవసర సమయంలో బాధితులకి వేగవంతమైన స్పందన తప్పక ఇవ్వాలని తక్కువ సమయంలోనే సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలని, సేవలు అందించాలని బ్లూ కోల్ట్స్ మరియు పెట్రో కార్ సిబ్బంది, ప్రజల పట్ల బాధ్యతగా మెలగాలని, అనుక్షణం ప్రజలకు అందుబాటులో ఉంటూ, అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని, అత్యవసర సేవలు అయిన రోడ్డు ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, పట్టణాల, గ్రామాలలో జరిగే అవాంఛనీయ సంఘటనలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు మొదలైన వాటికి సంబందించిన డయల్ 100 కాల్ ద్వారా సమాచారం అందిన వెంటనే ఆ ప్రాంతంలో అందుబాటులో ఉన్న బ్లూ కోల్ట్ సిబ్బంది లేదా పెట్రోల్ వెహికల్స్ సిబ్బంది తక్షణమే స్పందించి తగు చర్యలు చేయవలసిన అంశాల గురించి సూచనలు, ఆదేశాలు జారీ చేయడం జరిగింది. తమ ఏరియా పై సమగ్ర సమాచారం కలిగి ఉండి ఆ ప్రాంత ప్రజల రక్షణకు భరోసా కల్పించాలని అన్నారు. గస్తీ తిరుగుతున్న ఏరియా నుండి రిపోర్ట్ చేయబడిన అన్ని డయల్100 ఫిర్యాదులను నిర్ణిత సమయంలో అటెండ్ చేయడంతో పాటు బాధితులకు సత్వర సేవలు అందించాల్సి ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, బ్లూ కోల్ట్స్ మరియు పెట్రో కార్స్ వర్టికల్స్ ఇంచార్జ్ లు బ్లూ క్లోట్స్ మరియు పెట్రో కార్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను పరిశీలించిన అదనపు కలెక్టర్



కరీంనగర్, మార్చి 13(భారత శక్తి):జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాములను గురువారం అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్ధేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోడౌన్ లను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని, ఎన్నికల సంఘానికి సమగ్ర నివేదికను పంపిస్తున్నామని తెలిపారు. ఈవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోడౌన్ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవిఎం గదులను, అక్కడ భద్రత ఏర్పాట్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, ఏఓ సుధాకర్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి: హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)మార్చి13:ఇంటర్మీడియట్ , పదో తరగతి వార్షిక పరీక్షలలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ హంటర్ రోడ్డు లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల(ధర్మసాగర్)ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ఎలా రాస్తున్నారు, నీట్, ఎంసెట్ లకు దరఖాస్తు చేశారా అని కలెక్టర్ జూనియర్ కళాశాల విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి క్లాసురూములకు వెళ్లి విద్యార్థునులతో కలెక్టర్ మాట్లాడారు. వార్షిక పరీక్షల సన్నద్ధత గురించి విద్యార్థినులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన కలెక్టర్ అందులో ఉన్న వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంసెట్, నీట్ పరీక్షల పుస్తకాలను కళాశాల విద్యార్థినులకు కలెక్టర్ అందజేశారు. వంట గది, స్టోర్ రూమ్ లను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థినులకు వండిన భోజనాన్ని, కూరలను పరిశీలించారు. విద్యార్థినులకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో అల్పాహారం, భోజనం, అందించే మెనూ చార్ట్ ను పరిశీలించారు. విద్యార్థినులకు సంబంధించిన టాయిలెట్స్ ను పరిశీలించారు. పరీక్షలు రాస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థినులతో పాటు వార్షిక పరీక్షలు రాయబోతున్న విద్యార్థినులతో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు బాగా సన్నద్ధమై ఫలితాల్లో



మంచి మార్కులు సాధించి రాష్ట్రంలో జిల్లా పేరును నిలపాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కలెక్టర్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ప్రిన్సిపల్ శైలజ, ఉపాధ్యాయులు, అధ్యాపకులతో మాట్లాడి సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

యథాస్థానానికి పాఠశాల, కళాశాలను తరలించేందుకు అక్కడ కావాల్సిన వసతి సదుపాయల గురించి ప్రతిపాదనలు సమర్పిస్తే వాటిని మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అనంతరం పదో తరగతి విద్యార్ధినులకు కలెక్టర్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, ఇతర పరీక్ష సామాగ్రి అందజేశారు. పదో తరగతి హాల్ టికెట్లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఆదా చేస్తేనే గృహ జ్యోతి

బాలసముద్రం రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించిన కుటుంబాలకు జీరో బిల్లు వర్తింపజేస్తోంది. అంతకు మించి ఒక్క యూనిట్ వినియోగం పెరిగినా మొత్తం బిల్లు చెల్లించాల్సి. మరో వైపు వేసవి వచ్చేసింది. ఇళ్లల్లో పంకాలు, ఏసీలు, కూలర్ల వాడకం పెరిగింది. ఇష్టారీతిన కరెంటు వాడితే బిల్లుల మోత తప్పదు. పరిమితంగా వినియోగిస్తే 'గృహజ్యోతి' పథకం పేద కుటుంబాల్లో నిరంతరం వెలుగులు నింపుతుంది.ఈ వేసవిలో విద్యుత్తు వినియోగం ఎక్కువగా ఉంటుంది.. కొన్ని జాగ్రత్తలు, చిట్కాలు పాటించడం ద్వారా తగ్గించుకోవచ్చు. తద్వారా గృహజ్యోతి ప్రయోజనం పొందొచ్చు.. కిటికీలు తెరిస్తే సహజ గాలి: చాలా మంది కిటికీలు, తలుపులు మూసివేసి ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు, విద్యుత్తు దీపాలు వినియోగిస్తుంటారు. సహజ వెలుతురు, గాలి ఉన్న సమయంలో ఫ్యాన్లు, బల్బులు వాడాల్సిన అవసరం ఉండదు. బల్బులు నిరంతరం వినియోగించడం ద్వారా 12 శాతం బిల్లు పెరుగుతుంది. ఫ్రిజ్‌ను పరిశీలిస్తూ ఉండాలి: సీజన్ మేరకు ఫ్రిడ్జ్‌లో ఫ్రీజర్ దశలు మార్చుతూ ఉండాలి. ఫ్రిజ్‌లో ఎన్ని వస్తువులు ఉంచినా ఒకే సామర్థ్యంతో పని చేస్తుంది. మంచు పొరలు పావు వంతు పెరిగినట్లు గమనిస్తే వెంటనే డిఫ్రోస్ట్ బటన్ నొక్కి తొలగించుకోవాలి.

# అక్రమ అరెస్టులు చేయడం ప్రభుత్వానికి తగదు: సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం



కరీంనగర్, మార్చి 13(భారత శక్తి):రైతులందరికీ రుణమాఫీ చేయాలని, వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేసి ఉపాధి హామీ కూలీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో కార్యక్రమం వాయిదా పడిందనీ, అయినా పోలీసు యంత్రాంగం నాయకుల ఇళ్లలోకి వెళ్లి ముందస్తుగా అక్రమ అరెస్టు చేయడాన్ని సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్బంగా సత్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజా సంఘాల పోరాటాల పై ఉక్కు పాదం మోపడం తగదన్నారు. గత పాలకులు నియంతల వ్యవహరించి ఉద్యమాలను అణిచివేసి అధికారాన్ని కోల్పోయారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా రైతులందరికీ రుణమాఫీ చేయాలని, భూమిలేని నిరుపేదలకు సంవత్సరానికి 12,000 రూపాయలు ఇవ్వాలని, మహిళలకు 2500 రూపాయలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించారని అన్నారు. 19వ తేదీన జరిగే బడ్జెట్ సమావేశాల్లో రైతులు వ్యవసాయ కూలీలు నిరుపేదలకు ప్రాముఖ్యత ఇస్తూ అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జై జవాన్- జై కిసాన్ అంటూనే ఢిల్లీలో న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తున్న రైతులపై ఉక్కుపాదం మోపి 1200 మంది రైతుల ప్రాణాలను బలిగొందని అన్నారు. రైతులకు లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల పొట్ట కొట్టి పారిశ్రామికవేత్తల కడుపు నింపే విధంగా కేంద్ర ప్రభుత్వం నూతనంగా 4 లేబర్ కోడ్ లు తెస్తుందని రైతు ఉద్యమాల స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్ రద్దు అయ్యేంతవరకు ఐ కింద ఉద్యమించాలని అన్నారు. దేశంలో రాష్ట్రంలో, దేశంలో ఉద్యమాలు చేసే హక్కులను కాల రాయడం సిగ్గుచేటని, ఉద్యమాలను అణచివేస్తూ అక్రమ అరెస్టులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉందని ఉపాధి హామీ కూలీలకు పనిచేసే చోట నీడ, త్రాగునీరు సౌకర్యం కల్పించి పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణాల్లో విలీనం చేసిన గ్రామాల్లో సైతం ఉపాధి పనులు కల్పించాలని అన్నారు. ప్రజా సమస్యలపై కార్మిక కర్షకులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# మదీనా షాపింగ్ కాంప్లెక్స్ లో అద్దే బకాయిల కోసం ముట్టడి :మాజీ జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మోసిన్

## పవన్ అప్లైయన్స్ యజమాని రవికుమార్ 25లక్షలపైగా అద్దె చెల్లించాలి

కరీంనగర్, మార్చి 13(భారత శక్తి):నగరనడిబొడ్డున ఉన్న మదీనా షాపింగ్ కాంప్లెక్స్ లో కరీంనగర్ షెటర్లకు సంబంధించిన బకాయిలను వసూలు చేయడంలో వక్ఫ్ బోర్డ్ అధికారులు విఫలమయ్యారని, వసూళ్ల కోసం ముట్టడిస్తామని మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యంతో షట్టర్ల అద్దె బకాయిలను వసూలు చేయడంలో వక్ఫ్ బోర్డ్ అధికారులు నిర్లక్ష్యం వహించారని విమర్శించారు.అధికారుల వైఖరికి నిరసన చేపడుతామన్నారు. షట్టర్లలో అద్దెకు ఉంటున్న కిరాయిదారులు సైతం సరైన సమయంలో అద్దెలు చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.మదీనా షాపింగ్ కాంప్లెక్స్ షట్టర్ నెంబరు 26, 27 పవన్ అప్లైయన్స్ యజమాని రవికుమార్ పేరున 622.5 చదరపు మీటర్లు గల షెటర్ నుంచి వక్ఫ్ బోర్డుకు రూపాయలు 25, 44,350 చెల్లించాల్సి ఉండగా నోటీసు ఇచ్చారనీ, నోటీసు జారీ చేసి సుమారు రెండు సంవత్సరాలు గడిచిన నేటి వరకు మదీనా కాంప్లెక్స్ కరీంనగర్ యొక్క షట్టర్ కిరాయి దారి నుండి బకాయిలు ను చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవడంలేదనీ, బకాయిదారుల పై చట్టపరమైన చర్యలు తీసుకోలేదనీ ధ్వజమెత్తారు.




మదీనా షాపింగ్ కాంప్లెక్స్ కరీంనగర్ షట్టర్ల యజమాని దగ్గర నుంచి కిరాయి బకాయి వెంటనే వసూలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ విషయం రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ దృష్టికి త్వరలో తీసుకు వెళ్తామని, అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వపై ఒత్తిడి తీసుకు వస్తామన్నారు.పవన్ అప్లైయన్స్ యజమాని రవికుమార్ షెట్టర్ ముందు త్వరలో ధర్నా కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో నగర కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు అహమ్మద్ అలీ ,హాజీ, ఇమ్రాన్, కరీం ,ఆసిఫ్, మాజీద్, సాదిక్, ఆరిఫ్ ఖాన్, షాకీర్, తదితరులు పాల్గొన్నారు.

# తవ్విస్తూ...... దోచేస్తూ (వార్త కు స్పందన )

## తెలంగాణ సరిహద్దు తనూర్ మండల్లో జోరుగా అక్రమ మొరం తవ్వకాలు.. మామూళ్ల మత్తులో మైనింగ్ అధికారులు.

## మహారాష్ట్ర మైనింగ్ మాఫియా ఆగడాలు అధికారుల నిస్సహాయత


...శక్తి ఆదివారం, 9 మార్చి 2025

తవ్విస్తూ...... దోచేస్తూ

తెలంగాణ సరిహద్దు తనూర్ మండల్లో జోరుగా అక్రమ మొరం తవ్వకాలు..

మామూళ్ల మత్తులో మైనింగ్ అధికారులు.

మహారాష్ట్ర మైనింగ్ మాఫియా ఆగడాలు %-% అధికారుల నిస్సహాయత



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 13: ర్మల్ జిల్లా తనుర్ మండలంలో మట్టి ఆగడాలు అధికారుల స్సహాయత అనే శీర్షికతో మండలంలో అధికారులు మేల్కొన్నారు. ండల ఎమ్మార్వో రాత్రి పగలు అనగా అక్రమ మట్టి తవ్వకాలపై రియు అక్రమ ఇసుక రవణాలపై ప్రత్యేక దృష్టి పెట్టి అక్రమ సుక తరలిస్తున్న బుధవారం రాత్రి వాహనాన్ని స్వాధీనం చేసుకొని లీసులకు అప్పగించారు.

తానూర్: అక్రమంగా తరలిస్తున్న ఇసుక వాహనం పట్టివేత లాంటి అనుమతి లేకుండా రాత్రి పగలు తేడా లేకుండా అక్రమ సుక రవాణా కొనసాగుతోంది. ఈ విషయం పట్ల స్థానిక తానూర్ హాశీల్దార్ పక్క సమాచారంతో బుధవారం రాత్రి మహారాష్ట్ర రిహద్దు జవుల్ (బి) వద్ద ఎలాంటి అనుమతి లేని అక్రమంగా సుకను తరలిస్తున్న వాహనం పట్టుకొని కేసు నమోదు చేసి, ఆ హన్నాని పోలీసులకు అప్పగించారు. ఈ తనఖీలతో అక్రమ సుక దారులకు గూబులు పట్టిస్తోందని మండల ప్రజల ంటున్నారు.

# రోహిత్ టార్గెట్ అదేనా? అప్పటివరకు 'నో రిటైర్‌మెంట్'

టీ20 ప్రపంచ కప్ గెలిచాడు. ఛాంపియన్స్ ట్రోఫీని అందించాడు. ఇప్పటికే పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు చెప్పేశాడు. ఇప్పుడు వన్డేలకూ గుడ్‌బై చెబుతాడని అంతా భావించారు. కానీ, రిటైర్‌మెంట్ తీసుకోవడం లేదంటూ స్పష్టంచేసేశాడు. ఆ ఆటగాడు ఎవరనేది ఇప్పటికే అర్థమైపోయిందిగా. అతడే.. భారత కెప్టెన్ రోహిత్ శర్మ ( ఈ క్రమంలో వన్డే ప్రపంచకప్ 2027 వరకూ ఉంటాడని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఐసీసీ టెస్టు ఛాంపియన్‌షిప్ (2025-27) ఫైనల్‌లోనూ ఆడాలనేది అతడి అభిమతంగా ఉందనేది వారి అంచనా.



"రోహిత్ అనుకున్నవిధంగా భావిస్తే మాత్రం అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ మరో రెండేళ్లపాటు కొనసాగే అవకాశం ఉంది. దక్షిణాఫ్రికా-జింబాబ్వే-నమీబియా ఆతిథ్యంలో వన్డే ప్రపంచ కప్ 2027 టోర్నీ జరగనుంది. ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్ కూడా అదే ఏడాది ఉంది. ఈ రెండింటిని గెలిచి ఘనంగా కెరీర్‌కు వీడ్కోలు పలకాలనేది రోహిత్ భావన'' అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

ఐపీఎల్ తర్వాతే ఓ నిర్ణయం..

రోహిత్ శర్మ మరో నెల రోజుల్లో 38వ సంవత్సరంలోకి అడుగుపెట్టనున్నాడు. 2027 నాటికి అతడికి 40 ఏళ్లు వస్తాయి. అప్పటివరకు కొనసాగాలంటే ఫిట్‌నెస్‌తోపాటు బ్యాటింగ్‌లో ఫామ్ అత్యంత కీలకం. టీమ్‌ఇండియా అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్‌తో కలిసి రోహిత్ పనిచేయనున్నట్లు తెలుస్తోంది. రాబోయే రెండేళ్లలో భారత్ 27 వన్డేలు ఆడే అవకాశం ఉంది. దినేశ్ కార్తిక్ నుంచి కేఎల్ రాహుల్ వరకు నాయర్ కోచింగ్‌పై మంచి గురి ఉంది. రోహిత్‌తో కలిసి ఆడిన అనుభవం ఉంది. అయితే, టెస్టు భవిష్యత్తుపై మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. గత బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో రోహిత్ ప్రదర్శన గొప్పగా ఏమీ లేదు. దీంతో ఐపీఎల్ ముగిసిన తర్వాత టెస్టు కెరీర్‌పై రోహిత్ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. ఇంగ్లాండ్‌తో జూన్‌లో టెస్టు సిరీస్ జరగనుంది. అప్పుడు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్ మొదలవుతుంది. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుకోవాలంటే భారత్‌కు ఈ సిరీస్ అత్యంత కీలకం.



# ఛాంపియన్స్ ట్రోఫీకి వ్యూస్ ఎన్నో తెలుసా?

ఇటీవల ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ (దిగ్విజయంగా ముగిసింది. పాకిస్థాన్ ఆతిథ్యం ఇచ్చిన ఈ టోర్నీ విజేతగా టీమ్‌ఇండియా నిలిచింది. ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన భారత్ దాదాపు 12 ఏళ్ల తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకుంది. ఇప్పటికే ఫైనల్ మ్యాచ్ వ్యూవర్‌షిప్ పరంగా రికార్డులు సృష్టించింది. భారత్ - కివీస్ పోరుకు 90 కోట్లకుపైగా వ్యూస్ వచ్చాయి. ఏక కాలంలో 6.1 కోట్ల మంది వీక్షించారు. మరి మొత్తం ఛాంపియన్స్ ట్రోఫీకి ఎన్ని వ్యూస్ వచ్చాయి ఉంటాయో ఓ సారి అంచనా వేయండి?

భారత్ - చైనా జనాభాకు డబుల్

జియోహాట్‌స్టార్‌లో ప్రసారమైన ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లకు భారీ ఆదరణ దక్కింది. భారత్ (143 కోట్లు), చైనా (141 కోట్లు) జనాభా కంటే రెట్టింపుగా ఈ మ్యాచ్‌లకు వ్యూస్ రావడం విశేషం. మొత్తం 540.3 కోట్ల వ్యూస్ రాగా.. 11వేల కోట్ల నిమిషాలపాటు వాచ్‌టైమ్‌గా నమోదైంది. ఏకకాలంలో 6.2 కోట్ల వ్యూవర్స్ కూడా చూసినట్లు కథనాలు వస్తున్నాయి. సబ్‌స్క్రిప్షన్లకు సంబంధించి జియోహాట్‌స్టార్ డిజిటల్ సీఈవో కిరణ్ మణి ఓ ప్రకటన విడుదల చేశారు. "ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి భారీ ప్రేక్షకాదరణ దక్కింది. కోట్ల మంది చూసే అవకాశం వచ్చింది. భారత్ - ఆస్ట్రేలియా మ్యాచ్ సందర్భంగా ఒక్క రోజులోనే అత్యధిక సబ్‌స్క్రిప్షన్లను సాధించడం జరిగింది'' అని కిరణ్ వెల్లడించారు.

హిందీ మాట్లాడే ప్రాంతాల నుంచే 38 శాతం లైవ్‌స్ట్రీమింగ్ వ్యూస్ వచ్చినట్లు మరొక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, గోవా, పంజాబ్, హరియాణా రాష్ట్రాల నుంచి వ్యూస్ భారీగా వచ్చాయి. జియో హాట్‌స్టార్ తొలిసారి ఐసీసీ ఈవెంట్‌ను బ్రాడ్‌కాస్టింగ్ చేసిందని.. 9 ప్రాంతీయ భాషల్లో కామెంటేటరీని అందుబాటులోకి తీసుకొచ్చింది.



# రోహిత్ శర్మను విమర్శించడానికి ఒక్క కారణమూ లేదు: ఏబీ డివిలియర్స్

టీమ్‌ఇండియా కు వరుసగా రెండో ఐసీసీ టైటిల్ అందించిన రోహిత్ శర్మ (పై దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ ( ప్రశంసలు కురిపించాడు. ఇతర కెప్టెన్లతో పోలిస్తే అతని రికార్డు చాలా మెరుగ్గా ఉందని, బ్యాటర్‌గానూ రాణిస్తున్నాడని పేర్కొన్నాడు. రోహిత్ రిటైర్ కావడానికి, అతడిని విమర్శించడానికి ఒక్క కారణమూ లేదని ఏబీ డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత రోహిత్ శర్మ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని ప్రచారం జరిగింది. అయితే, ఫైనల్ మ్యాచ్ అనంతరం హిట్‌మ్యాన్ దీనిపై స్పందించాడు. తన రిటైర్మెంట్ గురించి ఎలాంటి ప్రచారం చేయొద్దని, వన్డే ఫార్మాట్ నుంచి ఇప్పుడే తాను రిటైర్ కావట్లేదని స్పష్టత ఇచ్చాడు. ఈ నేపథ్యంలోనే పలువురు క్రికెటర్లు రోహిత్ తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా నిలుస్తున్నారు.

'ఇతర కెప్టెన్లతో పోల్చి చూస్తే రోహిత్ విన్నింగ్ పర్సంటేజీ ఎక్కువ. అది దాదాపు 74 శాతంగా ఉంది. ఇది గతంలోని ఇతర కెప్టెన్ల కంటే చాలా ఎక్కువ. అతను మరింత కాలం ఆడితే ఆల్‌టైమ్ వన్డే కెప్టెన్లలో ఒకడిగా నిలుస్తాడు. రోహిత్ కూడా తాను రిటైర్ కావడం లేదని చెప్పాడు. దీనిపై వదంతులు వ్యాప్తి చేయడం ఆపాలని కోరాడు. రోహిత్ ఎందుకు రిటైర్ కావాలి? అతనికి కెప్టెన్‌గానే కాకుండా బ్యాటర్‌గానూ మంచి రికార్డు ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో 76 పరుగులు చేసి గొప్ప శుభారంభాన్ని అందించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. తీవ్ర ఒత్తిడిలోనూ మంచి నిర్ణయాలు తీసుకుని జట్టును విజయపథంలో నడిపించాడు. రోహిత్ రిటైర్ అవ్వడానికి, అతణ్ని విమర్శించేందుకు ఒక్క కారణమూ లేదు. అతని రికార్డులే అతను ఎంత గొప్ప ఆటగాడో చెప్తాయి. అంతే కాదు, రోహిత్ తన ఆటను కూడా మార్చుకున్నాడు. గతంలో కంటే పవర్‌ప్లేలో అతని స్ట్రైక్ రేట్ పెరిగింది' అని ఏబీ డివిలియర్స్ పేర్కొన్నాడు.

# నేను అక్కడుంటే.. హ్యాట్రిక్ కొడదామని అనుకున్నా: ఛతేశ్వర్ పుజారా

ఐపీఎల్ 2025 సీజన్ ముగిశాక టీమ్‌ఇండియా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో ఎడిషన్‌లో భాగంగా తొలి టెస్టు సిరీస్‌ను ఆడనుంది. ఈ క్రమంలో భారత సీనియర్ క్రికెటర్ ఛతేశ్వర్ పుజారా మళ్లీ జట్టులోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పుజారా కీలక వ్యాఖ్యలు చేశాడు. గత ఆస్ట్రేలియా పర్యటనలో భారత్‌కు చేదు అనుభవం ఎదురైన సంగతి తెలిసిందే. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ ని కోల్పోవడమే కాకుండా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుకోవడంలోనూ దారుణంగా విఫలమైంది. ఒకవేళ తాను జట్టులో ఉండుంటే హ్యాట్రిక్ కొట్టాలని భావించినట్లు పుజారా వెల్లడించాడు.




"క్రికెటర్‌గా జాతీయ జట్టు కోసం ఆడాలనుకోవడం సహజమే. అందుకోసం ఏం చేయడానికైనా సిద్ధమే. జట్టుకు నా అవసరం ఉందనుకుంటే.. తప్పకుండా నేను సిద్ధంగా ఉంటా. దేశవాళీ క్రికెట్ ఆడటం వల్ల ఫామ్, ఫిట్‌నెస్ పెంచుకున్నా. గత కొన్నేళ్లుగా కౌంటీ క్రికెట్ కూడా ఆడుతున్నా. డొమిస్టిక్‌లో భారీగానే పరుగులు చేశా. అవకాశం ఇస్తే.. రెండు చేతులతో ఛాన్స్‌ను అందుకోవడానికి సిద్ధంగా ఉన్నా. ఎప్పుడు బరిలోకి దిగినా సత్తా చాటేందుకు ప్రయత్నిస్తా. జట్టు విజయం కోసం చివరి వరకూ పోరాడతా'' అని పుజారా వ్యాఖ్యానించాడు.

నాకు నమ్మకం ఉంది..

ఛతేశ్వర్ పుజారా చివరిగా భారత్ తరఫున ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2023 ఫైనల్‌లో ఆడాడు. ఆ తర్వాత జట్టులోకి రాలేకపోయాడు. గత బోర్డర్ - గావస్కర్ ట్రోఫీకి ఎంపిక కాలేదు. ఒకవేళ తాను సెలెక్ట్ అయి ఉంటే తప్పకుండా భారత్ హ్యాట్రిక్ కొట్టి ఉండేదేమోనని పుజారా తెలిపాడు. " ఆ విషయంలో ఆత్మవిశ్వాసంతో ఉన్నా. ఒకవేళ నేను ఆసీస్ పర్యటనకు ఎంపికై ఉంటే తప్పకుండా మనం హ్యాట్రిక్ కొట్టేవాళ్లమని భావిస్తున్నా. ఇక నుంచి టీమ్‌ఇండియా నాలుగో సీజన్ కోసం సిద్ధం కావాల్సి ఉంది. ఇంగ్లాండ్‌ను వారి దేశంలో ఎదుర్కోవడం కష్టమే. కానీ, భారత్ విజేతగా నిలుస్తుందని భావిస్తున్నా. టీమ్‌ఇండియాతో పోలిస్తే ఇంగ్లాండ్ కాస్త బలహీనంగానే ఉంది. అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్ లేకపోవడంతో వారి బౌలింగ్ లైనప్ గొప్పగా ఏమీ లేదు'' అని పుజారా వెల్లడించాడు.

# కొత్త కెప్టెన్.. మారుస్తాడా రాత?

ఐపీఎల్ ఆరంభ సీజన్ లీగ్ దశలో రెండో స్థానంతో సెమీస్ చేరిన పంజాబ్.. ఆ తర్వాత అంచనాలను అందుకోలేకపోయింది. 2014లో జార్జ్ బెయిలీ నేతృత్వంలో సంచలన ప్రదర్శనతో ఫైనల్ చేరిన పంజాబ్‌కు కోల్‌కతా చెక్ పెట్టింది. ఆ తర్వాత ఒక్కసారీ కనీసం లీగ్ దశను కూడా దాటలేకపోయింది పంజాబ్. కింగ్స్ ఎలెవన్ పంజాబ్‌గా ఉన్న పేరును 'పంజాబ్ కింగ్స్'గా మార్చినా.. వేర్వేరు కెప్టెన్లను ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ప్రతిసారీ ఐపీఎల్ మొదలవుతుండగా.. టోర్నీ జరుగుతుండగా.. కప్పు గెలిచే, ప్లేఆఫ్స్ చేరే జట్ల గురించి అంచనాలు కడుతుంటారు అభిమానులు. ఆ సమయంలో అప్పుడు పంజాబ్ పేరు అస్సలు వినిపించదు! అయితే ఈసారి జట్టులో చాలా మార్పులు జరగడం, నిరుడు కోల్‌కతాకు టైటిల్ అందించిన శ్రేయస్ అయ్యర్ కెప్టెన్ కావడంతో పంజాబ్ రాత మారే సంకేతాలు కనిపిస్తున్నాయి.




బలాలు: కెప్టెన్ శ్రేయసే పంజాబ్‌కు అతి పెద్ద బలం. గత ఏడాది కోల్‌కతా జట్టులో కెప్టెన్‌గా, బ్యాటర్‌గా అతను అదరగొట్టాడు. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్లోనూ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. టీమ్‌ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడంలో అతడి పాత్ర కీలకం. గొప్ప ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్న శ్రేయస్ జట్టును ముందుండి నడిపించాలని పంజాబ్ ఫ్రాంచైజీ కోరుకుంటోంది. శ్రేయస్ లాంటి కెప్టెన్ ఉంటే సహచరులూ స్ఫూర్తి పొందుతారని ఆశిస్తోంది. కింగ్స్‌కు విదేశీ బలం బాగుంది. స్టాయినిస్, మ్యాక్స్‌వెల్, యాన్సెన్, అజ్మతుల్లా లాంటి నాణ్యమైన ఆల్‌రౌండర్లు ఆ జట్టు సొంతం. జోస్ ఇంగ్లిస్, ఆరోన్ హార్డీ, బార్ట్‌లెట్ సైతం ప్రతిభావంతులే. ఫెర్గూసన్ రూపంలో మేటి పేసర్ కూడా ఆ జట్టులో ఉన్నాడు. భారత ఆటగాళ్లలో అర్షదీప్, చాహల్ జట్టుకు బలమే.

బలహీనతలు: పంజాబ్‌కు దేశీయ బలం ఆశించినంత స్థాయిలో లేదు. శ్రేయస్, అర్షదీప్, చాహల్ కాకుండా స్టార్ ఆటగాళ్లెవ్వరూ అందుబాటులో లేరు. గత ఏడాది కొన్ని మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడి వెలుగులోకి వచ్చిన శశాంక్ సింగ్ ఈసారి ఎలాంటి ప్రదర్శన చేస్తాడో చూడాలి. చాహల్‌కు తోడుగా ఇంకో నాణ్యమైన స్పెషలిస్టు స్పిన్నర్ లేకపోవడం లోటే. అర్షదీప్‌తో పాటు ఇంకో పేరున్న దేశీయ పేసర్ ఉంటే పంజాబ్ పరిస్థితి మెరుగ్గా ఉండేది.

# ఫ్రెషర్లకు గుడ్ న్యూస్.. వచ్చే ఏడాది ఐటీలో నియామకాలు డబుల్

: ఐటీ రంగంలో ఫ్రెషర్ల నియామకాలు పుంజుకొనే అవకాశం ఉంది. ఏప్రిల్ నుంచి మొదలుకానున్న ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 1,50,000 మందిని కంపెనీలు నియమించుకొనే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే దాదాపు రెట్టింపు నియామకాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని రిక్రూటింగ్ సంస్థ టీమ్‌లీజ్ తన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి ఐటీలో ఫ్రెషర్ల నియామకాల సంఖ్య 85 వేల నుంచి 95 వేలకు చేరే అవకాశం ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దీని సంఖ్య దాదాపు డబుల్ కానుంది.



ఇక యాక్సెంచర్, క్యాప్‌జెమిని, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ ఐటీ సంస్థలు 1,60,000 నుంచి 1,80,000 మంది వరకు ఫ్రెషర్లను నియమించుకొనే అవకాశం ఉందని రీసెర్చ్ అండ్ డేటా సంస్థ అన్‌ఎర్త్‌సైట్ అంచనా వేసింది. 2024లో ఐటీ సంస్థలు పెద్ద సంఖ్యలో ఉద్యోగ కోతలు చేపట్టాయి. కొత్త నియామకాల విషయంలో ఆచితూచి వ్యవహరించాయి. ఇక 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఫ్రెషర్ల నియామకాలు కొంత మేర పుంజుకొన్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న టారిఫ్ విధానాల కారణంగా ఇటీవల కాలంలో సెంటిమెంట్‌ను మళ్లీ దెబ్బతింది. అయితే, చాలా కంపెనీలు తమ శ్రామిక శక్తిని, ముఖ్యంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రోల్స్‌లో నియమించుకొనేందుకు ఎదురుచూస్తున్నాయని, ఈ నైపుణ్యంతో తాజాగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకొని వచ్చే వారి నియామకాలు పెరిగే అవకాశం ఉందని టీమ్‌లీజ్ డిజిట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నీతి శర్మ అన్నారు.



# స్టార్‌లింక్‌కు భారత్ అంత ఈజీ కాదు.. కారణం ఏంటంటే?

శాటిలైట్ కమ్యూనికేషన్స్ సాయంతో ఇంటర్నెట్ సేవలందించేందుకు ఎలాన్ మస్క్ సంస్థ స్పేస్‌ఎక్స్‌తో దేశీయ టెలికాం సంస్థలు భారతీ ఎయిర్‌టెల్, జియో ఒప్పందం చేసుకున్నాయి. స్పేస్‌ఎక్స్ అనుబంధ స్టార్‌లింక్ ఇప్పటికే శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను 100 దేశాల్లో అందిస్తోంది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నుంచి భద్రతా పరమైన అనుమతులు లభిస్తే మన దేశంలోనూ ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. అయితే, స్టార్‌లింక్ సేవలకు దేశంలో కొన్ని సవాళు కూడా ఉన్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

దేశీయ టెలికాం సంస్థలకు స్పెక్ట్రమ్ కేటాయించేందుకు అనుసరిస్తున్న వేలం పద్ధతినే శాటిలైట్ కమ్యూనికేషన్స్ సంస్థలకూ అమలు చేయాలని గతంలో ఎయిర్‌టెల్, జియో కోరాయి. కట్ చేస్తే.. ఆ రెండు సంస్థలే ప్రధాని మోదీ అమెరికా పర్యటన తరవాతి పరిణామాల్లో స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం చేసుకున్నాయి. కాబట్టి భారత్‌లో స్టార్ లింక్ ఎంట్రీ మార్గం దాదాపు సుగమం అయినట్లే. స్టార్‌లింక్‌కు చెందిన 6,000 లియో (లో ఎర్త్ ఆర్బిట్) ఉపగ్రహాలు భూమికి దగ్గరగా (దాదాపు 550 కి.మీ.ఎత్తున) ఉండే కక్ష్యలో పరిభ్రమిస్తుంటాయి. భూమి నుంచి ఈ ఉపగ్రహాలు తక్కువ దూరంలో ఉండడం వల్ల తక్కువ లేటెన్సీతో ఇంటర్నెట్ సేవలను ఆస్వాదించొచ్చు. దేశంలో ఇంటర్నెట్ వినియోగదార్లు కోట్లలో ఉన్నప్పటికీ.. నెట్‌వేగం సరిగా లేని మారుమూల ప్రాంతాలు, కొండ ప్రాంతాలు చాలా ఉన్నాయి. అలాంటి చోట ఇంటర్నెట్ సేవలందిచేందుకు స్టార్ లింక్ ఉపయోగపడుతుంది.

అసలైన సవాళ్లు ఇవే..

స్టార్ లింక్ అందిస్తున్న శాటిలైట్ సేవల ఏర్పాటు ఖర్చు ఎక్కువ. స్టార్ లింక్ ఇన్‌స్టలేషన్‌కు దాదాపు రూ.30,500, నెలవారీ సబ్‌స్క్రిప్షన్ సగటు రూ.10వేలు ఉంది. మన దేశంలో ఈ ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

స్టార్ లింక్‌లో ప్రస్తుతం డౌన్‌లోడ్ స్పీడ్ 25-220 %వీఎజూం% వేగం ఉంటోంది. దేశీయంగా టెలికాం కంపెనీలు ఫైబర్, ఎయిర్‌ఫైబర్ సేవల ద్వారా 100 %వీఎజూం% వేగంలో అపరిమిత డేటాను రూ.599కే అందిస్తున్నాయి.

ఛార్జీల పరంగా చూస్తే ఫైబర్, టెలికాం టవర్లు పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉండే నగరాలు, పట్టణాల్లో స్టార్ లింక్ సేవల విస్తరణకు అవకాశం తక్కువ. అంటే ఇంటర్నెట్ సేవలందించేందుకు ఏమాత్రం అవకాశం లేని కొండ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలకు మాత్రమే స్టార్ లింక్ సేవలు పరిమితం కానున్నాయి.

శాటిలైట్ సిగ్నళ్ల ద్వారా డేటా అందించాలంటే వాతావరణం కూడా అనుకూలించాలి. ఒకవేళ వర్షాలు, దట్టమైన మేఘాలు కమ్ముకొన్నా సిగ్నళ్లకు విఘాతం కలుగుతుంది.

దేశంలో టెలికాం విభాగంలో జియో, ఎయిర్‌టెల్ సంస్థల హవా కొనసాగుతోంది. ఆయా సంస్థలు బ్రాడ్‌బ్యాండ్ సేవలనూ అందిస్తున్నాయి. అదీ తక్కువ ధరలో. కాబట్టి ఈ సంస్థలకు స్టార్ లింక్ ఏమాత్రం పోటీ కాబోదని నిపుణులు చెబుతున్నారు. చూడాలి భారత్‌లో స్టార్ లింక్ ఏమేర ప్రభావం చూపుతుందో



# ఓలా ఫ్లాష్ సేల్.. ఎస్1 స్కూటర్‌పై 26 వేలు డిస్కౌంట్

ప్రముఖ విద్యుత్ స్కూటర్ల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ ప్రత్యేక సేల్‌ని ప్రకటించింది. హోలీ సందర్భంగా ఎస్1 శ్రేణిలోని ఎలక్ట్రిక్ స్కూటర్లపై పెద్ద ఎత్తున డిస్కౌంట్ అందిస్తోంది. నేటి నుంచి (మార్చి 13) ప్రారంభమైన ఈ సేల్ మార్చి 17 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. సేల్‌లో భాగంగా ఓలా ఎస్1 ఎయిర్ కొనుగోలుపై రూ.26,750 వేల డిస్కౌంట్ అందిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ప్రస్తుతం ఈవీ ధర రూ.89,999గా ఉంది.

ఓలా ఎక్స్‌ం జెన్2 పై రూ.22 వేల వరకు రాయితీ అందించనున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఈ స్కూటీ ధర రూ.82,999 నుంచి ప్రారంభం అవుతుంది. ఇక ఎస్1 రేంజ్‌లోని మిగిలిన స్కూటర్లపై రూ.25 వేల వరకు తగ్గింపు ఉంటుందని కంపెనీ వెల్లడించింది. మార్కెట్లోకి కొత్తగా తీసుకొచ్చిన ఎస్1 జెన్3 శ్రేణి ఈవీలకూ ఈ ఆఫర్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. డిస్కౌంట్‌తో పాటు రూ.10,500 విలువైన ప్రయోజనాలను ఓలా ఎలక్ట్రిక్ అందిస్తోంది. కొత్తగా ఎస్1 జెన్2 స్కూటర్ కొనుగోలు చేసేవారికి ఏడాది పాటు రూ.2,999 విలువైన మూవ్ ఓఎస్ం సబ్‌స్క్రిప్షన్‌ని ఉచితంగా అందిస్తోంది. రూ.14,999 విలువైన ఎక్స్‌టెండెడ్ వారెంటీని రూ.7,499కే ఇస్తోంది.



# ధరలు దిగొచ్చాయ్.. మరోసారి రేట్ల తగ్గింపు?

## ఫిబ్రవరిలో రిటెయిల్ ద్రవ్యోల్బణం 3.61%
## దేశంలో కెల్లా తెలంగాణలోనే అతి తక్కువ

దిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అంచనాకు అనుగుణంగానే ధరలు దిగి వస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో రిటెయిల్ ద్రవ్యోల్బణం 7 నెలల కనిష్ఠమైన 3.61 శాతానికి దిగొచ్చింది. ఇది ఆర్‌బీఐ లక్ష్యమైన 4% లోపే ఉన్నందున.. వృద్ధిరేటు పెంచడమే లక్ష్యంగా వచ్చే నెలలో జరిగే ఆర్‌బీఐ ద్వైమాసిక పరపతి విధాన సమీక్షలో కీలక రేట్లు తగ్గించేందుకు అవకాశం ఏర్పడిందని విశ్లేషకులు చెబుతున్నారు.

రిటెయిల్ ద్రవ్యోల్బణాన్ని వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా లెక్కిస్తారు. కూరగాయలు, కోడిగుడ్లు సహా ప్రొటీన్ ఉత్పత్తుల ధరలు గత నెలలో తగ్గడం వల్ల ఇది అదుపులోకి వచ్చింది. 2024 ఫిబ్రవరిలో ఇది 5.09% కాగా.. 2025 జనవరిలో 4.26 శాతంగా నమోదైంది. 2024 జులైలో నమోదైన 3.54% తర్వాత.. గత నెలలో నమోదైన 3.61 శాతమే కనిష్ఠం. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన వివరాలు ఇలా..

ఫిబ్రవరిలో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 3.75 శాతానికి తగ్గింది. ఈ ఏడాది జనవరిలోని 5.53 శాతంతో పోలిస్తే 222 బేసిస్ పాయింట్లు దిగివచ్చింది.

2024 ఫిబ్రవరితో పోలిస్తే గత నెలలో ద్రవ్యోల్బణ రేటు బాగా తగ్గిన కీలక ఉత్పత్తుల్లో అల్లం (-35.81%), జీలకర్ర (-28.77%), టమాటా (-28.51%), కాలీఫ్లవర్ (-21.19%), వెల్లుల్లి (-20.32%) ఉన్నాయి.

కొబ్బరి నూనె (54.48%), కొబ్బరి (41.61%), పసిడి (35.56%), వెండి (30.89%), ఉల్లిపాయల (30.42%) ధరలు పెరిగాయి.

పట్టణ ప్రాంత ద్రవ్యోల్బణం జనవరిలోని 3.87 శాతంతో పోలిస్తే ఫిబ్రవరిలో 3.32 శాతానికి పరిమితమైంది.

గ్రామీణ ప్రాంత ద్రవ్యోల్బణం కూడా 4.59% నుంచి 3.79 శాతానికి తగ్గింది.

తెలంగాణలో అత్యంత తక్కువ ద్రవ్యోల్బణ రేటు (1.31%) నమోదు కాగా.. అత్యధికంగా కేరళలో (7.31%) నమోదైంది.

# ఎంటీఎన్ఎల్ షేర్లు 14% జంప్ .. కారణం ఇదే

: ప్రభుత్వరంగ టెలికాం సంస్థ మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ షేర్లు నేడు ట్రేడింగ్ సెషన్‌లో దూసుకెళ్తున్నాయి. ఇంట్రాడేలో ఏకంగా 14 శాతం పెరిగి రూ.49.29 వద్ద గరిష్ఠాన్ని తాకాయి. ప్రస్తుతం లాభాల్లో పయనిస్తున్నాయి. ఆస్తుల విక్రయం ద్వారా నిధుల్ని సమకూర్చుకోవడమే ఇందుక్కారణం.

ఎంటీఎన్ఎల్, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ తమ భూములు, భవనాలు, టవర్లు, ఫైబర్ విక్రయం ద్వారా మొత్తం రూ.12,984.86 కోట్లను ఆర్జించింది. ఈ విషయాన్ని కేంద్ర కమ్యూనికేషన్ల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నిన్న లోక్‌సభలో తెలిపారు. తమ ప్రధాన కార్యకలాపాలకు వినియోగించని ఆస్తులనే ఆయా సంస్థలు నగదీకరణ చేశాయని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ఆమోదించిన విధానానికి అనుగుణంగానే ఆస్తుల మానిటైజేషన్ జరుగుతుందని వెల్లడించారు. భూమి, భవనాల విక్రయం ద్వారానే 2025 జనవరి నాటికి ఎంటీఎన్ఎల్ రూ.2,134.61 కోట్లు, బీఎస్ఎన్ఎల్ రూ.2,387.82 కోట్లు సమకూర్చుకుందన్నారు. ఈ ప్రకటన నేపథ్యంలో షేర్లు రాణిస్తున్నాయి. 10:50 గంటల సమయంలో ఎంటీఎన్ఎల్ షేర్లు 12.58 శాతం లాభంతో రూ.48.58 వద్ద ట్రేడవుతోంది.



# చాహల్‌తో డేటింగ్ వార్తలు.. మహ్‌వశ్ వైరల్ పోస్ట్

: టీమ్ ఇండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, రేడియో జాకీ మహ్‌వశ్ డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలోనే మహ్‌వశ్ తాజాగా ఇన్‌స్టా స్టోరీస్ వేదికగా ఒక ఆసక్తికర పోస్ట్ పెట్టారు. ఇటీవల ఓ కార్యక్రమంలో తనకు బెస్ట్ మెగా ఇన్‌ఫ్లుయెన్సర్ అవార్డు రావడంపై ఆమె స్పందించారు. "నేను ఈ స్థాయికి రావడం చూసి చిన్ననాటి మహ్‌వశ్ ఎంతో గర్వపడుతుంది. ఇది ఎంతో ప్రత్యేకమైన విషయం. ఏ తప్పు లేకుండా.. ఎలాంటి అసత్యాల గురించి పట్టించుకోకుండా మన పని మనం చేస్తూ ముందుకుసాగిపోవాలి" అని ఆమె రాసుకొచ్చారు. డేటింగ్ వార్తల వేళ ఆమె పెట్టిన ఈ పోస్ట్ ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయా కథనాలను ఉద్దేశించే ఆమె ఈవిధంగా పెట్టిందని పలువురు భావిస్తున్నారు.

చాహల్ తన భార్య ధనశ్రీతో విడాకులు తీసుకుంటున్నట్లు కొంతకాలంగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. దుబాయ్ వేదికగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను మహ్‌వశ్, చాహల్ కలిసి వీక్షించారు. మ్యాచ్‌కు ముందు ఓ సెల్ఫీ వీడియో, ఫొటోలను ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేశారు. వీరిద్దరూ కలిసి కన్పించడం ఇదే తొలిసారి కాదు. గతేడాది డిసెంబరులోనూ చాహల్‌తో కలిసి దిగిన ఓ ఫొటోను ఆమె షేర్ చేశారు. అప్పట్లోనే వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు రాగా.. మహ్‌వశ్ వాటిని తోసిపుచ్చింది. అవన్నీ నిరాధారమని, తప్పుడు కథనాలు సృష్టించొద్దని కోరింది. మరోవైపు, ఈ డేటింగ్ మరోసారి తెరపైకి రావడంతో మహ్‌వశ్ సోషల్‌మీడియా ఫాలోవర్స్ సంఖ్య పెరిగింది.

# 'కోర్ట్' హిట్.. తన సినిమా సేఫ్ అంటూ 'హిట్ 3' దర్శకుడు ఆసక్తికర పోస్ట్

తాను నిర్మాతగా వ్యవహరించిన 'కోర్ట్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాని (చేసిన వ్యాఖ్యలు వైరల్ అయిన విషయం తెలిసిందే. 'కోర్ట్' నచ్చకపోతే తన అప్‌కమింగ్ మూవీ 'హిట్ 3' చూడొద్దని బహిరంగంగా చెప్పారు. తాజాగా ఈ వ్యాఖ్యలను ఉద్దేశించి 'హిట్ 3' దర్శకుడు ఆసక్తికర పోస్ట్ పెట్టారు. ప్రియదర్శి ప్రధాన పాత్రలో రామ్‌జగదీశ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కోర్ట్'. మార్చి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా దీని పెయిడ్ ప్రీమియర్స్ ప్రదర్శించగా ఇది మంచి ప్రేక్షకాదరణతో హిట్ టాక్ సొంతం చేసుకుంది. దీంతో తన సినిమా సేఫ్ అంటూ శైలేశ్ కొలను పోస్ట్ పెట్టారు.



"నా సినిమా సేఫ్ (హిట్ 3). 'కోర్ట్' సినిమాలో ఎన్నో భావోద్వేగాలు ఉన్నాయి. ఇది కచ్చితంగా అందరికీ నచ్చుతుంది. అందరూ చూడాల్సిన చిత్రమిది. మూవీ యూనిట్‌కు నా అభినందనలు. ప్రియదర్శి.. నువ్వు మరో విజయం సాధించావు. ఇక నా 'హిట్ 3' ఎడిట్ రూమ్‌కు వెళ్లాలి. అందరూ కోర్ట్ సినిమా చూడండి" అని పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్‌కు 'మిర్చి'లో ప్రభాస్ పోస్టర్‌ను జోడించారు. మిర్చిలో ప్రభాస్ 'నా ఫ్యామిలీ సేఫ్' అని డైలాగు చెప్పే ఇమేజ్‌లను శైలేశ్ కొలను పంచుకున్నారు. అంటే 'కోర్ట్'కు హిట్ టాక్ వచ్చింది కాబట్టి 'హిట్ 3' సినిమా సేఫ్ అని తన పోస్ట్‌తో వివరించారు.

'హిట్ 3' విషయానికొస్తే.. 'హిట్' యూనివర్స్‌లో భాగంగా రూపొందుతోన్న సరికొత్త చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. నాని కథానాయకుడిగా శైలేశ్ కొలను దర్శకత్వంలో ఈ సినిమా సిద్ధమవుతోంది. ఇందులో నాని పవర్‌ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో అర్జున్ సర్కార్‌గా కనిపించనున్నారు. మే 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల దీని టీజర్‌ను విడుదల చేయగా దానికి భారీ స్పందన వచ్చింది. 24 గంటల్లోనే 16 మిలియన్లకు పైగా వ్యూస్ సొంతం చేసుకుంది.

# అందుకే సోషల్ మీడియాకు దూరంగా ఉంటా: జాన్ అబ్రహం

సినిమాలో అద్భుతమైన నటన కనబరచడం ఎంత ముఖ్యమో దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం కూడా అంతే ముఖ్యం. తమ సినిమాలను సోషల్ మీడియా ద్వారా ప్రేక్షకులకు మరింత చేరువచేస్తుంటారు నటీనటులు. అయితే బాలీవుడ్ హీరో జాన్ అబ్రహం మాత్రం తనకు సోషల్ మీడియా నచ్చదని చెప్పారు. సినిమాల ప్రచారం కోసం కూడా దాన్ని తక్కువగా ఎంచుకుంటానన్నారు.



తన తాజా చిత్రం ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో జాన్ అబ్రహం సోషల్ మీడియా గురించి మాట్లాడారు. "ఈ రోజుల్లో ప్రజలు ఎదుర్కొంటోన్న పెద్ద సమస్యల్లో గుర్తింపు ఒకటి. తెలియని వ్యక్తుల నుంచి గుర్తింపు కోరుకుంటున్నారు. అది చాలా భయంకరంగా మారింది. రోజూ మనం ఏం చేసినా వాటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. దాని ఆధారంగా ఎదుటివారు మన గురించి ఒక నిర్ణయానికి వచ్చేస్తున్నారు. నా దృష్టిలో అది అంత అవసరమైన విషయం కాదు. ఏది ముఖ్యమో, ఏది కాదో.. అందరూ అర్థం చేసుకోవాలి. సినీ పరిశ్రమలోని వారికి కూడా ఇదే వర్తిస్తుంది. నేను ఎన్నో సంవత్సరాలుగా ఇలానే ఉంటున్నాను. సోషల్ మీడియాలో ఎక్కువ యాక్టివ్‌గా ఉండను" అన్నారు.

ప్రస్తుతం జాన్ అబ్రహం 'ది డిప్లొమాట్'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. శివమ్ నాయర్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ డ్రామా ఫిల్మ్‌గా ఇది రూపొందింది. భారతీయ దౌత్యవేత్త జేపీ సింగ్ నిజ జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 14న ప్రేక్షకుల ముందుకురానుంది.



# ఓటీటీలోకి 'ఆజాద్'.. స్ట్రీమింగ్‌కు సిద్ధమైన రవీనా టాండన్ కుమార్తె చిత్రం

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అజయ్ దేవ్‌గణ్ మేనల్లుడు అమన్ దేవ్‌గణ్, రవీనా టాండన్ కుమార్తె రషా థడానీ (%=ఖంప్తుఖ ఎ్తుఖఉఖఅఱ%) ప్రధాన పాత్రల్లో నటించిన తొలి చిత్రం 'ఆజాద్'. హిస్టారికల్ రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి అభిషేక్ కపూర్ దర్శకత్వం వహించారు. జనవరి 17న ఈ సినిమా విడుదలైంది. రషా థడానీ, అమన్ దేవ్‌గణ్ యాక్టింగ్ సినీ విమర్శకుల ప్రశంసలు అందుకున్నప్పటికీ బాక్సాఫీస్ వద్ద మాత్రం ఈ సినిమా ఆశించిన ఫలితాలు అందుకోలేకపోయింది. తాజాగా ఈ సినిమా ఓటీటీ రిలీజ్ కు రంగం సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా శుక్రవారం (మార్చి 14) నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సదరు ఓటీటీ సంస్థ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

బ్రిటిష్ కాలం నాటి పాలనలో సాగే ఓ పీరియాడిక్ డ్రామాగా 'ఆజాద్' రూపొందింది. చరిత్రాత్మకమైన హల్దీఘాట్ యుద్ధం ఆధారంగా దీన్ని తెరకెక్కించారు. ఓ తిరుగుబాటు నాయకుడి గుర్రంపై ఆప్యాయత పెంచుకున్న యువకుడు గోవిందా (అమన్ దేవ్‌గణ్).. ఆ నాయకుడి మరణం తర్వాత దాని సంరక్షణ బాధ్యత తీసుకుంటాడు. ఈ క్రమంలోనే అతడు జానకి (రషా థడానీ)తో ప్రేమలో పడతాడు. మరి, తమ ప్రేమను కాపాడుకోవడానికి అతడు ఏం చేశాడు? గోవిందా ఆ గుర్రంపై అంతటి ఆప్యాయత పెంచుకోవడానికి కారణం ఏమిటి? అన్న ఆసక్తికర అంశాలతో ఈ సినిమా సిద్ధమైంది. రోనీ స్క్రూవాలా దీనిని నిర్మించారు.


## నాలా అడుగేస్తే మీకు ఓ రోజు వస్తుంది

'నేను పరిశ్రమలోకి వచ్చి ఐదేళ్లవుతోంది. పది సినిమాలు చేశా. కిరణ్ కష్టపడుతున్నాడని నమ్ముతూ అంతా నా సినిమాలపై ఆదరణ చూపిస్తున్నారు. ఈ ప్రేమని, అభిమానాన్ని కాపాడుకుంటూ ఇకపైనా సినిమాలు చేస్తా" అన్నారు కిరణ్ అబ్బవరం (%ఖఱతీఖఅ ాూఎఋఖఝఖతీఖఎ%). ఆయన కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'దిల్‌రూబా' (%ణఱశ్రీతీబఋఖ%). రుక్సర్ ధిల్లాన్, నజియా దేవిసన్ కథానాయికలు. విశ్వకరుణ్ దర్శకత్వం వహించారు. రవి, జోజో జోస్, రాకేశ్‌రెడ్డి, విక్రమ్ మెహ్రా, సిద్ధార్థ్ ఆనంద్ కుమార్ నిర్మాతలు. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించింది.



కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "హోలీ పండుగ సంబరాల్లో మా సినిమా కూడా ఓ భాగం అవుతోంది. మహిళలంతా ఈ సినిమాకి వెళ్లాలి. వాళ్లపై గౌరవంతో ఈ సినిమా చేశాం. ప్రేక్షకులకు వినోదం గ్యారెంటీ. సినిమా పరిశ్రమకి ఎంతో నమ్మకంతో వచ్చి ఇక్కడ కష్టాలు పడలేక తిరిగి వెళ్లిపోయేవాళ్లని చాలామందిని చూశా. ధైర్యంగా అడుగేస్తే నాలాగా సంతోషంగా ఉండే రోజు వస్తుంది. ఊర్ల నుంచి సినిమాపై తపనతో వచ్చేవారిలో ఏటా పది మందికి నేను సాయం చేస్తుంటా. నా ప్రతి సినిమాలో 40, 50 మంది కొత్తవాళ్లకి అవకాశాలు కల్పిస్తుంటా. ఇకపైనా ఆ ప్రయత్నం కొనసాగిస్తా" అన్నారు. గురువారం సాయంత్రం పెయిడ్ ప్రీమియర్స్‌తోనే సినిమా విజయయాత్ర ప్రారంభం అవుతుందన్నారు నిర్మాతలు.

# కావాలని అలాంటి సీన్లు ఇరికించొద్దు



కరీనా కపూర్

కథను ముందుకు తీసుకెళ్లడానికి బోల్డ్ సన్నివేశాలు ముఖ్యం కాదనేది తన అభిప్రాయమని అంటోంది బాలీవుడ్ సీనియర్ నాయిక కరీనా కపూర్. మూడు దశాబ్దాలుగా ఎన్నో విజయవంతమైన సినిమాలతో చిత్రసీమను ఏలుతున్న కథానాయికీమె. గతేడాది 'క్రూ', 'సింగమ్ అగైన్' సినిమాలతో ప్రేక్షకుల్ని పలకరించిన కరీనా.. తెరపై బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి తనకి సౌకర్యంగా ఉండదని అంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. "మన సినీరంగంలో చాలా మంది నటీమణులు బోల్డ్ కంటెంట్ ఉన్న చిత్రాల్ని అంగీకరించడానికి ఆలోచిస్తుంటారు. ఎందుకంటే తెరపై అలా చేయడం నాకు కూడా సౌకర్యంగా ఉండకపోవచ్చు. నిజానికి నేను ఎప్పుడూ అలాంటి పాత్రల్లో నటించలేదు. సినిమాకు కచ్చితంగా సన్నిహితంగా ఉండే సన్నివేశాలు అవసరమనుకుంటేనే పెట్టాలి తప్పా.. ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేయడానికి కావాలని వీటిని ఇరికించొద్దు. పాశ్చాత్య దేశాల్లో ఎక్కువ చిత్రాలు మహిళల చుట్టూ.. ఇంటెన్స్ సన్నివేశాల చుట్టూ తిరుగుతుంటాయి. కానీ మన దేశంలో సంస్కృతి, సంప్రదాయాలకు విలువలెక్కువ. అందుకే భారతీయ చిత్రపరిశ్రమ అలాంటి సన్నివేశాలను కూడా తెరపై సంప్రదాయంగా చూపించడానికే ఆసక్తి చూపిస్తుంటుంద"ని చెప్పుకొచ్చింది కరీనా.

# అండగా నిలవాలి

మనం పరిసరాలను గమనిస్తూనే పెరుగుతాం. చుట్టుపక్కల వారిని అనుకరిస్తూనే నేర్చుకుంటాం. ఇవి పుట్టినప్పటి నుంచే అలవడతాయి. తల్లి కళ్లలోకి చూడటం, స్పర్శను గుర్తించటం, నవ్వితే నవ్వటం, మాటలకు స్పందించటం తొలిరోజుల్లోనే అబ్బుతాయి. నెమ్మదిగా తల్లిదండ్రుల మాటలను అనుకరించటం, అత్తాత్తా అనటం, ఇతర పిల్లలను చూసి సంతోషించటం, వారితో కలవటానికి ఆసక్తి చూపటం నేర్చుకుంటాం. ఆ తర్వాత పదాల మధ్య సంబంధాలను గుర్తించటం, అర్థవంతమైన మాటలు మాట్లాడటం, నలుగురితో కలివిడిగా ఉండటం, కలిసి ఆడుకోవటం వంటివీ సరే సరి. అప్రయత్నంగానే నేర్చుకునే ఇలాంటి భాషా, భావోద్వేగ, సామాజిక నైపుణ్యాలు చదువుకోవటానికి, తోటి పిల్లలతో కలవటానికి.. పెద్దయ్యాక సమాజంలో పైకి ఎదగటానికి, ఆటుపోట్లను ఎదుర్కోవటానికి ఎంతో అవసరం. ఆటిజమ్ బారినపడ్డ పిల్లల్లో ఇవే కొరవడతాయి. దీని ప్రభావాలు జీవితాంతం కొనసాగుతూ వస్తుంటాయి. అయితే తొలిదశలోనే చికిత్స చేస్తే సమస్య ముదరకుండా చూడొచ్చు. మిగతా పిల్లల మాదిరిగా జీవించేలా చేయొచ్చు. కాకపోతే ముందే గుర్తించటం, వారికి ఓపికగా అండగా నిలవటం ముఖ్యం




ఏంటీ సమస్య?

ఆటిజమ్అనేది మెదడు ఎదుగుదలతో ముడిపడిన సమస్య. వీరి మెదడు ఆకారం బాగానే ఉంటుంది గానీ కొన్ని భాగాల్లో లోపాలు సమస్యకు దారితీస్తాయి. మన మెదడులోని నాడీ కణాలు ఒకదాంతో మరోటి అనుసంధానమై సమాచారాన్ని అంది పుచ్చుకుంటాయి. మాట్లాడటం, నడవటం, సమయానికి అనుగుణంగా స్పందించటం వంటి పనులన్నీ దీని చలవే. ఆటిజమ్లో ఇదే లోపిస్తుంది. తల్లి కడుపులో ఉన్నప్పుడే.. పిండంలో మెదడు ఏర్పడే సమయంలోనే నాడీ కణాల కదలికలు, నాడీ కణాల వృద్ధి, ఇవి అనుసంధానం కావటానికి తోడ్పడే చివర్లు ఏర్పడటంలో లోపాలు తలెత్తటం ఆటిజమ్కు దారితీస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు.

ఎందుకొస్తుంది?

ఆటిజమ్ రావటానికి ప్రత్యేకించి ఒక కారణమంటూ లేదు. దీనికి రకరకాల అంశాలు దోహదం చేస్తాయి. అన్నింటికన్నా ప్రధానమైనవి జన్యు లోపాలు. తల్లిదండ్రుల నుంచి సంక్రమించే జన్యు లోపాలతోనే 60-80% వరకూ సమస్య తలెత్తుతుంది. కొన్ని క్రోమోజోముల్లో అసాధారణ మార్పులు ఆటిజమ్కు దారితీస్తుంటాయి. కాబట్టి ఒక బిడ్డ ఆటిజమ్తో పుట్టినట్టయితే మరోసారి సంతానాన్ని కనాలనుకుంటే జన్యు విశ్లేషణ చేయాల్సి ఉంటుంది.

గర్భం ధరించిన తర్వాత తొలి మూడు నెలల్లో తల్లికి పోషణలేమి, రక్తహీనత, ఇన్ఫెక్షన్లు రావటం.. పొగ, మద్యం అలవాట్లు.. కొన్నిరకాల మందులు వేసుకోవటమూ పిల్లల్లో ఆటిజమ్ ముప్పును పెంచొచ్చు.

కాన్పు సమయంలో బిడ్డ మెదడు దెబ్బతిన్నా ఆటిజమ్కు దారితీయొచ్చు. పుట్టిన వెంటనే ఏడ్వకపోవటం వల్ల మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకపోవటం, తక్కువ బరువుతో పుట్టటం కూడా కారణం కావొచ్చు.

ఆలస్యంగా సంతానం కనేవారిలోనూ వీర్యం, అండం నాణ్యత దెబ్బతినటంతోనూ ఆటిజమ్ వచ్చే అవకాశముంది.

ప్రధాన లక్షణాలు

ఆటిజమ్ పిల్లలు పుట్టినప్పుడు బాగానే ఉండొచ్చు. పైకి ఎలాంటి తేడా కనిపించక పోవచ్చు. అయితే ఎదుగుతున్నకొద్దీ.. ముఖ్యంగా రెండేళ్లు వచ్చేటప్పటికి లక్షణాలు బయటపడుతుంటాయి.

భావ వ్యక్తీకరణ లోపం: కొందరు పిల్లల్లో మాటలు ఆలస్యం కావటం, వచ్చినా సరిగా రాకపోవటం, పూర్తి వాక్యాలను పలక లేకపోవటం కనిపిస్తుంటాయి. వీరికి జవాబు చెప్పటం తెలియదు. ఏదైనా అడిగితే దాన్నే తిరిగి వల్లె వేస్తుంటారు. ఉదాహరణకు- నీ పేరేంటని అడిగితే.. తమ పేరు చెప్పకుండా తిరిగి నీ పేరేంటి? అని అడుగుతారు. సమయం, సందర్భం లేకుండా తమకు తెలిసిన విషయాన్నే మళ్లీ మళ్లీ చెబుతుంటారు. కొందరు తమకు అవసరమైన వాటిని నోటితో చెప్పలేరు కూడా. ఆయా వస్తువులను వేలితో చూపిస్తుంటారు. కొందరు సైగలతోనూ భావాలను వ్యక్తం చేయలేకపోవచ్చు. వీరి ముఖంలో భావాలూ పలకవు.

ఇతరులతో కలవలేకపోవటం: మామూలుగా పిల్లలు తోటివారితో కలివిడిగా ఉంటారు. చక్కగా కలిసి ఆడుకుంటారు. పిల్లల మానసిక ఎదుగుదలలో ఇది చాలా ముఖ్యమైన విషయం. అయితే ఆటిజం పిల్లలు ఇతరులతో కలవటానికి ఇష్టపడరు. ఒంటరిగా ఉండటానికి ఇష్టపడుతుంటారు. ఒక్కరే ఆడుకోవటానికి ప్రయత్నిస్తుంటారు. తల్లిదండ్రులు పేరు పెట్టి పిలిచినా స్పందించరు. కళ్లలోకి నేరుగా చూడరు. శరీర హావభావాలను, ముఖంలో భావాలను, గొంతు హెచ్చుతగ్గుల వంటివాటినీ పోల్చుకోలేరు. నువ్వు నేను అనే తేడా తెలియకపోవటం, తల్లిదండ్రులను సొంతవారిగా భావించకపోవటమూ చూస్తుంటాం.

విచిత్ర ప్రవర్తన: కొందరిలో కొన్ని ప్రత్యేక ప్రవర్తనలూ కనిపిస్తుంటాయి. చేసిన పనులే మళ్లీ మళ్లీ చేయటం.. చేతులు, కాళ్లు అదేపనిగా ఊపటం, చప్పట్లు కొట్టటం, తమ చుట్టూ తాము తిరగటం, నోటితో రకరకాల చప్పుళ్లు వంటివి చేస్తుండొచ్చు. తిరుగుతున్న ఫ్యాన్ల వంటి వాటిని తదేకంగా చూస్తుండొచ్చు. కారు, బస్సు బొమ్మలతో కాకుండా వాటి చక్రాలతో ఆడుకుంటుండొచ్చు. ఒకే రకం వస్తువులను సేకరించటం.. వస్తువులను ఒకదాని వెనకాల మరోటి వరుసగా పేర్చటం చేస్తుంటారు. పనులను ఒకేలా, రోజూ అలాగే చేయటానికి ప్రయత్నిస్తుంటారు. ఏమాత్రం అటూఇటైనా చిరాకు పడతారు. ఇలా తమకు తాము స్థిమిత పడాలని చూస్తుంటారు.

జ్ఞానేంద్రియ లక్షణాలు: ఆటిజమ్లో జ్ఞానేంద్రియాలతో ముడిపడిన లక్షణాలూ ప్రధానమే. కొందరు చిన్న శబ్దాలనైనా తట్టుకోలేరు. కుక్క అరుపు, మిక్సీ చప్పుళ్ల వంటివి వినగానే భయపడి చెవులు మూసుకొని, పరుగెడుతుంటారు. మరికొందరు చేతులతో దబాదబా బాదుతూ పెద్ద శబ్దాలు చేస్తూ సంతోషిస్తుండొచ్చు కూడా. ఎదుటి వారిని చూసేటప్పుడు వంకరగా చూడొచ్చు. లేదూ కళ్లు మూసుకోవచ్చు. స్పర్శ విషయానికి వస్తే- కొందరు మెత్తటి దుస్తులు బాగా ఇష్టపడొచ్చు. కొందరికి గరుకు దుస్తులు నచ్చొచ్చు. అన్నం నమిలి మింగకపోవచ్చు. కొన్ని పదార్థాలు నచ్చకపోవచ్చు. ఉదాహరణకు- కొందరు పాలు నచ్చక కక్కేస్తుంటారు. వస్తువులను పదే పదే వాసన చూస్తుంటారు కూడా.

ఐదు రకాలు

ఆటిజమ్ లక్షణాలు అందరిలో ఒకేలా ఉండవు. కొందరిలో ఒకట్రెండే కనిపించొచ్చు. కొందరిలో ఎక్కువగా ఉండొచ్చు. తీవ్రంగా లేదా స్వల్పంగానూ ఉండొచ్చు. ఇవి మొదలైన వయసు, తీవ్రత, ముదురుతున్న తీరును బట్టి ఆటిజమ్ను ఐదు రకాలుగా విభజించొచ్చు.

1 ఆటిస్టిక్ డిజార్డర్: దీన్నే చైల్డ్హుడ్ ఆటిజమ్ అంటారు. ఎక్కువగా కనిపించే సమస్య ఇదే. ఇది ఆడపిల్లల్లో కన్నా మగవారిలో ఎక్కువ.

2 రట్స్ డిజార్డర్: ఏడాది తర్వాత లక్షణాలు కనిపించటం, రెండు మూడేళ్లలోనే తీవ్రం కావటం దీని ప్రత్యేకత. కొందరిలో వచ్చిన మాటలు వెనక్కి పోతుంటాయి. ఇది క్రమంగా ముదురుతూ వచ్చే సమస్య. కొంత కాలం తర్వాత నాడీ సమస్యలూ మొదలు అవుతాయి. కొందరికి ఫిట్స్ రావొచ్చు.

# విమాన ప్రయాణమా?

విమానంలో ప్రయాణించటం సరదాగానే అనిపిస్తుంది. సమయమూ ఆదా అవుతుంది. ఇది నరే గానీ విమాన ప్రయాణం కొన్ని ఆరోగ్య సమస్యలకూ దారితీయొచ్చు. విమానంలో పీడనం, ఉష్ణోగ్రత, ఆక్సిజన్ మోతాదులు మారిపోతుంటాయి. తేమ కూడా సముద్ర మట్టం కన్నా తక్కువగా ఉంటుంది. ఇవన్నీ శరీరం పనితీరు మీద ప్రభావం చూపుతాయి. వేర్వేరు టైమ్జోన్ల గుండా సాగటం, చుట్టూ చాలామంది ఉండటమూ కొన్ని చిక్కులు తెచ్చిపెడతాయి. కాబట్టి వీటి గురించి తెలుసుకొని, కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మంచిది.

ఒంట్లో నీటిశాతం తగ్గటం

విమానం కేబిన్లో తేమ చాలా తక్కువగా ఉంటుంది. ఎందుకంటే కేబిన్లో



తిరిగే గాలిలో సుమారు 50% తేమ బయటకు పోతుంది. మరీ ఎత్తుగా విమానం ప్రయాణిస్తున్నప్పుడైతే తేమ దాదాపు పూర్తిగానూ తగ్గుతుంది. దీంతో గొంతు, ముక్కు, చర్మం ఎండిపోయినట్టు అనిపిస్తుంది.

ఏం చేయాలి?: చేతి సంచీలో ఖాళీ వాటర్ బాటిల్ను పెట్టుకోవటం మంచిది. చెకింగ్ పూర్తయ్యాక బాటిల్లో నీళ్లు నింపి, విమానంలోకి తీసుకెళ్లటానికి వీలుంటుంది. విమానంలో ఇచ్చే తీపి పానీయాలకు బదులు అప్పుడప్పుడూ బాటిల్లో నీళ్లు తాగొచ్చు. గంటలకొద్దీ ప్రయాణం చేసేటప్పుడు ఇదెంతగానో ఉపయోగపడుతుంది. కాంటాక్టు లెన్సులు ధరించేవారు వీటికి బదులు అద్దాలు పెట్టుకోవాలి. దీంతో కళ్లకు అసౌకర్యం కలగకుండా చూసుకోవచ్చు. ముక్కు, కళ్లు, చర్మం పొడిబారతాయని భయపడేవారు ముక్కులో, కళ్లలో వేసుకునే చుక్కల మందు.. చర్మానికి రాసుకునే లోషన్లు వెంట తీసుకెళ్లటం మేలు.

శక్తి తగ్గటం

అధిక ఎత్తుల్లో గాలిలో పీడనం తగ్గుతుంది. దీనర్థం శరీరం ఆక్సిజన్ను తక్కువగా తీసుకుంటుందనే. నిజానికి విమాన సంస్థలు కేబిన్లో గాలి పీడనం తగ్గకుండా తగు చర్యలు తీసుకుంటాయి. అయినా కూడా సముద్ర మట్టంతో పోలిస్తే పీడనం తక్కువగానే ఉంటుంది. అందువల్ల విమాన ప్రయాణం చేస్తున్నప్పుడు ఒంట్లో ఆక్సిజన్ మోతాదులు పడిపోతాయి. దీంతో శక్తి సన్నగిల్లినట్టు అనిపిస్తుంది. ఒంట్లో నీటిశాతం తగ్గటమూ నిరుత్సాహానికి గురిచేస్తుంది. వేర్వేరు టైమ్జోన్లలో ప్రయాణించటం జెట్ ల్యాగ్కూ దారితీస్తుంది.

ఏం చేయాలి?: తగినంత నీరు తాగటం ముఖ్యం. ఒకట్రెండు గంటల కన్నా ఎక్కువసేపు ప్రయాణం చేయాల్సి వస్తే అప్పుడప్పుడు సీటులోంచి లేచి, కేబిన్లో అటూఇటూ నాలుగడుగులు వేయటం మంచిది. సీటులో కూర్చున్నప్పుడూ కాళ్లూ చేతులూ సాగదీయొచ్చు. నేల మీది నుంచి వస్తువులను కాలి వేళ్లతో పట్టుకుంటున్నట్టు చేయొచ్చు. వేళ్లను, మడమలను కదిలించొచ్చు. వీటితో రక్త ప్రసరణ మెరుగవుతుంది. ఒకవేళ ఒకట్రెండు రోజుల పాటు వేర్వేరు టైమ్ జోన్లలో ప్రయాణిస్తున్నట్టయితే మన టైమ్ జోన్ ప్రకారం నిద్ర వేళలను పాటించాలి.

చెవి దిబ్బడ

విమానం కేబిన్లో పీడనం మారుతున్నకొద్దీ లోపలి చెవుల్లోని గాలి పీడనం దానికి అనుగుణంగా సరిదిద్దుకోవటానికి ప్రయత్నిస్తుంది. దీని మూలంగానే శరీరం తూలకుండా ఉంటుంది. విమానం గాల్లోకి లేస్తున్నప్పుడు, కిందికి దిగుతున్నప్పుడు వేగంగా పీడనంలో మార్పులు తలెత్తుతాయి. ఈ సమయాల్లో మధ్య చెవి, యూస్టేషియన్ గొట్టాల చుట్టూ ఒత్తిడి పెరుగుతుంది. దీన్ని సరిచేసుకునే క్రమంలో చెవులు దిబ్బడేస్తాయి. కదలికలకు సంబంధించి మెదడుకు విరుద్ధ సంకేతాలు అందటం వల్ల కొందరికి వికారం వచ్చినట్టూ అనిపించొచ్చు.

ఏం చేయాలి?: విమానం గాల్లోకి లేస్తున్నప్పుడు, కిందికి దిగుతున్నప్పుడు గుటక వేయటం లేదా ఆవలించటం ద్వారా మధ్య చెవి మీద ఒత్తిడి నియంత్రణలోకి వస్తుంది. చెవి దిబ్బడ తొలగుతుంది. వికారం రాకుండా ఉండటానికి రెక్కల వద్ద ఉండే విండో సీటులో కూర్చోవటం మంచిది. ఇక్కడ కదలిక కోణం తక్కువగా ఉంటుంది. ఆకాశం, భూమి కలిసే దృశ్యం కనిపిస్తుంది.

కడుపుబ్బరం

విమానం గాల్లో ఎగురుతున్నప్పుడు కేబిన్లో పీడనం తగ్గుతుంది. దీంతో పొట్టలోని గ్యాస్ విస్తరిస్తుంది. జీర్ణకోశంలో, పేగుల్లో నిండిపోతుంది. దీంతో కడుపు ఉబ్బినట్టు అనిపిస్తుంది. బెల్టు బిగుతుగా అవుతుంది.

ఏం చేయాలి?: చిక్కుళ్లు, ఉల్లి, వెల్లుల్లి, కొన్నిరకాల గింజ పప్పులు, పాల ఉత్పత్తులు, పండ్లు గ్యాస్ ఏర్పడేలా చేస్తాయి. ప్రయాణానికి ముందు రోజు నుంచే ఇలాంటి పదార్థాలు తినకుండా చూసుకోవాలి. ప్రయాణంలోనూ సరిపోయే ఆహారాన్నే తినాలి. తగినంత నీరు తాగాలి. కాఫీ, టీ తగ్గించుకోవాలి.

# వ్యాయామంతో కంటి నిండా నిద్ర

కంటి నిండా నిద్రపోవాలని అనుకుంటున్నారా? అయితే క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. రోజూ కాకపోయినా వారానికి కనీసం రెండు, మూడు సార్లు చేసినా చాలు. ఇలాంటివారికి రాత్రిపూట నిద్ర బాగా పడుతున్నట్టు తాజా అధ్యయనంలో బయటపడింది. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే ఆరోగ్యం ఇనుమడిస్తుందన్న సంగతి కొత్తేమీ కాదు. కంటి నిండా నిద్ర పట్టటానికి, నిద్రలేమి లక్షణాలు తగ్గటానికి శారీరక శ్రమ తోడ్పడుతున్నట్టు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే ఇందుకు లింగ భేదం, వయసు, బరువు, శరీర సామర్థ్యం, మొత్తంగా ఆరోగ్యం, వ్యాయామ రకాలు ఎంతవరకు దోహదం చేస్తాయన్నది కచ్చితంగా తెలియదు. దీన్ని గుర్తించటానికే శాస్త్రవేత్తలు ప్రయత్నించారు. సుమారు 4400 మందిని ఎంచుకొని వారానికి ఎన్నిసార్లు, ఎంతసేపు, ఎంత తీవ్రతతో వ్యాయామం చేస్తున్నారు? వీరిలో నిద్రలేమి లక్షణాలు ఎలా ఉన్నాయి? రాత్రిపూట ఎంతసేపు పడుకుంటున్నారు? పగటిపూట ఎంతవరకు మగతగా ఉంటున్నారు? అనే విషయాలను నిశితంగా పరిశీలించారు. వారానికి కనీసం రెండు, అంతకన్నా ఎక్కువసార్లు (వారానికి గంట, అంతకన్నా ఎక్కువసేపు) వ్యాయామం చేసేవారిని



చురుకుగా ఉన్నవారిగా పరిగణనలోకి తీసుకున్నారు. ఇలాంటివారికి నిద్రలేమి ముప్పు 42% తక్కువగా ఉంటోందని గుర్తించారు. అలాగే వీరిలో నిద్రలేమి లక్షణాలు 22-40 శాతం వరకూ తక్కువగా ఉంటున్నట్టు వెల్లడైంది.

# మధుమేహానికి యోగా కళ్లెం

ధుమేహం బారిన పడకూడదని భావిస్తున్నారా? అయితే జీవనశైలి మార్పులతో పాటు యోగానూ సాధన చేయండి. ఇవి రెండూ కలిస్తే మంచి ఫలితం కనిపిస్తున్నట్టు డయాబిటిస్ అండ్ మెటబాలిక్ సిండ్రోమ్: క్లినికల్ రిసెర్చ్ అండ్ రివ్యూ పత్రికలో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంది. దీన్ని చాలావరకూ హైదరాబాద్ నగరం, ఆంధ్రప్రదేశ్లోని ఉంగుటూరు గ్రామంలోనే నిర్వహించటం గమనార్హం.

రక్తంలో గ్లూకోజు ఎక్కువగానే ఉన్నా మధుమేహంగా గుర్తించేంత స్థాయిలో లేకపోతే ముందస్తు మధుమేహం (ప్రిడయాబిటిస్)గా భావిస్తారు. ఈ దశలో ఉన్నవారికి డాక్టర్లు ఆహారంలో పిండి, కొవ్వు పదార్థాలు తగ్గించటం, వ్యాయామం చేయటం వంటి జీవనశైలి మార్పులను సూచిస్తుంటారు. దీంతో పూర్తిస్థాయి మధుమేహంలోకి జారకుండా చూసుకోవచ్చు. ఒకవేళ మధుమేహం తలెత్తినా ఆలస్యం చేసుకోవచ్చు. అయితే ఇదొక్కటే కాకుండా యోగానూ పాటించటం మంచిదని మనదేశంలోని ఐదు వైద్య సంస్థల్లో నిర్వహించిన అధ్యయనం సూచిస్తోంది. ముందస్తు మధుమేహం గల కొందరికి జీవనశైలి మార్పులు, మరికొందరికి జీవనశైలితో పాటు యోగానూ చేయాలని సిఫారసు చేశారు. ఇందుకోసం శరీర ఎత్తు, బరువుల నిష్పత్తి కనీసం 23 గల 30-70 ఏళ్ల వయసు వారిని ఎంచుకున్నారు. వీరిని మూడేళ్ల తర్వాత పరిశీలించగా.. జీవనశైలి మార్పులను మాత్రమే పాటించినవారిలో 18.9% మందికి మధుమేహం వచ్చింది. జీవనశైలి మార్పులతో పాటు యోగానూ సాధన చేసినవారిలో 11.5% మందిలోనే మధుమేహం తలెత్తింది. ముఖ్యంగా రక్తంలో గ్లూకోజు మూడునెలల సగటు మోతాదులను తెలిపే హెచ్బీఏ1సీ 6, అంతకన్నా ఎక్కువగా గలవారికి యోగా మేలు చేస్తున్నట్టు బయటపడింది. మధుమేహ నివారణ పద్ధతుల్లో యోగానూ సమ్మిళితం చేస్తే మరింత ఎక్కువ ప్రయోజనం కలుగుతున్నట్టు ఈ అధ్యయన ఫలితాలు చెబుతున్నాయి. మధుమేహ నివారణకు సూచించే ప్రామాణిక జీవనశైలి మార్పుల ప్రభావాలు యోగాతో మరింతగా పెరుగుతుండటం విశేషం.

యోగాతో ప్రయోజనమెలా?

ఇన్సులిన్ నిరోధకత (కణాలు ఇన్సులిన్కు స్పందించకపోవటం), మధుమేహం తలెత్తటానికి మానసిక ఒత్తిడి కూడా పెద్ద ముప్పు కారకమే. ఇందులో హైపోథలమస్, పిట్యుటరీ గ్రంథి, అడ్రినల్ గ్రంథి మధ్య సంబంధం (హెచ్పీఏ) దీర్ఘకాలంగా ప్రేరేపితం కావటం కీలక పాత్ర పోషిస్తుండొచ్చని భావిస్తున్నారు.

# నాడీ కణాలు దెబ్బతింటే దీర్ఘకాల జ్ఞాపకాలు

మెదడులోని నాడీ కణాల్లో వాపు ప్రక్రియ (ఇన్ఫ్లమేషన్) తలెత్తటాన్ని హాని కరమైందనే భావిస్తాం.మెదడులోని నాడీ కణాల్లో వాపు ప్రక్రియ (ఇన్ఫ్లమేషన్) తలెత్తటాన్ని హాని కరమైందనే భావిస్తాం. ఇది అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి జబ్బులకు



దారి తీస్తుంది మరి. కానీ మెదడు భాగమైన హిప్పో క్యాంపస్లోని కొన్ని నాడీకణాల్లో పుట్టుకొచ్చే వాపు ప్రక్రియ దీర్ఘకాల జ్ఞాపకాలు ఏర్పడటానికి కీలకమంటే నమ్ముతారా? ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజమేనని ఆల్బర్ట్ ఐన్స్టీన్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్ శాస్త్రవేత్తల అధ్యయనంలో బయటపడింది. మన మెదడులో హిప్పోక్యాంపస్ను జ్ఞాపక కేంద్రం అనుకోవచ్చు. దీనిలోని కొన్ని నాడీ కణాల డీఎన్ఏ దెబ్బనటం, మరమ్మతు కావటం.. ఒక చట్రంలా కొనసాగుతూ రావటం వల్ల స్థిరమైన జ్ఞాపకాల సముచ్చయాలు ఏర్పడుతున్నట్టు తేలింది. మనకు చిన్నప్పటి సంఘటనల వంటి పాత విషయాలు గుర్తుండటానికి తోడ్పడేవి ఈ సముచ్చయాలే కావటం విశేషం. ఎలుకలకు స్వల్పంగా, ఒక మాదిరిగా షాక్ ఇవ్వటం ద్వారా ఈ జ్ఞాపకాలు ఏర్పడే ప్రక్రియను శాస్త్రవేత్తలు గుర్తించారు. షాక్ ఇచ్చిన తర్వాత ఎలుకల మెదడులో హిప్పోక్యాంపస్లోని నాడీ కణాలను పరిశీలించగా.. వాపు ప్రక్రియ సమాచార మార్గంలో పాలు పంచుకునే జన్యువులు ఉత్తేజితమైనట్టు బయటపడింది. మొదట్లో ఇన్ఫెక్షన్ మూలంగా వాపు ప్రక్రియ ఉత్తేజితమైందని శాస్త్రవేత్తలు భావించారు. కానీ మరింత నిశితంగా పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన విషయం వెలుగులోకి వచ్చింది. హిప్పోక్యాంపస్ కణాల సముచ్చయాల్లోనే వాపు ప్రక్రియ ప్రేరేపితమైందని, ఇది డీఎన్ఏ దెబ్బతినటానికి నిదర్శనమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మెదడు చర్యల్లో భాగంగా డీఎన్ఏ తరచూ అక్కడక్కడా స్వల్పంగా విచ్ఛిన్నమవుతుంటుంది. ఇవి నిమిషాల్లోనే మరమ్మతు అవుతాయి కూడా. కానీ హిప్పోక్యాంపస్లోని నాడీ కణాల్లో డీఎన్ఏ దెబ్బతినటం గణనీయంగా, ఎక్కువకాలం కొనసాగుతుండటం విచిత్రం.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy